సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 152

గురువారం 22-8-2019

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

మందగమన నష్టాలు

11,000 పాయింట్ల దిగువకు నిఫ్టీ. సెన్సెక్స్ 268 పాయింట్లు డౌన్ - బిజినెస్‌లో

మొదలైంది వేట...

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ప్రిక్వార్టర్స్‌లోకి సింధు, సైనా -స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఇదీ.. చిదంబరం చిట్టా -5లో

చిదంబరం అరెస్ట్

ఐఎన్ఎక్స్ మీడియా నగదు అక్రమ చలామణి కేసులో అదుపులోకి తీసుకున్న సీబీఐ

- అరెస్ట్‌కు ముందు.. రోజంతా హైడ్రామా
- ముందస్తు బెయిల్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో అదృశ్యమైన కేంద్రమాజీ మంత్రి
- హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు చిదంబరం
- తక్షణమే విచారించలేమని, శుక్రవారానికి వాయిదా వేసిన అత్యున్నత న్యాయస్థానం
- రాత్రి కాంగ్రెస్ కార్యాలయంలో చిదంబరం ప్రత్యక్షం; మీడియాకు కేసుపై వివరణ
- అక్కడి నుంచి నేరుగా తన నివాసానికి; చిదంబరం నివాసంలోనే అరెస్ట్

న్యూఢిల్లీ

ఐఎన్ఎక్స్ మీడియాకు సంబంధించిన నగదు అక్రమ చలామణీ కేసులో యూపీఏ హయాంలో కీలక హోం, ఆర్థిక శాఖల మంత్రిగా విధులు నిర్వర్తించిన కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరంను సీబీఐ అధికారులు బుధవారం రాత్రి అరెస్ట్ చేశారు. థ్రిల్లర్ సినిమాను తలపించే ఉత్కంఠభరిత మలుపుల నడుమ ఎట్టకేలకు చిదంబరం నివాసంలోనే ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రి ఆయనను సీబీఐ ప్రధాన కార్యాలయంలోనే ఉంచనున్నారు. గురువారం ఉదయం సీబీఐ ప్రత్యేకకోర్టులో చిదంబరంను హాజరుపర్చే అవకాశముంది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ముందస్తు బెయిల్‌ను నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు మంగళవారం తీర్పునిచ్చిన నేపథ్యంలో ఈ అరెస్ట్ చోటు చేసుకుంది. అరెస్ట్ నుంచి తక్షణమే ఊరట కోరుతూ బుధవారం సుప్రీంకోర్టులో చిదంబరం తరపు న్యాయవాదులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తక్షణ విచారణ కుదరదని, మిగతా 2వ పేజీలో ▶

థ్రిల్లర్ మూవీలా..

చిదంబరం అరెస్ట్ వ్యవహారం బుధవారం దేశ రాజధానిలో థ్రిల్లర్ సినిమాలా సాగింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుప్రీం కోర్టులో ఒక ఎపిసోడ్ కొనసాగింది. చిదంబరానికి అరెస్ట్ నుంచి ఊరట కల్పించేందుకు అక్కడ ఆయన తరపు లాయర్లు కపిల్ సిబల్, సల్మాన్ ఖుర్షీద్, ఇందిరా జైసింగ్ శతవిధాలా ప్రయత్నించారు. కానీ వారి ప్రయత్నం ఫలించలేదు. అనూహ్యంగా రాత్రి 8 గంటలకు ఏఐసీసీ కార్యాలయానికి వచ్చిన చిదంబరం మీడియాకు తన వాదనను చెప్పేసి.. అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపోయారు. సీబీఐ అధికారులు మొదట ఏఐసీసీ ఆఫీస్‌కు, తర్వాత ఆయన ఇంటికి వెళ్లారు. చిదంబరంను అదుపులోకి తీసుకుని సీబీఐ హెడ్ క్వార్టర్స్‌కు తరలించారు.

క్షణ.. క్షణం

బుధవారం రాత్రి

- 7:55 కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకున్న చిదంబరం
- 8:05 మీడియాకు తన వాదన వినిపించిన చిదంబరం
- 8:20 అక్కడి నుంచి వెళ్లిపోయిన చిదంబరం
- 8:25 కాంగ్రెస్ హెడ్‌క్వార్టర్‌కు చేరుకున్న సీబీఐ టీమ్
- 8:30 సీబీఐ అధికారులను అడ్డగించిన కాంగ్రెస్ శ్రేణులు
- 8:40 జోర్‌బాఘ్‌లోని నివాసానికి చేరుకున్న చిదంబరం
- 8:55 చిదంబరం ఇంటికి వచ్చిన సీబీఐ అధికారులు
- 9:00 గేటు వేసి ఉండటంతో గోడ దూకి వెళ్లిన అధికారులు
- 9:05 చిదంబరం ఇంటికి మరో సీబీఐ టీమ్, ఈడీ బృందం, ఢిల్లీ పోలీసుల రాక
- 9:40 చిదంబరంను అదుపులోకి తీసుకున్న అధికారులు
- 9:46 సీబీఐ హెడ్ క్వార్టర్స్‌కు తరలింపు
- 10:10 చిదంబరంను అరెస్టు చేసినట్లు ప్రకటన

బుధవారం సిద్దిపేట జిల్లా సింగాయిపల్లి అడవిలో అటవీ అభివృద్ధిపై కలెక్టర్లకు సూచనలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

అడవంత ఆనందం

అదే లక్ష్యంగా అడవుల పునరుద్ధరణపై శ్రద్ధ పెట్టాలి: కేసీఆర్

గజ్వేల్ స్ఫూర్తిగా అటవీ పునరుద్ధరణకు పూనుకోవాలి

రాష్ట్రంలో 23.4 శాతం అటవీ భూమి ఉన్నా, ఆ మేరకు అడవులు లేవు

మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు పునరుద్ధరణ బాధ్యత తీసుకోవాలి

గజ్వేల్ పర్యటనలో కలెక్టర్లకు ముఖ్యమంత్రి ఆదేశం

అటవీ పునరుద్ధరణను స్వయంగా చూపించిన సీఎం

కోమటిబండలో మిషన్ భగీరథ ప్లాంట్ సందర్శన

అనంతరం కొత్త రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలపై సమీక్ష

సాక్షి, హైదరాబాద్/సిద్ధిపేట/గజ్వేల్

అడవులు విరివిగా ఎక్కడ పెరిగితే ఆ ప్రాంతంలోని ప్రజలు ఆనందంగా ఉంటారు.. ఆకుపచ్చ తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా, హరిత జిల్లాల ఏర్పాటుకు కలిసి కట్టుగా పని చేయాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.. కలెక్టర్లు, మంత్రులకు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని సింగాయిపల్లి, నెంటూరు, కోమటిబండ ప్రాంతాల్లో మూడేళ్ల క్రితం చేపట్టిన అటవీ పునరుద్ధరణ పనులను బుధవారం మంత్రులు, కలెక్టర్లకు ఆయన చూపించారు. సింగాయిపల్లి అటవీ ప్రాంతంలో నాటిన మొక్కలను, గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని గజ్వేల్ షరీఫ్‌లో 160 హెక్టార్లలో నాటిన మొక్కలను పరిశీలించారు. అక్కడి నుంచి 2016లో మిషన్ భగీరథ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని మోదీ నాటిన మొక్కలను కలెక్టర్లు, మంత్రులకు చూపించారు.

పచ్చటి గజ్వేల్...

'తెలంగాణ ఏర్పడిన కొత్తలో గజ్వేల్ నియోజకవర్గంలోని అటవీ భూములు చెట్లు లేకుండా ఎడారిగా ఉండేవి. అడవుల పునరుద్ధరణే లక్ష్యంగా సమగ్ర ప్రణాళిక రూపొందించాం. ఆ ఫలితమే ఇప్పటి ఈ పచ్చటి గజ్వేల్. ఇక్కడ 27 రకాల పండ్ల మొక్కలను పెంచడంతో కోతులకు ఆహారం అందుతోంది. దీన్ని ఆదర్శంగా తీసుకుని.. మిగతా 2వ పేజీలో ▶

ఉల్లాసంగా... ఉత్సాహంగా

చుట్టూ పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య సీఎం కేసీఆర్ రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అటవీ ప్రాంతంలో చకచకా నడుస్తూ గత 3, 4 ఏళ్లలో అడవుల పునరుద్ధరణకు తీసుకున్న చర్యలను మంత్రులు, కలెక్టర్లకు వివరించారు. గజ్వేల్ పరిధిలోని సింగాయిపల్లి అడవిలో సెక్యూరిటీ అధికారులు మార్కు చేసిన ప్రాంతాన్ని కూడా కేసీఆర్ దాటి దాదాపు కిలోమీటర్ వరకు లోపలికి వెళ్లారు. అక్కడి వాతావరణం ఎంతో బాగుందని పలుమార్లు ప్రశంసించారు. దాదాపు గంటన్నరపాటు అడవి లోపలే గడిపారు. కోమటిబండ గుట్టపైకి ఎక్కి చుట్టూ అటవీ ప్రాంతాన్ని ఎలా అభివృద్ధి చేశారో వివరించారు.

జిల్లాకో ఈఎస్ఐ

- కార్మికులకు అత్యాధునిక వైద్యసేవలే లక్ష్యం
- సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో ఓపీడీ భవనానికి కేంద్ర మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ శంకుస్థాపన

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాకు ఒక ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ పేర్కొన్నారు. ఇప్పటికే 400 జిల్లాల్లో ఈఎస్ఐ ఆస్పత్రులను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. వచ్చే నాలుగేళ్లలో అన్ని జిల్లాల్లో ఈఎస్ఐ ఆస్పత్రులను తెరిచి కార్మిక కుటుంబాలకు అత్యాధునిక వైద్య సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రిలో నూతనంగా నిర్మించతల పెట్టిన ఓపీడీ భవనానికి బుధవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈఎస్ఐ ఆస్పత్రిని జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిని ఆదర్శ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కొత్తగా నిర్మించనున్న ఓపీడీ భవనాన్ని ఏడాదిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.124 కోట్లతో నిర్మిస్తున్న ఈ బ్లాకులో అత్యాధునిక సదుపాయాలు ఉంటాయన్నారు. కార్మికుల సంఖ్య తక్కువ ఉన్న చోట్ల మిగతా 2వ పేజీలో ▶

హైదరాబాద్‌లో అమెజాన్ అతిపెద్ద క్యాంపస్

- బిజినెస్‌లో

యూఎస్ కాన్సుల్ జనరల్‌గా

జోయల్ ఫ్రీమన్

సాక్షి, హైదరాబాద్

యూఎస్ నూతన కాన్సుల్ జనరల్‌గా జోయల్ ఫ్రీమన్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని కాన్సులేట్ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఢాకాలో యూఎస్ ఎంబసీలో ఆయన డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్‌గా, వాషింగ్టన్ డీసీలో బ్యూరో ఆఫ్ ఇంటెలిజెన్స్ అండ్ రీసెర్చ్‌లో సీనియర్ లైజన్ ఆఫీసర్‌గా పనిచేశారు. పలుదేశాల్లో అమెరికా తరపున వివిధ హోదాల్లో పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జోయల్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు రావడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గతంలో కాన్సుల్ జనరల్‌గా పనిచేసిన కేథరిన్ హడ్డా ఇటీవల పదవీ విరమణ చేసిన విషయం తెలిసిందే.

క్లుప్తంగా...

ఏప్రిల్ 1 నుంచి జనగణన

సాక్షి, హైదరాబాద్: జనాభా గణన 2020 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నిర్వహించనున్నారు. అసోం మినహా దేశంలోని మిగిలిన అన్ని ప్రాంతాల్లో జనగణన నిర్వహిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలో జనగణన నిర్వహణకు గెజిట్ ప్రకటనను జారీ చేస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సరళ్‌లో రాష్ట్రానికి 2వ ర్యాంకు

సాక్షి, హైదరాబాద్: స్టేట్ రూఫ్‌టాప్ అట్రాక్టివ్‌నెస్ ఇండెక్స్ (సరళ్)లో 72.2 స్కోరుతో తెలంగాణ రెండో స్థానంలో నిలవగా, 66.1 స్కోరుతో ఏపీ నాలుగో స్థానం సాధించింది. కర్ణాటక 78.8 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచింది. రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను ఆకర్షించడంలో రాష్ట్రాలకు ఉన్న అవకాశాలను మదించి కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ బుధవారం ఈ ర్యాంకులను ప్రకటించింది. సోలార్ రూఫ్‌టాప్‌ను ప్రోత్సహించేందుకు రాష్ట్రాలు అమలు చేస్తున్న విధానాలు, స్థానిక మార్కెట్ పరిస్థితులు, ఇతర సాంకేతికాంశాల ప్రాతిపదికన ఈ ర్యాంకులను కేటాయించింది. సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టుల అమలుకు సంబంధించి వినియోగదారుల అనుభవం విషయంలో తెలంగాణ అగ్రస్థానం సాధించిందని టీఎస్ఎస్పీడీసీఎల్ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది.

పోలీసు డ్రైవర్లకూ పాయింట్ల విధానం!

సాక్షి, హైదరాబాద్: ట్రాఫిక్ ఉల్లంఘనల నివారణకు గతంలో పోలీసులు తీసుకువచ్చిన పాయింట్ల విధానాన్ని త్వరలో సొంత శాఖలోనూ అమలు చేయనున్నారు. వివిధ పోలీసు అధికారుల వాహనాలు నడిపే డ్రైవర్లకూ ఈ పాయింట్ల విధానాన్ని వర్తింపజేసే యోచనలో పోలీసుశాఖ ఉన్నట్లు సమాచారం. కొంతకాలంగా నెటిజన్లు సామాజిక మాధ్యమాల ద్వారా పోలీసు డిపార్ట్‌మెంట్ ఉల్లంఘనలను నేరుగా డీజీపీకే పంపుతున్నారు. ఈ నేపథ్యంలో డిపార్ట్‌మెంట్ డ్రైవర్లకూ పాయింట్ల విధానాన్ని వర్తింపజేయాలన్న యోచనలో పోలీసుశాఖ ఉన్నట్లు తెలిసింది. ఈ విధానం ప్రకారం.. 12 పాయింట్లు దాటితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తారు.

23న పెన్షన్ అదాలత్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23న పబ్లిక్ గార్డెన్స్, ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం లో పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నామని పెన్షనర్ల జేఏసీ తెలిపింది. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, నల్లగొండ జిల్లాల పరిధిలోని పెన్షనర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొంది. కార్యక్రమంలో ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ కేఎస్ఆర్ మూర్తి, అధికారులు పాల్గొంటారు.

28న ఈపీఎఫ్ ఉద్యోగుల సమ్మె

ఈపీఎఫ్ స్టాఫ్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి కృపాకరణ్ వెల్లడి

కాచిగూడ: ఈపీఎఫ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఆల్ ఇండియా ఈపీఎఫ్ స్టాఫ్ ఫెడరేషన్ ఈనెల 28న ఒక రోజు సమ్మెను చేపట్టనుంది. ఈ మేరకు ఈపీఎఫ్ స్టాఫ్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్య దర్శి ఆర్.కృపాకరణ్ బుధవారం మీడియాకు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 1 నుంచి 27 వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్నామని, 19 నుండి 23వ తేదీ వరకు భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి 1న సత్యాగ్రహ దీక్ష

సీఎస్‌కు నోటీసు అందజేసిన పీఆర్టీయూ

సాక్షి, హైదరాబాద్: విద్యా రంగ సమస్యల పరిష్కారం, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల అమలుకు ఉత్తర్వుల జారీ, సీపీఎస్ రద్దు వంటి డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 1న సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు పీఆర్టీయూ-టీఎస్ వెల్లడించింది. బుధవారం ఈ మేరకు పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషిని కలసి ధర్నా నోటీసు అందజేశారు. త్వరగా సీఎం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఉత్తమ కలెక్టర్ అవార్డు అందుకున్న జగిత్యాల కలెక్టర్

సాక్షి, న్యూఢిల్లీ: జగిత్యాల జిల్లా కలెక్టర్ డా.ఏ.శరత్ ఉత్తమ కలెక్టర్ అవార్డు అందుకున్నారు. ఆంగ్ల పత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ నిర్వహించిన సర్వేలో శరత్ ఉత్తమ కలెక్టర్‌గా నిలిచారు. ప్రభుత్వ పథకాల అమలు, ఉత్తమ పాలన, వినూత్న ఆలోచనల అంశంపై దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని జిల్లాల కలెక్టర్ల పనితీరును పరిశీలించిన సంస్థ.. ఆయనను అవార్డుకు ఎంపిక చేసింది. బుధవారం ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో శరత్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, మరిన్ని ఉత్తమ ఫలితాలను సాధించేలా ముందుకు సాగుతానని ఈ సందర్భంగా శరత్ తెలిపారు.

బుధవారం కోమటిబండ అటవీ ప్రాంతాన్ని అధికారులకు చూపిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

కోమటిబండ మిషన్ భగీరథ ప్లాంట్‌ను పరిశీలించి బయటకు వస్తున్న కేసీఆర్

అడవంత ఆనందం

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలి. రాష్ట్రంలో 66.48 లక్షల ఎకరాల అటవీభూమి ఉంది. ఇది మన భూభాగంలో 23.4 శాతం. అడవుల పెంపకంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఇలా అందరూ భాగస్వాములు కావాలి. అడవుల్లో చెట్ల పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టాలి'అని కలెక్టర్లకు సీఎం సూచించారు. ఈ సందర్భంగా కోమటిబండలో ప్రారంభించిన మిషన్ భగీరథ ప్లాంట్‌ను కలెక్టర్లకు చూపించారు. అక్కడే వారితో కలసి మధ్యాహ్న భోజనం చేశారు.

మంకీస్ ఫుడ్ కోర్టులు...

కొత్త రెవెన్యూ, పంచాయతీరాజ్ చట్టం రూపకల్పన గురించి కలెక్టర్లతో కేసీఆర్ చర్చించారు. 'పల్లెలు, పట్టణాలు పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడాలి. ఇందుకోసం 60 రోజుల ప్రణాళిక రూపొందించుకోవాలి. ఎక్కడా అవినీతికి తావులేకుండా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగానే కొత్త రెవెన్యూ చట్టం రూపొందిస్తున్నాం. ఈ చట్టంతో రైతులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండొద్దు. అడవులు నశించడంతో పండ్లూఫలాలు లేక కోతులు ఊళ్లలోకి వస్తున్నాయి. కోతులు వాపస్ పోవాలంటే వాటికి అక్కడే ఆహారం లభించేలా చెట్లను పెంచాలి. ఫల, మేడి, మర్రి లాంటి 27 రకాల పండ్ల మొక్కలు నాటితే కోతులకు కావాల్సిన ఆహారం దొరుకుతుంది. అడవులు అంటే కోతులు, ఇతర జంతువులతో కళకళలాడుతూ ఉండాలి'అని చెప్పారు.

గచ్చకాయ చెట్టు పరిచయం చేసింది నేనే..

'అడవులు, చెలకలకు గచ్చకాయ చెట్టు కంచెగా ఉంటుంది. జంతువులు, మనుషులు కూడా లోపలికి వెళ్లలేరు. అటవీ అధికారులకు దాన్ని పరిచయం చేసింది నేనే'అని చెప్పిన కేసీఆర్ ఇలా నాటిన గచ్చకాయ చెట్లను కలెక్టర్లకు చూపించారు. ఎడారిగా ఉన్న సిద్దిపేట అటవీ భూముల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పంచిన కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, అటవీశాఖ అధికారుల పనితీరు భేష్ అని ముఖ్యమంత్రి ప్రశంసించారు. గజ్వేల్ అటవీ ప్రాంతంలో చేపట్టిన అడవుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని అటవీశాఖ పీసీసీఎఫ్ ఆర్.శోభ, అడిషనల్ పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్ కలెక్టర్లకు వివరించారు. అడవుల్లో ఉన్న రూట్ స్టాక్‌ను ఉపయోగించుకొని సహజమైన పద్ధతిలో చెట్ల పెంపకం చేపట్టామన్నారు. అడవి చుట్టూ కందకాలు తీశామని, దీంతో బయటి జంతువులు లోపలకు రావడంగానీ, లోపలి జంతువులు బయటకు వెళ్లడం కానీ సాధ్యం కాదన్నారు. ఆ కందకాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల చెట్లకు కావాల్సిన తేమ అందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఎ. ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఈటెల రాజేందర్, గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, నిరంజన్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు సంతోష్, ప్రభుత్వ ముఖ్య సలహాదారులు రాజీవ్‌శర్మ, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శేరి శుభాష్‌రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు భూంరెడ్డి, భూపతిరెడ్డి, ఎల్వన్‌రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ యాదవరెడ్డి, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, గజ్వేల్ ఆర్డీవో విజయేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ రాజయ్య పైతం పాల్గొన్నారు.

చిదంబరం నివాసం వద్ద మీడియాను, కార్యకర్తలను అదుపుచేస్తున్న అధికారులు

చిదంబరంను అరెస్టు చేసి తీసుకువెళ్తున్న అధికారులు

చిదంబరం అరెస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

శుక్రవారం లోపు ఈ కేసును విచారించలేమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. దాంతో మంగళవారం సాయంత్రం నుంచి కనిపించకుండా ఉన్న చిదంబరం తప్పనిసరి పరిస్థితుల్లో.. బుధవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రత్యక్షమయ్యారు. తాను ఎక్కడికీ పారిపోవడం లేదని, ఈ కేసులో తాను నిందితుడిని కాదని పేర్కొంటూ తన వాదనను మీడియాకు వినిపించారు. ఆ వెంటనే అక్కడినుంచి జోర్‌బాఘ్‌లోని తన నివాసానికి వెళ్లారు. కాసేపటికి అక్కడికి వెళ్లిన సీబీఐ అధికారులు ఉద్రిక్త పరిస్థితుల నడుమ.. ఆయనను అదుపులోకి తీసుకుని సీబీఐ ప్రధాన కార్యాలయానికి తరలించారు. చిదంబరం అరెస్ట్, అంతకుముందు చోటు చేసుకున్న పరిణామాలపై కాంగ్రెస్ మండిపడింది. ఇది మోదీ సర్కారు కక్ష సాధింపేనని, తామంతా చిదంబరం వెనకే ఉన్నామని స్పష్టం చేసింది.

ఢిల్లీలో హై ఓల్టేజ్ డ్రామా..

ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ముందస్తు బెయిల్‌ను నిరాకరిస్తూ మంగళవారం ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చిన క్షణం నుంచి.. చిదంబరం కేంద్రంగా దేశ రాజధానిలో ఉత్కంఠభరిత మలుపులతో హైడ్రామా కొనసాగింది. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి చిదంబరం అనూహ్యంగా అదృశ్యమయ్యారు. రెండు గంటల్లోగా తమ ముందు విచారణకు హాజరుకావాలంటూ మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత చిదంబరం ఇంట్లో సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థల అధికారులు నోటీసులు అంటించారు. అయినా, ఆచూకీ తెలియకపోవడంతో చివరకు లుక్ ఔట్ నోటీసులు జారీచేశారు. చిదంబరం దేశం విడిచి వెళ్లకుండా నిరోధించాలని అన్ని విమానాశ్రయాలకూ సమాచారమిచ్చారు. ఈ లోపు, ఢిల్లీ హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలంటూ చిదంబరం దాఖలు చేసుకున్న పిటిషన్‌ను తక్షణమే విచారించలేమన్న సుప్రీంకోర్టు.. ఆ విచారణను ఏకంగా శుక్రవారానికి వాయిదా వేస్తూ బుధవారం సాయంత్రం నిర్ణయం తీసుకుంది.

కాంగ్రెస్ కార్యాలయంలో ప్రత్యక్షం..

బుధవారం రాత్రి 8 గంటల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో చిదంబరం అనూహ్యంగా దర్శనమిచ్చారు. అక్కడి విలేకరుల సమావేశంలో తన వాదన వినిపించారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, సుప్రీంకోర్టులో దాఖలు చేసేందుకు రాత్రంతా(మంగళవారం) తన లాయర్లతో కలిసి పిటిషన్‌ను రూపొందించానన్నారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసుకు సంబంధించి సీబీఐ చార్జిషీట్లో తన పేరు లేదని వివరించారు. ఈ కేసు విచారణ సుప్రీంకోర్టులో శుక్రవారం ఉన్నందున.. చట్టాన్ని గౌరవిస్తూ అప్పటివరకు తనను అదుపులోకి తీసుకోవద్దంటూ దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీలను నర్మగర్భంగా కోరారు. చిదంబరం కాంగ్రెస్ కార్యాలయంలో ఉన్న విషయం తెలుసుకున్న సీబీఐ అధికారులు అక్కడికి వెళ్లేలోపే.. చెప్పాల్సింది చెప్పేసి వెంటనే కాంగ్రెస్ హెడ్ క్వార్టర్స్ నుంచి వెళ్లిపోయారు. అక్కడి నుంచి తన న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, కపిల్ సిబల్‌లతో కలిసి నేరుగా జోర్‌బాఘ్‌లోని తన ఇంటికి వెళ్లారు. చిదంబరంను అరెస్ట్ చేసేందుకు కాంగ్రెస్ కార్యాలయానికి వెళ్లిన సీబీఐ అధికారులు.. అక్కడి నుంచి ఆయన నివాసానికి వెళ్లారు. అక్కడ వారికి కాంగ్రెస్ శ్రేణుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. చిదంబరం ఇంటి గేట్ కూ డా వేసి ఉండటంతో, తప్పనిసరి పరిస్థితుల్లో ఓ పక్క నుంచి గోడ దూకి వారు ఇంట్లోకి వెళ్లారు. మరో పది నిమిషాల్లో సీబీఐకి చెందిన మరో టీమ్, ఈడీ అధికారుల బృందం కూడా అక్కడికి చేరుకున్నాయి. ఢిల్లీ పోలీసులు కూడా అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లిన సీబీఐ అధికారులు కాసేపు చిదంబరంను ప్రశ్నించి, అనంతరం అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ఆయనను తీసుకుని నేరుగా సీబీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు.

'అయోధ్య'హాల్ లోకి..

మొదట జస్టిస్ రమణ, జస్టిస్ శంతనుగౌండర్, జస్టిస్ అజయ్ రస్తోగిల ధర్మాసనం ముందు కపిల్ సిబల్ మొదట ఈ పిటిషన్ అంశం లేవనెత్తారు. తక్షణ విచారణ అవసరమా లేదా అని నిర్ణయించాల్సిందిగా ఆ పిటిషన్‌ను జస్టిస్ రమణ నేతృత్వంలోని ధర్మాసనం సీజేఐ వద్దకు పంపించింది. ఏ సమాచారం రాకపోవడంతో మధ్యాహ్న భోజన విరామం అనంతరం మళ్లీ సిబల్ జస్టిస్ రమణ ధర్మాసనం ముందు ఈ విషయాన్ని లేవనెత్తారు. పిటిషన్‌లో పొరపాట్లు ఉన్నాయని రిజిస్ట్రీ తమకు సమాచారమిచ్చారని, అందువల్ల, ఈ పిటిషన్‌ను తాము విచారించలేమని వారు స్పష్టం చేశారు. దాంతో కాసేపటి తరువాత ఆ కోర్టు హాలుకు వచ్చిన రిజిస్ట్రీ సూర్యప్రతాప్ సింగ్ ఆ పొరపాట్లు ఇప్పుడే సరిచేశారని, విచారణ జరిపే ధర్మాసనాన్ని నిర్ణయించే నిమిత్తం ఆ పిటిషన్‌ను సీజేఐ కార్యాలయానికి పంపించామని జస్టిస్ రమణ ధర్మాసనానికి తెలిపారు. సీజేఐ అయోధ్య కేసు విచారణలో ఉన్నారని, అది ముగిసేందుకు సాయంత్రం అవుతుందని, అందువల్ల మీరే విచారించాలంటూ కపిల్ సిబల్ జస్టిస్ రమణ ధర్మాసనాన్ని అభ్యర్థించారు. వారు నిర్ద్వంద్వంగా నిరాకరించడంతో.. సీజేఐ జస్టిస్ గొగోయి నేతృత్వంలో అయోధ్య కేసు విచారణ జరుగుతున్న కోర్టు హాల్లోకి కపిల్ సిబల్ వెళ్లారు. అక్కడ అయోధ్య విచారణ మధ్యలో.. అసాధారణ రీతిలో ఆ అంశాన్ని సిబల్ లేవనెత్తుతారేమోనన్న పలువురు భావించారు. కానీ రాజ్యాంగ ధర్మాసనం ముందు అలాచేయడానికి నిబంధనలు ఒప్పుకోనందువల్ల ఆ అంశాన్ని లేవనెత్తలేకపోయానని అనంతరం సిబల్ విలేకరులకు తెలిపారు. శుక్రవారం విచారణకు సీజేఐ నిర్ణయం తీసుకున్నారని తెలిసిన తరువాతే సుప్రీంకోర్టు ఆవరణ నుంచి కపిల్ సిబల్ బృందం వెళ్లిపోయింది. అదుపులోకి తీసుకున్న తర్వాత ఆర్ఎంఎల్ ఆసుపత్రిలో చిదంబరంకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సీబీఐ ప్రధాన కార్యాలయంలో ఉన్న సీబీఐ గెస్ట్ హౌజ్‌లోని 5వ నెంబర్ గదిని ఆయనకు కేటాయించారని సీబీఐ వర్గాలు తెలిపాయి.

బుధవారం ఉదయం నుంచీ సుప్రీంకోర్టులో..

బుధవారం ఉదయం నుంచి చిదంబరం బెయిల్ కేసుకు సంబంధించి అత్యున్నత న్యాయస్థానంలో హైడ్రామా కొనసాగింది. చిదంబరం బెయిల్‌కు సంబంధించిన పిటిషన్‌ను తక్షణమే విచారించాల్సిందిగా కపిల్ సిబల్ నేతృత్వంలోని న్యాయవాదులు పదేపదే జస్టిస్ ఎన్వీ రమణ ధర్మాసనాన్ని కోరారు. వారి అభ్యర్థనలను తోసిపుచ్చిన జస్టిస్ రమణ.. ఆ పిటిషన్లపై విచారణ ఎప్పుడు జరపాలన్నది ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ రంజన్ గొగోయి నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. ఆ తరువాత సాయంత్రం 5 గంటల సమయంలో శుక్రవారం ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తామని సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ ప్రకటించారు. అయితే, ఆ పిటిషన్‌ను ఎవరి నేతృత్వంలోని ఏ ధర్మాసనం విచారిస్తుందనేది గురువారం సాయంత్రం మాత్రమే తెలుస్తుంది.

జిల్లాకో ఈఎస్ఐ ఆస్పత్రి

▶ మొదటి పేజీ తరువాయి

ఈఎస్ఐ లబ్ధిదారులు కాని వారికి కూడా సేవలు అందించనున్నట్లు వివరించారు. వైద్యులు, నిపుణులు, సిబ్బంది కొరత లేకుండా ఎప్పటి కప్పుడు ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలోని 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులకు నెలకు కనీసం రూ.3,000 పింఛను అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రకటించాలి: కిషన్‌రెడ్డి

సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రకటించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. వైద్య సేవల రంగంలో కేంద్ర ప్రభుత్వం పలు విప్లవాత్మక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. జన ఔషధీ కేంద్రాల ద్వారా ప్రజలకు తక్కువ ధరలకే ఔషధాలు అందిస్తుందన్నారు. మోకాలి రీప్లేస్‌మెంట్, గుండె జబ్బులకు సంబంధించిన స్టెంట్స్‌ను తక్కువ ధరకే అందిస్తుందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద దేశంలో పది కోట్ల కుటుంబాలకు ఏటా రూ.5 లక్షల విలువైన వైద్య సేవలను అందిస్తుందని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని అమలు చేయాలని కోరారు. కార్మికుల కనీస వేతనాలు పెంచేట్లు ప్రైవేటు రంగంలో కార్మికుల కోసం కనీస వేతన విధానాన్ని ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. 'శ్రమ యోగి' పేరిట పలు కార్మిక పింఛన్లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఈఎస్ఐకి సంబంధించిన పెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈఎస్ఐ ఆసుపత్రుల పనితీరు రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల కంటే మెరుగ్గా ఉందని కితాబిచ్చారు.

అద్దె భవనాల్లో డిస్పెన్సరీలు: మల్లారెడ్డి

రాష్ట్రంలో 18 లక్షల మంది కార్మికులు ఈఎస్ఐ పరిధిలో ఉన్నారని రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి తెలిపారు. డిస్పెన్సరీలన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వాటికి శాశ్వత ప్రాతిపదికన భవనాలు నిర్మించేందుకు కేంద్ర కార్మిక శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. రామచంద్రపురం ఈఎస్ఐలో సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ కార్య క్రమంలో కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి హీరాలాల్ సమారియా తదితరులు పాల్గొన్నారు.

బుధవారం సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రిలో ఓపీడీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రులు సంతోష్ కుమార్ గంగ్వార్, కిషన్‌రెడ్డి, మంత్రి మల్లారెడ్డి. చిత్రంలో బీజేపీ నేత బండారు దత్తాత్రేయ

చంద్రయాన్-2కు చంద్రుడి కక్ష్య దూరం తగ్గింపు

సూళ్లూరుపేట: చంద్రయాన్-2 మిషన్‌కు మంగళవారం అర్ధరాత్రి 12.50 గంటలకు చంద్రుడి కక్ష్య (లూనార్ ఆర్బిట్)లో రెండోసారి కక్ష్య దూరాన్ని తగ్గించారు. బెంగళూరు సమీపంలోని బైలాలులో ఉన్న మిషన్ ఆపరేటర్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.శివన్ ఆధ్వర్యంలోని శాస్త్రవేత్తలు విజయవంతంగా ఈ ప్రక్రియను నిర్వహించారు. చంద్రయాన్-2 మిషన్‌ను మంగళవారం చంద్రుడి కక్ష్యలో చంద్రుడికి దగ్గరగా 114 కి.మీ., దూరంగా 18,072 కి.మీ. ఎత్తులో మొదటి విడత ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మంగళవారం అర్ధరాత్రి చంద్రుడి కక్ష్య దూరాన్ని తగ్గించే ప్రక్రియను శాస్త్రవేత్తలు చేపట్టారు. లూనార్ ఆర్బిట్ మొదటి విడతలో చంద్రుడికి దగ్గరగా ఉన్న 114 కి.మీ. దూరాన్ని 118 కి.మీ.కు స్వల్పంగా పెంచారు. చంద్రుడికి దూరంగా 18,072 కి.మీ. దూరాన్ని భారీగా తగ్గిస్తూ 4,412 కి.మీ. ఎత్తులోకి తీసుకొచ్చే ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. చంద్రయాన్-2 మిషన్ భూమ. ద్యంతర కక్ష్యలో ఉన్నప్పుడు కక్ష్య దూరాన్ని పెంచుకుంటూ పోతే, లూనార్ ఆర్బిట్‌లో ప్రవేశించాక కక్ష్య దూరాన్ని తగ్గించుకుంటూరావడం ఈ ప్రయోగంలో విశేషం. మిషన్ చంద్రు డికి దగ్గరగా 30 కి.మీ., దూరంగా 100 కి.మీ. చేరుకోవడం కోసం దూరాన్ని తగ్గించేందుకు మరో రెండుసార్లు ఆపరేషన్ చేపట్టేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఈ నెల 28న ఉదయం 5.30 గంటల నుంచి 6.30 గంటల మధ్యలో చంద్రుడి కక్ష్య దూరాన్ని మూడోసారి తగ్గించే ప్రక్రియను చేపట్టనున్నట్టు ఇస్రో ప్రకటించింది.

స్టోక్ కాంగ్రీ పర్వతాన్ని అధిరోహించిన విద్యార్థులు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణలకు చెందిన విద్యార్థులు జమ్మూకశ్మీర్ లడఖ్ ప్రాంతంలోని 6,153 మీటర్ల స్టోక్ కాంగ్రీ పర్వతాన్ని అధిహించారు. చిలకలూరిపేట సీఆర్ కాలేజీకి చెందిన ఆలూరి సాయికిరణ్, తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా ఎల్లికల్ గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి మల్లికార్జున, హన్మకొండకు చెందిన విట్స్ విద్యార్థి అఖిల్‌లు ఈ పర్వతాన్ని అధిరోహించారు. ముందుగా ఈనెల 15న పర్వతం బేస్ క్యాంప్‌లో 365 అడుగుల భారీ జాతీయ జెండాను ప్రదర్శించారు. పర్వత శిఖరాన చేరుకున్న అనంతరం మహిళలపై అఘాయిత్యాలు, బాల్య వివాహాలను రూపుమాపాలంటూ మల్లికార్జున బ్యానర్‌ను ప్రదర్శించారు. ఈ యాత్రకు సంబంధించి తనకు ఆర్ఎస్ ప్రవీణ్, ఐపీఎస్ ఐజీ తోడ్పాటునందించారని మల్లికార్జున తెలిపారు. ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, చిలకలూరిపేట ఎమ్మెల్యే రజనీలపై అభిమానంతో సాయికిరణ్ బ్యానర్ ప్రదర్శించారు. యాత్ర ముగించుకుని బుధవారం ఢిల్లీ చేరుకున్న విద్యార్థులు మీడియాకు వివరాలు వెల్లడించారు.

epaper.sakshi.com

తిరుపూర్ స్థాయిలో సిరిసిల్ల

చేనేత, మరమగ్గాలకు జియోట్యాగింగ్

- చేనేత, జౌళి రంగాలకు రూ.1200 కోట్లు
- నాలుగేళ్లలో రూ.1600 కోట్ల వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇచ్చాం
- రూ.386 కోట్లతో నేత కార్మికులకు వర్క్‌షెడ్లు
- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సిరిసిల్లలో అధికారులతో సమీక్ష

బుధవారం సిరిసిల్లలో బతుకమ్మ చీరలను పరిశీలిస్తున్న కేటీఆర్, శైలజారామయ్యర్

సిరిసిల్ల: రాష్ట్రంలో చేనేత, మరమగ్గాల లెక్క తేల్చామని, అన్నింటికీ జియోట్యాగింగ్ చేశామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కె.తారక రామారావు అన్నారు. సిరిసిల్లలో బుధవారం ఆయన చేనేత, జౌళి శాఖ అధికారులతో సమీక్షించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయరంగం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న వస్త్ర పరిశ్రమను ఆధునీకరించేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా కృషి చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో వస్త్ర ఉత్పత్తి రంగంలో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. రూ.70 కోట్లు ఉన్న రాష్ట్ర చేనేత, జౌళి శాఖ బడ్జెట్ ఇప్పుడు ఏటా రూ.1200 కోట్లతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పాటు అయ్యాక నేతన్నలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో కోటి మంది మహిళలకు బతుకమ్మ కానుకగా చీరలు అందిస్తోందని చెప్పారు. తమిళనాడులోని తిరుపూర్ స్థాయిలో సిరిసిల్ల చీరలు బ్రాండ్ ఇమేజ్ సాధించాలని ఆయన ఆకాంక్షించారు. నాలుగేళ్లలో సిరిసిల్లకు రూ.1,600 కోట్ల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చామని తెలిపారు. ఆర్‌వీఎం బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్లు, రంజాన్, క్రిస్మస్ వస్త్రాలు, సంక్షేమశాఖల ఆర్డర్లు అందించామని కేటీఆర్ వివరించారు. సిరిసిల్ల కార్మికులు గతంలో నెలకు రూ.7వేలు సంపాదిస్తే ఇప్పుడు రూ.16 వేలు సంపాదిస్తున్నారని స్పష్టం చేశారు. రూ.22.52 కోట్లతో 11,262 మరమగ్గాలు ఆధునీకరించామని వివరించారు.

50 శాతం రాయితీలు

చేనేత కార్మికులకు నూలు, రంగు, రసాయనాలకు 50 శాతం రాయితీలు, పవర్‌లూమ్ కార్మికులకు పది శాతం నూలు రాయితీని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలోని 11వేల మంది నేత కార్మికులకు రూ.29 కోట్ల రుణాలు మాఫీ చేశామని స్పష్టం చేశారు. సిరిసిల్ల శివారులో 64 ఎకరాల్లో అపెరల్ పార్కు నిర్మిస్తున్నామని, పది వేల మంది మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. సిరిసిల్లలోని 1104 మంది కార్మికులను యజమానులుగా మార్చేందుకు రూ.386 కోట్లతో 88 ఎకరాల్లో వర్క్‌షెడ్లను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఏటా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా రాష్ట్ర స్థాయిలో అవార్డులు ఇస్తున్నామని చెప్పారు. చేనేత కళాకారులకు అండగా సర్కారు రాష్ట్రంలోని చేనేత కళాకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని కేటీఆర్ తెలిపారు. సిరిసిల్లతోపాటు పోచంపల్లి, దుబ్బాక, నారాయణపేట, గద్వాల లాంటి ప్రాంతాల్లోని నేతకార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్నామని చెప్పారు. కార్మికులకు బీమా సదుపాయాన్ని కల్పిస్తున్నామని, త్రిఫ్ట్ పథకంలో 8 శాతం కార్మికుడు చెల్లిస్తే 16 శాతం ప్రభుత్వం చెల్లిస్తూ కార్మికులకు పొదుపును అలవాటు చేస్తున్నామని పేర్కొన్నారు. సిరిసిల్లలో తయారైన బతుకమ్మ చీరలను ఆయన పరిశీలించి బాగున్నాయని కితాబిచ్చారు. పవర్‌లూం కార్ఖానాలోకి వెళ్లి బతుకమ్మ చీరల ఉత్పత్తిని పరిశీలించారు. సమావేశంలో చేనేత, జౌళి శాఖ డైరెక్టర్ శైలజా రామయ్యార్, జేసీషేక్ యాస్మిన్‌బాషా, టెస్కో జీఎం యాదగిరి, జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఔను.. ఎర్ర బంగారమే!

రికార్డు స్థాయిలో క్వింటాలు మిర్చి ధర రూ.15,200

ఖమ్మం వ్యవసాయం: మిర్చి ధర పరుగులు పెడుతోంది. మునుపెన్నడూ లేని విధంగా తేజా రకం మిర్చి ధర బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.15,200 పలికింది. ఇరవై రోజుల వ్యవధిలోనే క్వింటాలుకు రూ.వెయ్యి పెరిగింది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచిన మిర్చికి ఊహించని డిమాండ్ పలుకుతోంది. ఖరీఫ్ సీజన్‌లో పండించిన పంటను రైతులు అధిక ధర కోసం కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచారు. ప్రస్తుతం విక్రయించే పనిలో ఉండగా.. రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

డిసెంబర్‌లోపు యాదాద్రి పనులు పూర్తి

ఆర్కిటెక్టు ఆనంద్‌సాయి

యాదగిరికొండ : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేస్తామని ఆర్కిటెక్టు ఆనంద్‌సాయి తెలిపారు. బుధవారం గర్భాలయం పనులను స్థపతి వేలు, మరికొంత మంది శిల్పులతో కలసి ఆయన పరిశీలించారు. అనుకున్న రీతిలో పనులన్నీ చకచకా పూర్తయ్యేలా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నామని తెలిపారు. పనులు ఆలస్యమైతే బాధిత కాంట్రాక్టును రద్దు చేస్తామని హెచ్చరించారు.

తెలంగాణ ప్రభుత్వం
కమిషనర్ కార్యాలయం, ఎండోమెంట్స్ డిపార్టమెంట్, హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
NIT No. EE/22/2019 **తేది: 20.08.2019 (4వ పిలుపు)**
నిర్మల్ జిల్లాలో 29 దేవాలయాల అభివృద్ధి కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. ECV: రూ. 290 లక్షలు. **NIT No. EE/22/2019, తేది: 20.08.2019 (3వ పిలుపు)** నిర్మల్ జిల్లాలో 9 దేవాలయాల అభివృద్ధి కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. ECV: రూ. 90 లక్షలు. బిడ్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది: 22.08.2019, బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేది (దాఖలు): 29.08.2019. మరింత సమాచారం కోసం https://tender.telangana.gov.in ను దర్శించండి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఎండోమెంట్స్ డిపార్టమెంట్, హైదరాబాద్
DIPR Ro. No. 964-DP/CL/Advt/1/2019-20, Dt: 21.08.2019

తెలంగాణ ప్రభుత్వం
పోలీసు శాఖ
టెండరు ప్రకటన
C.No.29/Mess Tender/CTC-KNR/2019, **తేది: 20.08.2019**
సుమారు (09) నెలలు మరియు పొడిగించగల కాలానికి సుమారు (250) SCTPCs కొరకు కరీంనగర్, కమిషనరేట్ ట్రైనింగ్ సెంటర్‌లో మెస్‌ను నిర్వహించుటకు టెండర్లు కోరబడుచున్నవి. బయానా: రూ.50,000/- (యాభై వేల రూపాయలు మాత్రమే), టెండర్ డాక్యుమెంట్ల అమ్మకం: 22.08.2019 నుండి 28.08.2019 వరకు. టెండర్ల దాఖలుకు చివరి తేది: 31.08.2019న సా.5.00 గం. వరకు. తుది ధర బిడ్ తెరచు తేది: 09.09.2019 ఉ.11.00 గం.కు. సంప్రదించుటకు నం.9440795102 మరియు 6281722458, 9948801315. టెండర్ డాక్యుమెంట్ల ధర: రూ.100/- (వంద రూపాయలు మాత్రమే).
DIPR RO.No.967-DP/CL/Advt/1/2019-20, Dt:21.08.2019 సం/- కమిషనర్ ఆఫ్ పోలీస్, కరీంనగర్

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయముల సంస్థ (ర), గురుకులం
మాసబ్ ట్యాంక్, హైదరాబాద్.
పత్రికా ప్రకటన
Rc.No. B1/Acad/177989/2019-20 **Date: 20-08-2019**
రాష్ట్రవ్యాప్తముగా తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో 2019-20 విద్యా సం.నకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరములో **జనరల్ మరియు వృత్తి విద్యా కోర్సులలో** (1904) సీట్లు ఖాళీగా ఉన్నవి. ఆసక్తి గల 10వ తరగతి ఉత్తీర్ణులైన S.T. అభ్యర్థుల స్పాట్ అడ్మిషన్ల కొరకు **తేది: 26-08-2019 వరకు సంబంధిత కళాశాలలలో అన్ని ధ్రువపత్రములతో హాజరుకాగలరు. ఖాళీల వివరములకు మరియు కళాశాల వివరములకు http://www.tgtwgurukulam.telangana.gov.in** వెబ్‌సైట్‌ను చూడగలరు.
సం/- డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, ఐ.పి.ఎస్,
కార్యదర్శి, గురుకులం.
DIPR Ro.No: 322-PP/CL/Advt/1/2019-20 Dt: 21-08-2019

ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్
(ప్రభుత్వ సంస్థ)
రిజిస్టరు ఆఫీసు: కొత్తగూడెం కాలరీస్ - 507 101
చార్జిషీట్ మరియు ఎంక్వయిరీ నోటీసు

పేరు: శ్రీ ఎం.డి. అంజాద్ హుస్సైన్, తండ్రి పేరు: సలర్ శరీఫ్, జనరల్ మజ్దూర్, ఇ.సి. నెం.: 02315011, అర్.కె.ఓపెన్ కాస్ట్, మందమర్రి ఏరియా.	పేరు: శ్రీ ఎం.డి. అంజాద్ హుస్సైన్, తండ్రి పేరు: సలర్ శరీఫ్, జనరల్ మజ్దూర్, ఇ.సి. నెం.: 02315011, Qr.No. డి-12,3rd లోన్, పోస్ట్: కల్యాణిఖని-504231, మందమర్రి, జిల్లా మంచిర్యాల.

మీరు 1వ జనవరి 2018 నుండి 31వ డిసెంబర్ 2018 వరకు మొత్తము 365 రోజులు సరైన కారణం లేకుండా విధులకు గైర్హాజరు అయినారు.
గత 5 సంవత్సరముల నుండి డిసెంబర్ 2018 వరకు మీ హాజర్లు ఈవిధంగా ఉన్నాయి.

సంవత్సరములు	2013	2014	2015	2016	2017	2018
హాజరైన రోజులు	143	044	83	40	011	00

పై హాజరులను గమనించగా గడచిన 2014సం.రం మరియు 2015 సం.రంలో హాజరులు పెంపొందించుకోమ్మని అవకాశం ఇవ్వడం జరిగినది మరియు కంపెనీ స్థాయి ఉత్తర్వుల ప్రకారము క్రమశిక్షణ చర్య ఈ కింద పట్టికలో తెలియజేసిన ప్రకారం తీసికొనబడినది.

క్రమ సంఖ్య	కంపెనీ స్థాయి ఉత్తర్వుల క్రమసంఖ్య	గైరుహాజరుల సం. రం.	క్రమశిక్షణ చర్య	క్రమశిక్షణ చర్య ఉత్తర్వుల క్రమ సంఖ్య
1	25(25)	2014	ఒక(1) ఇంక్రిమెంటు తేది 01.10.2015 నుండి తగ్గించబడినది	MMR/PER/D/072/15/6901 తేది 22.10.2015
2	25(25)	2015	రెండు (2) ఇంక్రిమెంట్లు తేది 01.03.2018 నుండి తగ్గించబడినది	MMR/PER/D/072/18/682 తేది 02.02.2018

అయినప్పటికి మీ హాజరులు పెంపొందించుకోవడములో, గైర్హాజరు తగ్గించుకొనుటలో ఏలాంటి మార్పు కనబడలేదు మరియు సరియైన కారణం లేకుండ, ముందస్తు అనుమతి గాని లీవు గాని లేకుండ విధులకు గైర్హాజరు అయినారు.
మీ ప్రవర్తన కంపెనీ స్థాయి ఉత్తర్వు 25(31) ప్రకారము ఈ కింది తెలిపిన విధముగా క్రమశిక్షణరాహిత్యము. 25-31; "తగిన కారణం లేకుండా గాని మంజూరు కాని లీవు పై కాని, మంజూరైన లీవును మించి ఎక్కువ కాలం గాని విధులకు గైర్హాజరు కావడం".
పై ఆరోపణలతో కూడిన చార్జి షీటు నంబర్: ఎంఎంఆర్/అర్.కె.ఓ.సి.పి./19/ఆర్/006/157. తేది:29.01.2019 మీరు విధులకు గైర్హాజరు అగుటచే మీ ఇంటి చిరునామాకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా తేది: 01.02.2019 నాడు పంపడం జరిగినది. అట్టి కవరును తపాలా శాఖ వారు మీకు అందచేయ లేక తిప్పిపంపినారు మరల మీ ఇంటిచిరునామాకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా తేది: 24.06.2019 నాడు పంపడం జరిగినది. మరల అట్టి కవరును తపాలా శాఖ వారు మీకు అందచేయ లేక తిప్పిపంపినారు.
మీపై మోపబడిన అభియోగం పై మీ లిఖిత పూర్వక సమాధానం నాలుగు(04) రోజుల లోపు ఇవ్వగలరు. మరియు మీకు తెలియజేయునది ఏమనగా, మీపై మోపబడిన అభియోగం పై తేది: 30.08.2019 శుక్రవారం రోజు ఉదయం 09-00 గం॥ లకు విచారణాధికారిచే కాలరీ మేనేజర్, అర్.కె.ఓపెన్ కాస్ట్ ఆఫీసు గాల కార్యాలయములో విచారణ జరుపబడును.
కావున మీ వద్ద ఉన్న సాక్ష్యాధారాలతో తేది:30.08.2019 శుక్రవారం రోజు ఉదయం 09-00 గం॥ లకు ఎంక్వయిరీకి హాజరుకాగలరు. లేని యెడల మీ పరోక్షంలో ఎంక్వయిరీ నిర్వహించి కంపెనీ నిబంధనల ప్రకారం తగిన చర్య తీసుకొనబడును.
ఇట్లు,
కాలరీ మేనేజర్
PR/2019-20/MM/ARW/49 అర్.కె.ఓపెన్ కాస్ట్, మందమర్రి ఏరియా.

వెలుగుల రికార్డులు

- జాతీయ స్థాయిలో 5వ స్థానంలో నిలిచిన ఎన్టీపీపీ
- సీఎండీ శ్రీధర్ అభినందనలు

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీపీ) మరోసారి జాతీయ స్థాయిలో ఖ్యాతి గడిచింది. వెలుగుల రికార్డు సొంతం చేసుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలల కాలంలో 91.74 శాతం పీఎల్ఎఫ్ (ప్లాంటు లోడ్ ఫ్యాక్టర్) సాధించి దేశంలోని అత్యధిక పీఎల్ఎఫ్ సాధించిన 25 థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఐదవ స్థానంలో నిలిచింది. ఈ విధంగా జాతీయ స్థాయిలో 5వ స్థానంలో నిలవడం రెండోసారి కావడం విశేషం. గడిచిన నాలుగు నెలల కాలంలో జూలై 31వ తేదీ నుంచి ఎన్టీపీపీ 3,223 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి 3,038 మిలియన్ యూనిట్లను తెలంగాణ రాష్ట్ర అవసరాలకు గజ్వేల్ పవర్ గ్రిడ్‌కు సరఫరా చేసింది. తద్వారా 91.74 శాతం స్టేషన్ పీఎల్ఎఫ్ సాధించి రికార్డు సొంతం చేసుకుంది. ఎన్టీపీపీ ప్రారంభం నుంచి చక్కటి పనితీరుతో ఆదర్శవంతంగా నిలుస్తోందని సీఎండీ శ్రీధర్ అభినందనలు తెలిపారు. ఇదే ఒరవడితో మంచి ఉత్పాదకతతో పని చేస్తూ జాతీయ స్థాయిలో నంబర్-1 స్థానంలో నిల్వడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు.

భూపాలపల్లిలో ఆర్టీసీ బస్సును నడుపుతున్న ఎమ్మెల్యే గండ్ర

డ్రైవర్ 'గండ్ర'!

భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కాసేపు ఆర్టీసీ బస్సు డ్రైవర్ అవతారమెత్తారు. భూపాలపల్లి బస్ డిపోకు నూతనంగా వచ్చిన సూపర్ లగ్జరీ బస్సును బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం డిపో నుంచి బస్టాండ్ వరకు బస్సును నడిపి ప్లాట్‌ఫాంపై ఉంచారు. దీంతో బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులంతా నివ్వెరపోయారు. అందరూ బస్సు వద్దకు వచ్చి చూడసాగారు.

పచ్చడి బాగుందే!

కూలీలతో కలసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సీతక్క

కొత్తగూడ: అక్కా.. బాగున్నారా? అందరూ పచ్చడే తెచ్చుకున్నారా? మీతో నాకూ కాస్త వడ్డించండి అంటూ ములుగు ఎమ్మెల్యే దనుసరి సీతక్క వరి నాటు వేయడానికి వచ్చిన కూలీలతో కలసి రోడ్డుపై కూర్చుని భోజనం చేశారు. బుధవారం ఎమ్మెల్యే మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెంకు వెళుతుండగా.. పొగుళ్లపల్లి, సాదిరెడ్డిపల్లి గ్రామాల మధ్య కూలీలు రోడ్డుపై కూర్చుని భోజనం చేస్తున్నారు. వారిని చూసిన ఎమ్మెల్యే కారు ఆపి కాసేపు మాట్లాడారు. వారి భోజనాలు చూసి అందరూ పచ్చడే తెచ్చుకున్నారెందుకని ప్రశ్నించారు. మీతో పాటు నాకూ వడ్డించండి అని కూలీలతో కలసి భోజనం చేశారు. పచ్చడి బాగుందంటూ కితాబిచ్చారు.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

మణుగూరురూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బుగ్గ గ్రామ పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు దళ సభ్యుడు మృతి చెందాడు. మణుగూరు డీఎస్పీ సాయిబాబా కథనం ప్రకారం.. మావోయిస్టు పార్టీ విస్తరణలో భాగంగా దళాలు అటవీ ప్రాంతాల్లోని వలస గొత్తికోయ గ్రామాల్లో సంచరిస్తున్నాయనే సమాచారం మేరకు స్పెషల్ పార్టీ పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు కూడా ఎదురు కాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో గుండాల మండలం దామరతోగు గ్రామానికి చెందిన మావోయిస్టు దళ సభ్యుడు జాడి వీరస్వామి అలియాస్ రఘు(25) మృతి చెందగా, మిగిలిన వారు పారిపోయారు. మృతుడి వద్ద రెండు తపంచాలు, 17 బుల్లెట్లు, రెండు కిట్‌బ్యాగ్‌లు, విప్లవ సాహిత్యం లభించినట్లు డీఎస్పీ వివరించారు. మణుగూరు తహసీల్దార్ మంగీలాల్ పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా...

బీజేపీ లేకుంటే కవిత ఎలా ఓడారు?: కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీజేపీ లేదంటున్న వారు పార్లమెంట్ ఎన్నికల్లో కవిత ఎలా ఓడిపోయారో తెలుసుకోవాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి వాఖ్యానించారు. బుధవారం సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమానికి హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా ఎవరో తనకు తెలియదని అనడం టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అహంకారానికి నిదర్శనమని అన్నారు. ఆయనెవరో తెలియకుండానే నడ్డా కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో కలిశారా అని ప్రశ్నించారు. తమ పార్టీ నేతలు కూడా కేటీఆర్ ఎవరో తెలియదని మాట్లాడవచ్చని, కానీ అది తమ సంస్కృతి కాదని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన సుష్మా స్వరాజ్ మరణిస్తే కనీసం చివరిచూపు సైతం చూడలేని వ్యక్తులు వారని అన్నారు.

24న రాష్ట్రానికి అమిత్ షా

సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఈ నెల 24న రాష్ట్రానికి రానున్నారు. 24వ తేదీన ఉదయం హైదరాబాద్‌లో పోలీస్ పాసింగ్ ఔట్ పరేడ్‌లో ఆయన పాల్గొననున్నారు. రాష్ట్రానికి వస్తున్నందున రాష్ట్ర పార్టీ కార్యాలయానికి రావాలని బీజేపీ నేతలు అమిత్ షాను కోరుతున్నారు. కానీ పార్టీ కార్యాలయానికి వచ్చే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు.

'తెలంగాణ స్ఫూర్తి కొరవడింది సీఎంలోనే'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్ఫూర్తి కొరవడింది సీఎం కేసీఆర్ లోనేనని, అధికారుల్లో కాదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ తన తప్పులను అధికారులపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ లోపభూయిష్ట విధానాల వల్లే ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని దుయ్యబట్టారు. మరోవైపు రాష్ట్ర రైతులకు నీళ్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టకుండా ఏపీ ప్రజలకు నీళ్లు ఇస్తామని మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగాలు జీతభత్యాల కోసం పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు.

నేడు బీజేపీలో చేరనున్న నందీశ్వర్‌గౌడ్!

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ గురువారం బీజేపీలో చేరనున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ సమక్షంలో ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్న ఆయన.. ఆ తర్వాత టీడీపీలో చేరారు. తాజాగా గురువారం బీజేపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు టీడీపీ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి కూడా బీజేపీలో చేరేందుకు ఇప్పటికే సుముఖత వ్యక్తం చేశారు. మరోవైపు మాజీమంత్రి దేవేందర్‌గౌడ్, ఆయన కుమారుడు వీరేందర్‌గౌడ్ కూడా బీజేపీలో చేరేందుకు ఇప్పటికే అంగీకారం తెలిపారు.

24న హైదరాబాద్‌కు సీపీఐ నేత డి.రాజా

సాక్షి, హైదరాబాద్: సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాక డి.రాజా తొలిసారిగా ఏపీ, తెలంగాణ పర్యటనకు వస్తున్నారు. ఈ నెల 24న హైదరాబాద్‌కు వస్తున్న ఆయన 27న ఢిల్లీకి తిరిగి వెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా పార్టీ సమావేశాల్లో పాల్గొనడంతో పాటు, వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన సదస్సుల్లో ఆయన ప్రసంగిస్తారు. శనివారం ఉదయం నగరానికి చేరుకోనున్న ఆయన సాయంత్రం 5.30 గంటలకు ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో 'భారత కమ్యూనిజం–సామాజిక న్యాయం'అంశంపై నిర్వహిస్తున్న సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు.

'సామగ్రి తరలింపునకు రూ.1.46 కోట్లు'

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత సచివాలయంలోని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సామగ్రిని తాత్కాలిక సచివాలయం బీఆర్‌కే భవన్‌లో కి తరలించేందుకు రూ.1.46 కోట్లు ఖర్చు కానున్నట్లు అధికారులు లెక్కకట్టారు. ఫైళ్లు, ఫర్నిచర్, పార్టిషన్ సామగ్రి, ఇతర వస్తువులను తరలించేందుకు ప్యాకింగ్, తరలింపునకు ఈ మేరకు వ్యయం కానుంది. 5 కంపెనీలను ఎంపిక చేసి సామగ్రి తరలింపు బాధ్యతను వాటికి అప్పగించారు.

వీఆర్‌వో వ్యవస్థ రద్దు?

- సర్వేయర్లు కూడా ఔట్.. లైసెన్స్‌డ్ సర్వేయర్లకు బాధ్యతలు
- వీఆర్‌వోలను ఇతర శాఖలకు బదలాయింపు
- రెవెన్యూ శాఖ సమగ్ర మార్పునకు త్వరలో శ్రీకారం
- భూసమగ్ర సర్వేకు ప్రభుత్వ నిర్ణయం..
- తహశీల్దార్ల అధికారాలపై భిన్నాభిప్రాయాలు..
- ముసాయిదా చట్టంలోనే స్పష్టత

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ వ్యవస్థను సమగ్రంగా మార్చాలన్న యోచనలో ఉన్న సీఎం కేసీఆర్ కొత్త రెవెన్యూ చట్టంలో భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టనున్నారు. సత్వర రెవెన్యూ సేవలు, అవినీతి నియంత్రణ లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థను కొత్త పుంతలు తొక్కించాలని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్‌వో) వ్యవస్థ రద్దు, క్వాలిఫైడ్ వీఆర్‌వోలను జూనియర్ అసిస్టెంట్లుగా నిర్వచిస్తూ రెవెన్యూ శాఖలో కొనసాగించే అంశాన్ని ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు మంగళ, బుధవారాల్లో జరిగిన కలెక్టర్ల సమావేశంలో కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పనపై కలెక్టర్లతో సీఎం కేసీఆర్ చర్చించారు. రెవెన్యూ శాఖలో కిందిస్థాయిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కొత్త చట్టంలో పొందుపరిచే అంశాలపై విస్తృతంగా చర్చించడమే కాకుండా.. కలెక్టర్ల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో చర్చకు వచ్చిన వివరాల మేరకు వీఆర్‌వో వ్యవస్థ రద్దు చేయడమే మంచిదనే భావనలో సీఎం ఉన్నట్లు స్పష్టమవుతోంది.

వారి వల్లే చెడ్డపేరు

భూ రికార్డుల ప్రక్షాళనలో వీఆర్‌వోల భాగస్వామ్యంతో అక్రమాలు జరిగాయని అంచనాకొచ్చిన ప్రభుత్వం.. భూ రికార్డుల నిర్వహణ నుంచి వారిని పూర్తిగా తప్పించాలని నిర్ణయించింది. భూ రికార్డుల్లో కాస్తు కాలమ్‌ను తొలగించినందున.. క్షేత్రస్థాయిలో వీరి అవసరం కూడా లేదనే అంచనా కొచ్చింది. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా రెవెన్యూ రికార్డులను సవరించే క్రమంలో వీఆర్‌వోల కారణంగానే ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చిందనే అభిప్రాయంతో సీఎం ఉన్నారు. అయితే ఈ వ్యవస్థను పూర్తి స్థాయిలో రద్దు చేస్తే ఉద్యోగవర్గాల నుంచి వ్యతిరేకత వస్తుందని భావిస్తున్న సర్కారు.. వీరి సేవలను వేరే విధంగా వాడుకోవాలని భావిస్తోంది. విద్యార్హతలు, నైపుణ్యం, నిబద్ధత ఉన్న వారిని మాత్రమే రెవెన్యూలో కొనసాగించి.. మిగిలిన వారిని పూలింగ్‌లో పెట్టడం ద్వారా వేరే శాఖ (ముఖ్యంగా పంచాయతీరాజ్, వ్యవసాయశాఖ)ల్లోకి బదిలీ చేసే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. వీఆర్‌ఏలను పంచాయతీరాజ్ శాఖ పరిధిలోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది.

సర్వే ప్రైవేటుపరం!

సర్వేయర్ల వ్యవస్థను కూడా రద్దు చేసే అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోంది. రెవెన్యూలో అవినీతి పెరగడానికి సర్వేయర్లు కూడా ప్రధాన కారణమని అంచనాకు వచ్చిన సర్కారు.. సర్వేయర్లపై వేటు వేసే దిశగా ఆలోచన చేస్తోంది. సర్వేను ప్రైవేటు పరం చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు వారికి ప్రైవేటు సర్వేయర్లకు లైసెన్సులు జారీ చేయనుంది. లైసెన్స్ ఉన్న సర్వేయర్లను గుర్తించనుంది. భూ యజమాని అవసరానికి అనుగుణంగా సర్వే ఫీజులు నిర్దేశించనుంది.

ఒకే రోజులో మ్యూటేషన్!

భూముల మ్యూటేషన్‌ను కూడా సరళతరం చేయనుంది. రిజిస్ట్రేషన్ అయిన రోజే మ్యూటేషన్ అయ్యేలా కొత్త విధానాన్ని తీసుకురానుంది. 24 గంటల్లో అభ్యంతరాలు రాకపోతే.. తహసీల్దార్ మ్యూటేషన్ ప్రోసీడింగ్స్ (ఆటోమేటిక్ డిజిటల్ సంతకం జరిగేలా) ఇవ్వడమే కాకుండా.. ఆన్‌లైన్ పహాణీలో నమోదు చేసేలా చట్టంలో పొందుపరచనున్నారు. అలాగే 10 రోజుల్లో పట్టాదారు పాస్ పుస్తకాన్ని నేరుగా రైతు ఇంటికే పంపనున్నారు. ఈ మేరకు అవసరమైతే స్థానికంగా ప్రింటింగ్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

సమగ్ర సర్వేకు మొగ్గు

భూరికార్డులప్రక్షాళనను సంపూర్ణం చేసేందుకు సమగ్రంగా రాష్ట్రంలోని భూములన్నీ సర్వే చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సమగ్ర భూ విధానం తీసుకురావాలనే ఆలోచనలో భాగంగా టైటిల్ గ్యారంటీ అమలు కోసం ఈ సర్వే అనివార్యమైనందున భూసమగ్ర సర్వేకు త్వరలోనే ఆదేశాలివ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. టైటిల్ గ్యారెంటీ చట్టం అమల్లోకి తేవడానికి ముందు సరిహద్దు వివాదాలు, క్లియర్ టైటిల్ ఉండాలనే కారణాలతోనే సమగ్ర భూసర్వే నిర్వహించనుంది. ఏపీలో ఉన్న టైటిల్ గ్యారంటీ చట్టం పేరు మారి వేరే చట్టాన్ని తీసుకురావాలని చూస్తోంది.

తహసీల్దార్ల అధికారాలకు కోత?

తహసీల్దార్ల అధికారాల కుదింపుపై కలెక్టర్లతో జరిగిన సమావేశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. మ్యూటేషన్లతో పాటు ఇతర భూరికార్డుల మార్పులు, చేర్పుల అధికారాన్ని జాయింట్ కలెక్టర్లకు బదలాయిస్తే కొత్త సమస్యలు వస్తాయని కొందరు కలెక్టర్లు సూచించినట్లు సమాచారం. ప్రస్తుత విధానాన్నే కొనసాగించడం మంచిదనే వాదనలు వినిపించినట్లు తెలిసింది. ఏదేమైనా తహసీల్దార్ల అధికారాలపై రెవెన్యూ ముసాయిదా చట్టంలో స్పష్టత రానుంది.

నిదురపోరా తమ్ముడా..

కార్యాలయాల్లో కునుకేయడానికి ఏర్పాట్లు ఉండాలి

తాజా సర్వేలో ఉద్యోగుల మనోగతం

ఆఫీసులో లంచ్ లాగించాక.. మధ్యాహ్నం 1–4 గంటల మధ్య కునుకుపాట్లు పడే ఉద్యోగులెందరో.. ఇక ఆ పాట్లు వద్దు.. ఏకంగా ఆఫీసులో కునుకేయడానికి ఏర్పాట్లు చేస్తే బెటర్ అని అంటున్నారు మెజారిటీ ఉద్యోగులు. నిద్రలేమికి పరిష్కారాలు కనుగొనే స్టార్టప్ సంస్థ వేక్‌ఫిట్.కామ్ ఇటీవల ఆన్‌లైన్‌లో దేశ వ్యాప్త సర్వేలో ఇదే తేలింది. ఈ సర్వే నివేదికను 'పనివేళల్లో కునుకు ఒక హక్కు' అన్న పేరుతో సదరు సంస్థ విడుదల చేయడం విశేషం.



బోలెడన్ని లాభాలు..

మధ్యాహ్నం పూట కాస్త కునుకు వేస్తే.. మనిషిలో శక్తి సామర్థ్యాలు రెట్టింపు అవుతాయని, వారి ఉత్పాదక సామర్థ్యం పెరుగుతుందని ఇప్పటికే శాస్త్రీయంగా రుజువు కావడంతో ఈ సర్వేలోని అంశాలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ ఆఫీసుల్లో పనిచేసేవారికి ఒత్తిడి ఎక్కువ ఉంటుందని.. దీన్ని అధిగమించడానికి కునుకు తీయడానికి అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని సర్వే తెలిపింది. 'దేశంలో నిద్రలేమికి సంబంధించిన అనారోగ్య సమస్యలు ఎక్కువైపోయాయి. అందుకే బడా కంపెనీలు, ఉద్యోగులతో అత్యధిక పనిగంటలు చేయించుకునే సంస్థలు వాళ్లు కునుకు తీయడం కోసం ప్రత్యేకంగా చాంబర్లు పెట్టాలి' అని వేక్‌ఫిట్ సంస్థ డైరెక్టర్ చైతన్య రామలింగగౌడ చెబుతున్నారు. కాగా, గోద్రేజ్, ఎక్సెంచర్, గూగుల్, భారతి ఎయిర్‌టెల్, కోక కోలా వంటి సంస్థలు మాత్రమే పనిచేయడానికి అవసరమైన ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేసినట్టుగా ఈ సర్వే తెలిపింది. ఈ సంస్థలన్నీ కంపెనీ నియమనిబంధనల కంటే ఉద్యోగుల సంక్షేమం కోసం ఎక్కువగా దృష్టి పెట్టినట్టుగా పేర్కొంది.

సర్వే ఏం చెప్పింది..

86%	40%	80%
కునుకుతీయడానికి ఆఫీసుల్లో ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలని చెబుతున్నవారు	పనిఒత్తిడితో రాత్రిపూట సరిగా నిద్రపట్టక, మర్నాడు ఆఫీసులో నిద్రమత్తుతో జోగుతున్నామని చెప్పినవారు	వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే నిద్ర వస్తుందని చెప్పినవారు

వారమంతా నిద్రతో తూలిపోతూ ఉంటామన్న వారు 5%

ఆఫీసుల్లో జరిగే సుదీర్ఘ సమావేశాలే నిద్ర తెప్పిస్తున్నాయని ప్రతి నలుగురిలో ఒకరు చెప్పారు.

అవినీతిని కేసీఆరే ఒప్పుకున్నారు!

- ఈ ప్రభుత్వంలో ఏ శాఖలో అవినీతి లేదో సీఎం చెప్పాలి
- బీజేపీ నేతలు చేతలు చూపించాలి
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని కలెక్టర్ల సదస్సులో సీఎం కేసీఆర్ స్వయంగా ఒప్పుకున్నారని, టీఆర్ఎస్‌ది అవినీతి పాలన అని కేసీఆర్ గుర్తించినందుకు సంతోషమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అవినీతి తగ్గించేందుకే కొత్త రెవెన్యూ చట్టమని కేసీఆర్ చెబుతున్నారని, అంటే ఇప్పటివరకు అవినీతి జరిగిందని ఒప్పుకున్నట్టే కదా అని ఆయన ప్రశ్నించారు. బుధవారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అవినీతికి ద్వారాలు తెరవడం మినహా ఈ ప్రభుత్వం సాధించిందేమీ లేదన్నారు. రెవెన్యూ చట్టాలను సరిచేసి భూరికార్డుల ప్రక్షాళన చేయాల్సి ఉండగా, తన తప్పును అధికారుల మీద నెట్టేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులను కలెక్టర్లు కట్టడి చేయలేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారని, రెవెన్యూ అధికారులను కలెక్టర్లు కట్టడి చేయాల్సి ఉంటే.. కలెక్టర్లను కట్టడి చేయాల్సింది సీఎం కాదా అని ప్రశ్నించారు. మెరుగైన పాలన కోసమే కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తున్నామని, అధికార వికేంద్రీకరణ అని చెప్పి.. ఇప్పుడు అధికారాలన్నీ కేంద్రీకృతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అసలు ఈ ప్రభుత్వంలో ఏ శాఖలో అవినీతి లేదో సీఎం చెప్పాలని, ముందు రాజకీయ అవినీతిని తగ్గించిన తర్వాత కేసీఆర్ అధికారుల గురించి మాట్లాడాలని ఆయన హితవు పలికారు. మిషన్ భగీరథ అవినీతిలో కేసీఆర్ వాటా ఎంతో చెప్పాలని, రూ.100 కోట్లకు మించి ప్రాజెక్టు చేపడితే గ్లోబల్ టెండర్లు పిలవాలని, కానీ టెండర్లు లేకుండా రూ.4వేల కోట్ల పనులు నామినేషన్ ద్వారా ఇవ్వడమంటే అవినీతిని ప్రోత్సహించడం కాదా అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు రాష్ట్రంలో అవినీతి గురించి మాట్లాడుతున్నారని, వారు మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపించాలని, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథలపై విచారణ జరిపించాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.



అభివృద్ధిలో తెలంగాణ వెనుకంజ

కేసీఆర్ పాలనపై కేంద్రమంత్రి సంతోష్ గంగ్వార్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: అభివృద్ధిలో తెలంగాణ వెనుకబడిందని కేసీఆర్ పాలనపై కేంద్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి సంతోష్ గంగ్వార్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి పాలన ఎక్కడ నుంచి చేస్తున్నారంటే ఫాంహౌస్ నుంచి చేస్తున్నారన్న సమాధానం వస్తోందని, సచివాలయానికి రాకుండా పాలన చేస్తోన్న సీఎం కేసీఆర్ ఒక్కరేనని విమర్శించారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన సంతోష్ గంగ్వార్ బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో ప్రభుత్వం ఎలా పని చేస్తోందో అందరికీ తెలుసన్నారు. కార్మికుల సంక్షేమం కోసమే కొత్తగా నాలుగు చట్టాలను తీసుకొస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించి వారికి ఏవిధంగా లబ్ధి చేయగలమో ఆలోచిస్తున్నామన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుకు తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత బీజేపీకి ఎంతో ఉందని, వచ్చే ఎన్నికల్లో తమపార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పేదల కోసం మోదీ ఎన్నో పథకాలు చేపడుతుంటే టీఆర్ఎస్ ప్రభుత్వం ఆ పథకాలను అమలు చేయకుండా అడ్డుకుంటోందన్నారు. కేసీఆర్ పాలనపై రాష్ట్రంలో నిరుద్యోగులు, విద్యార్థులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. అనంతరం రాష్ట్రంలో ఈఎస్ఐ ఆస్పత్రికి అదనపు పడకలు కావాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్ రెడ్డి మంత్రిని కోరగా దీనికాయన సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో లేదన్న వివక్ష చూపించమని ప్రజల సంక్షేమమే తమకు ముఖ్యమని మంత్రి తెలిపారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి సంతోష్ గంగ్వార్. పక్కన కె.లక్ష్మణ్

రాష్ట్రంలో అవినీతి పాలన: లక్ష్మణ్

తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అవినీతి పాలన సాగిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. కలెక్టర్ల సమావేశంలోనే ఈ విషయాన్ని సీఎం కేసీఆరే స్వయంగా ఒప్పుకున్నారని, ఆ తప్పును అధికారులమీద నెట్టివేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. పాలనను గాలికొదిలేసి అవినీతికి అధికారులను బాధ్యులను చేయడం సరికాదన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన పేరుతో అనేక అవకతవకలు జరిగాయన్నారు. పాస్‌బుక్ రావాలంటే లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తెలంగాణ ఉద్యమానికి మద్దతివ్వని వారందరికీ మంత్రి పదవులు, జై తెలంగాణ అన్నవారికి నిర్బంధాలు తప్పడం లేదన్నారు. సమావేశంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంచంద్రరావు, ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు.

తెలుగులో ప్రభుత్వ సమాచారం

సాక్షి, హైదరాబాద్: డిజిటల్ తెలంగాణలో భాగంగా స్థానిక భాషలో మరింత సమాచారాన్ని డిజిటల్ పబ్లిషింగ్ టూల్ 'నవలేఖ'ద్వారా అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ ఐటీ సంస్థ గూగుల్‌తో బుధవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం, గూగుల్‌కు మధ్య పరస్పర అవగాహనతో అనేక ఒప్పందాలు కుదురుతున్నాయని ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో తమ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన గూగుల్.. త్వరలో రెండో అతిపెద్ద క్యాంపస్‌ను కూడా ఇక్కడే ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోందన్నారు. ఇంటర్నెట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు తెలుగులో అందుబాటులోకి తెచ్చేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. 'గతంలోనూ రాష్ట్రప్రభుత్వంతో ఇంటర్నెట్ ద్వారా వాణిజ్యం, స్థానిక స్టార్టప్‌లకు దిశానిర్దేశం వంటి అనేక అంశాల్లో గూగుల్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుత ఒప్పందంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన సమస్త సమాచారాన్ని సామాన్యులకు తెలుగు భాషలో అందుబాటులోకి తేవడంతో పాటు, డిజిటల్ అక్షరాస్యత పెంపుదలలోనూ ఉపకరిస్తుంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ గూగుల్ మ్యాప్స్ వంటివి స్థానికులు ఉపయోగించే వీలుంటుంది..' అని జయేశ్‌రంజన్ వెల్లడించారు.

చెన్నమనేని అప్పీల్ ఉపసంహరణ

సాక్షి, హైదరాబాద్: పౌరసత్వ వివాదం కేసులో సింగిల్ జడ్జి ఉత్తర్వుల్ని సవాల్ చేస్తూ శాసనసభ్యుడు చెన్నమనేని రమేశ్ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకునేందుకు ధర్మాసనం నిరాకరించడంతో అప్పీల్ పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటామని ఆయన తరపు సీనియర్ న్యాయవాది వేదుల వెంకట రమణ కోరారు. అందుకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం బుధవారం అనుమతించింది. భారత పౌరసత్వం పొందేందుకు చెన్నమనేని రమేశ్ వాస్తవాలనే తెలిపారని, తప్పుడు సమాచారం ఇచ్చారనే ఫిర్యాదులోని అంశాలు అసత్యాలని న్యాయవాది వాదించారు. భారత పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 10 ప్రకారం పౌరసత్వం ఇవ్వడం వల్ల సమాజానికి మేలు జరుగుతుందని భావిస్తే ఇవ్వొచ్చని, అయితే ఈ వ్యవహారాన్ని తిరిగి కేంద్ర హోం శాఖ విచారించాలని సింగిల్ జడ్జి ఆదేశాల పట్ల అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. రాజకీయ ప్రత్యర్థులే పిటిషనర్‌పై ఫిర్యాదులు చేస్తున్నారని చెప్పారు. అనంతరం అప్పీల్ పిటిషన్‌పై జోక్యం చేసుకోబోమని, సింగిల్ జడ్జి ఉత్తర్వులను పరిశీలిస్తే అంతా ఆమోదయోగ్యంగానే ఉన్నాయని ధర్మాసనం అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని న్యాయవాది కోరడంతో అందుకు ధర్మాసనం అనుమతిచ్చింది.

కొనసాగుతున్న అల్పపీడనం

- తాజాగా బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- రెండు రోజులు వర్షాలు.. నేడు ఒకట్రెండు చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం
- నిజామాబాద్ జిల్లా మాచర్లలో అత్యధికంగా 8 సెంటీమీటర్ల వర్షం
- రాష్ట్రంలో పుంజుకున్న వరి నాట్లు.. 19.47 లక్షల ఎకరాల్లో నాట్లు

సాక్షి, హైదరాబాద్: తూర్పు ఉత్తరప్రదేశ్, దాన్ని ఆనుకుని ఉన్న బిహార్ ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కూడా కొనసాగుతూ.. ఎత్తుకి వెళ్లే కొద్దీ నైరుతి వైపునకు వంపు తిరిగి ఉంది. ఈ అల్పపీడనం మధ్య ప్రాంతం నుంచి కోస్తాంధ్ర వరకు ఒడిశా మీదుగా ఉత్తర–దక్షిణ ద్రోణి కొనసాగుతోంది. ఇక తూర్పు మధ్య బంగాళాఖాతం, దాన్ని ఆనుకుని ఉన్న ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతాల్లో తాజాగా ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీంతో వచ్చే రెండు రోజులు చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గురువారం ఒకట్రెండు చోట్ల భారీవర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇదిలావుండగా బుధవారం సాయంత్రం రాష్ట్రంలో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిశాయి. నిజామాబాద్ జిల్లా ఆర్మూరు మండలం మాచర్లలో అత్యధికంగా 8 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. అదే జిల్లా తొండకూరులో 7.5, ఇస్సపల్లిలో 7.2, మెదక్ జిల్లా పాపన్నపేట మండలం మినిపూర్‌లో 6, భీంగల్‌లో 5.5, నల్లగొండ జిల్లా దామరచర్లలో 5.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జగిత్యాల, ఖమ్మం, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, జనగాం, కామారెడ్డి, మంచిర్యాల, నారాయణపేట, నిర్మల్, వరంగల్ రూరల్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లోనూ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు తెలిపారు.

ఖరీఫ్‌లో 85 శాతం సాగు

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా ఇప్పటివరకు 85 శాతం సాగు నమోదైంది. మొత్తం 91.45 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ బుధవారం నివేదించింది. ఈనెల ప్రారంభం నుంచ

ఇదీ.. చిదంబరం చిట్టా

చిక్కుల్లో చిదూ!

అరెస్టుకు ముందు ఏఐసీసీ కార్యాలయంలో చిదంబరం

యూపీఏ ప్రభుత్వంలో హోంమంత్రిగా, ఆర్థిక మంత్రిగా ఉన్న చిదంబరం తన కొడుకు కార్తీ కంపెనీలకు భారీగా లబ్ధి చేకూర్చారని ఆరోపణలున్నాయి. ఐఎన్ఎక్స్ మీడియాతోపాటు మరి కొన్ని కేసుల్లో చిదంబరం చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. తాజాగా ఆయన్ను సీబీఐ అరెస్టు చేసిన నేపథ్యంలో ఆయనపై ఉన్న కేసుల వివరాలివీ...

ఐఎన్ఎక్స్: విదేశీ పెట్టుబడులకు పచ్చజెండా!

స్టార్ టీవీ ఇండియాకు సీఈఓగా దాదాపు పదేళ్ల పాటు పనిచేసి ఆ తరువాత బయటకు వచ్చేసిన పీటర్ ముఖర్జియా సంస్థ పేరే ఐఎన్ఎక్స్ మీడియా. ఈయన తన భార్య ఇంద్రాణి ముఖర్జీతో కలిసి 2007లో ఐఎన్ఎక్స్ మీడియాను ఆరంభించారు. దాన్లో ఇంద్రాణి సీఈఓగా ఉండగా... పీటర్ ముఖర్జియా చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్‌గా చేరారు. ఈ సంస్థలోకి విదేశాల నుంచి పెట్టుబడుల రూపంలో వచ్చిన రూ.305 కోట్లకు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎఫ్ఐపీబీ) పచ్చజెండా ఊపింది. ఈ ఎఫ్ఐపీబీ అనుమతుల విషయంలో అప్పట్లో ఆర్థిక మంత్రిగా ఉన్న పి.చిదంబరం తన అధికారాన్ని దుర్వినియోగం చేశారన్నది ప్రధాన అభియోగం. అంతేకాక విదేశీ పెట్టుబడుల రూపంలో ఐఎన్ఎక్స్‌లోకి వచ్చిన డబ్బులు వేరెవరివో కావని, చిదంబరం తనయుడు కార్తీకి చెందిన వివిధ కంపెనీలు ఈ పెట్టుబడుల్ని ఇండియాకు తరలించడానికి ఐఎన్ఎక్స్ మార్గాన్ని ఎంచుకున్నాయని, ఇది స్పష్టమైన మనీ లాండరింగ్ వ్యవహారమని దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి. పీటర్ ముఖర్జియా, ఇంద్రాణి ముఖర్జీలు ఈ కేసులో ఇప్పటికే అప్రూవర్లుగా మారిపోయారు. ఈ కేసులో తమను ఇరికించకుండా చూడడానికి వారు కార్తీకి 10 లక్షలు లంచం కూడా ఇచ్చారని సీబీఐ చెబుతోంది.

ఎయిర్‌సెల్- మాక్సిస్: అక్రమ అనుమతులు!

ఎయిర్‌సెల్ మాక్సిస్ కేసు 2011వ సంవత్సరం మేలో వెలుగులోకి వచ్చింది. ఎయిర్‌సెల్ సంస్థ వ్యవస్థాపకుడు సి.శివశంకరన్ తన సంస్థలోని 74 శాతం వాటాలను 2006లో మలేసియా కంపెనీ మాక్సిస్‌కు విక్రయించారు. అప్పటి కేంద్ర టెలికం మంత్రి దయానిధి మారన్ బలవంతంగా తనతో ఈ పని చేయించారంటూ ఆయన ఫిర్యాదు చేశారు. దీనిపై సీబీఐ దర్యాప్తు ఆరంభించగా... ఈడీ కూడా మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. రూ.3,500 కోట్ల విలువ చేసే పెట్టుబడులను మాక్సిస్ సంస్థ ఎయిర్‌సెల్‌లో పెట్టిన సమయంలో ఆర్థిక మంత్రిగా చిదంబరమే ఉన్నారు. వాస్తవానికి ఈ స్థాయి విదేశీ పెట్టుబడులకు ప్రధానమంత్రి ఆధ్వర్యంలోని ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) అనుమతులు మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ ఆర్థిక మంత్రి హోదాలో చిదంబరం నిబంధనల్ని తోసిరాజని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎఫ్ఐపీబీ) ద్వారా అనుమతులు మంజూరు చేశారని అభియోగాలున్నాయి. నిజానికి ఎఫ్ఐపీబీకి రూ.600 కోట్ల వరకు విలువున్న పెట్టుబడులకు మాత్రమే అనుమతినిచ్చే అధికారం ఉంది. ఈ ఒప్పందం కుదరడానికి చిదంబరం కుమారుడు కార్తీకి భారీగా ముడుపులు ముట్టజెప్పినట్లు కూడా ఆరోపణలు వెల్లువెత్తాయి.

20 సార్లు చిదంబరానికి ఊరట

ఐఎన్ఎక్స్, ఎయిర్‌సెల్, మాక్సిస్ కేసుల్లో ఇప్పటికే పలు దఫాలు దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీ చిదంబరాన్ని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించాయి. చిదంబరం ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు దాఖలు చేసుకొని అరెస్ట్ నుంచి తప్పించుకున్నారు. ఈ ముందస్తు బెయిల్‌కు సంబంధించిన గడువుల్ని ఎప్పటికప్పుడు పొడిగిస్తూ వచ్చారు. అలా మొత్తంగా 20 సార్లు చిదంబరానికి ఊరట లభించింది. ఇప్పటికే ఈడీ చిదంబరాన్ని గత ఏడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరిలో రెండు సార్లు ప్రశ్నించింది కూడా.

బెయిల్‌పై ఉన్న కార్తీ

ఇక ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న చిదంబరం కుమారుడు కార్తీని గత ఏడాది ఫిబ్రవరిలో సీబీఐ అరెస్ట్ చేసింది. 23 రోజుల పాటు జైల్లో ఉన్న కార్తీ మార్చిలో బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ కేసుకు సంబంధించి భారత్, యూకే, స్పెయిన్ దేశాల్లో కార్తీ చిదంబరానికి చెందిన రూ.54 కోట్ల ఆస్తుల్ని ఈడీ అటాచ్ చేసింది.

పెండింగ్‌లో మరిన్ని కేసులు

- ఎయిర్ ఇండియా విమానాల కొనుగోలుకు సంబంధించి రూ.1,272 కోట్ల విలువైన అవినీతి జరిగినట్టు కూడా చిదంబరంపై కేసు ఉంది. దీనిపై విచారణకు హాజరు కావాలని ఇటీవలే ఈడీ ఆదేశాలు జారీ చేసింది.
- రూ.5,600 కోట్ల నేషనల్ స్పాట్ ఎక్స్ఛేంజ్ వ్యవహారంలో చిదంబరం తీసుకున్న నిర్ణయాల వల్లే తమ సంస్థ భారీగా దెబ్బతిన్నదని '63 మూన్స్ టెక్నాలజీస్'సంస్థ (గతంలో దీనిపేరు ఫైనాన్షియల్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్) ఫిర్యాదు చేసింది.
- ఇక శారదా చిట్‌ఫండ్ కేసులో చిదంబరం భార్య నళిని ప్రమేయం ఉన్నట్టుగా సీబీఐ అభియోగాలు నమోదు చేసింది. ఈ కేసులో 1.4 కోట్ల రూపాయల ముడుపులు నళినికి అందినట్టుగా ఆరోపణలున్నాయి.
- బ్లాక్ మనీ అండ్ ఇంపోజిషన్ ఆఫ్ ట్యాక్స్ యాక్ట్, 2015 కింద చిదంబరం, ఆయన భార్య నళిని, కుమారుడు కార్తీ, కోడలు శ్రీనిధిని విచారించాలంటూ ఆదాయపన్ను శాఖ జారీ చేసిన ఆదేశాలను గత ఏడాది మద్రాస్ హైకోర్టు కొట్టివేసినప్పటికీ, సుప్రీం కోర్టులో ఇంకా ఇది పెండింగ్‌లో ఉంది.
- చిదంబరం కేంద్ర హోంమంత్రిగా ఉన్నప్పుడు ఇష్రాత్ జహాన్ కేసులో అఫిడవిట్‌ను తారుమారు చేసినట్టుగా ఆరోపణలున్న కేసు ఢిల్లీ పోలీసుల వద్ద పెండింగ్‌లో ఉంది.

కక్షగట్టారు: కాంగ్రెస్

చిదంబరానికి కాంగ్రెస్, ఆ పార్టీ నేతలు పూర్తి మద్దతు ప్రకటించారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నందునే ఆయనపై కక్షగట్టి కేంద్రం వేధిస్తోందని వారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను, ఓ వర్గం మీడియాను ఉపయోగించి చిదంబరం వ్యక్తిత్వాన్ని హతమార్చడానికి ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. చిదంబరాన్ని కేంద్రం వేటాడుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ అన్నారు. కాంగ్రెస్ ఓ ట్వీట్ చేస్తూ ఏది ఏమైనా తాము చిదంబరానికి పూర్తి మద్దతుగా ఉంటామని తెలిపింది. 'అధికారంలో ఉన్నవారికి వ్యతిరేకంగా నిజం మాట్లాడే పౌరులను పీడించడం ద్వారా ప్రభుత్వం తన పిరికితనాన్ని మళ్లీ మళ్లీ బయటపెట్టుకుంటోంది. చిదంబరం ఎన్నో అర్హతలున్న, గౌరవనీయ నాయకుడు. అంకితభావం, వినయంతో ఆయన ఈ దేశానికి సేవ చేశారు. సత్యాన్వేషణలో మేం ఆయనకు మద్దతుగా ఉంటాం. ఏది ఏమైనా సరే'అని కాంగ్రెస్ ట్విట్టర్‌లో పేర్కొంది. పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా, ఇతర సీనియర్ నాయకులు ఆనంద్ శర్మ, శశి థరూర్ తదితరులు చిదంబరానికి మద్దతుగా మాట్లాడారు. బీజేపీకి చెందిన ముఖ్యమంత్రులు, మంత్రులపై ఎన్ని ఆరోపణలున్నా వారంతా పదవులు అనుభవిస్తున్నారని వారు ఆరోపించారు.

తప్పు చేసి ఉంటే శిక్ష తప్పదు: బీజేపీ

చిదంబరంపై కేసు విషయంలో కాంగ్రెస్ చేసిన కక్షసాధింపు వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. విచారణలో తాము జోక్యం చేసుకోవడంలేదనీ, చిదంబరం తాను చేసిన పనుల వల్లే ఈ పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొంది. 'ఆయన (చిదంబరం) ఏదైనా తప్పు చేసి ఉంటే, తప్పకుండా ఆయన ఆ పరిణామాలను ఎదుర్కోవాల్సిందే. దర్యాప్తు సంస్థలు ప్రభుత్వాదేశాలతో పనిచేయవు. స్వతంత్రంగా పనిచేసే అధికారాలు వాటికి ఉన్నాయి' అని బీజేపీ అధికార ప్రతినిధి షానవాజ్ హుస్సేన్ అన్నారు.

చిదంబరం ఇంటిగేటు మూసివేసి ఉండటంతో ఆయన్ను అరెస్ట్‌చేసేందుకు గేటును ఎక్కి లోపలికి వెళ్తున్న సీబీఐ అధికారులు

చిదంబరం ఇంట్లోకి వస్తున్న సీబీఐ అధికారుల కారును అడ్డుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

దాక్కోలేదు.. నిందితుడిని కాను

న్యూఢిల్లీ: బుధవారం రాత్రి అరెస్టవ్వడానికి కొద్దిసేపటి ముందు చిదంబరం ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి వచ్చి మీడియాతో మాట్లాడారు. అక్కడ చిదంబరం ఏం చెప్పారో ఆయన మాటల్లోనే..

'ఐఎన్ఎక్స్ మీడియా కేసులో నేను కనీసం నిందితుడిని కూడా కాను. చట్టం నుంచి దాక్కోలేదు. చట్టపరంగా రక్షణ కోరుతున్నాను. నేను చట్టం నుంచి దాక్కుంటున్నానని అంటుండటం చూసి విస్మయం చెందాను. న్యాయం కోసం పోరాడుతున్నాను. ఐఎన్ఎక్స్ కేసులో నేను కానీ, నా కుటుంబీకులు కానీ, లేదా మరెవ్వరూ నిందితులు కాదు. ఈ కేసులో సీబీఐ, ఈడీలు అభియోగపత్రం కూడా దాఖలు చేయలేదు. సీబీఐ నమోదు చేసిన వాంగ్మూలాల్లోనూ నేను తప్పు చేసినట్లు ఎక్కడా లేదు. అయినా నేను, నా కొడుకు ఏదో పెద్ద తప్పు చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. అబద్ధాలు చెప్పడమనే రోగం ఉన్నవారు వ్యాప్తి చేస్తున్న అసత్యాలే ఇవన్నీ. నిజాన్ని దాటి ఏదీ ముందుకు వెళ్లలేదు. సీబీఐ, ఈడీలు నన్ను విచారించడం కోసం నోటీసులు ఇచ్చాయి. ముందుజాగ్రత్తగా అరెస్టు నుంచి నన్ను నేను కాపాడుకునేందుకు కోర్టుకు వెళ్లి తాత్కాలిక రక్షణ కోరాను. నాకు దాదాపుగా గత 15 నెలల పాటు ఆ రక్షణ లభించింది. నేను ఎక్కడా దాక్కోలేదు. నిన్న రాత్రంతా నేను నా లాయర్లతో కలిసి కూర్చొని కోర్టులో సమర్పించాల్సిన పత్రాలను సిద్ధం చేస్తున్నా. ఈ రోజు ఉదయానికే పని ముగిసింది. నా కేసును సుప్రీంకోర్టు శుక్రవారమే విచారిస్తుందని తెలిసింది. నేను న్యాయస్థానం ఆదేశాలకు తలవంచుతున్నాను. దర్యాప్తు సంస్థలు పారదర్శకంగా పనిచేయకపోయినా సరే, నేను చట్టాన్ని గౌరవిస్తాను'అని మీడియాతో అన్నారు.

కూతురు ఏడ్చిందని తలాక్

ఇండోర్: ఏడాది వయసున్న కూతురు ఏడుపు భరించలేక తన భార్యకు ఓ వ్యక్తి తలాక్ చెప్పి విడాకులిచ్చిన ఘటన మధ్యప్రదేశ్‌లో జరిగింది. అనంతరం అతడి భార్య ఉజ్మా అన్సారీ ఆమె సొంత జిల్లా బార్వానిలోని సెంధ్వాలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణిస్తూ గత పార్లమెంటు సమావేశాల్లో కేంద్రం కొత్త చట్టం తేవడం తెల్సిందే. ఆగస్టు 4న రాత్రి సమయంలో అనారోగ్యంతో ఉన్న తన కూతురు గుక్కపెట్టి ఏడవడంతో, నిద్ర పాడుచేసిందంటూ భర్త అక్బర్ తనతో గొడవ పెట్టుకున్నాడని పోలీసులకు తెలిపారు. మరిది, మామలు తనను కొట్టారని చెప్పారు. వారి సమక్షంలోనే తన భర్త మూడు సార్లు తలాక్ చెప్పాడని పేర్కొన్నారు.

ఎన్‌డీటీవీ ప్రమోటర్లపై సీబీఐ కేసు

న్యూఢిల్లీ: ప్రముఖ ఆంగ్ల టీవీ ఛానల్ 'ఎన్‌డీటీవీ'పై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) బుధవారం కొరడా ఝుళిపించింది. ఎన్‌డీ టీవీ ప్రమోటర్లు ప్రణయ్ రాయ్, రాధికారాయ్‌తో పాటు సీఈవో సీఈఓ విక్రమాదిత్య చంద్ర, గుర్తుతెలియని ప్రభుత్వాధికారులపై నేరపూరిత కుట్ర, మోసం, అవినీతి తదిరత సెక్షన్ల కింద కేసు నమోదుచేసింది. 2007-09 మధ్య కాలంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) సేకరణ సందర్భంగా ఈ కంపెనీ ఎఫ్ఐడీ నిబంధనల్ని ఉల్లంఘించిందని సీబీఐ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. రూ.కోట్ల పన్నులను ఎగ్గొట్టి నగదును భారత్‌లోకి అక్రమంగా తీసుకొచ్చేందుకు సంక్లిష్టమైన ఆర్థిక వ్యవహారాలు నడిపారు' సీబీఐ తెలిపింది. కాగా, ఈ ఆరోపణలను ఎన్‌డీటీవీ యాజమాన్యం ఖండించింది. భారత న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకముందనీ, జర్నలిజం విలువలకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసింది.

ఐటీఎం వర్సిటీకి ఐసీఏఆర్ అక్రెడిటేషన్

గ్వాలియర్: మధ్యప్రదేశ్‌లోని ఐటీఎం విశ్వవిద్యాలయంలో వ్యవసాయ కోర్సుకు భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్) అక్రెడిటేషన్ లభించిందని విశ్వవిద్యాలయం వర్గాలు తెలిపాయి. గ్వాలియర్‌లో 40 హెక్టార్లలో విస్తరించిన తమ విశ్వవిద్యాలయానికి సొంత వ్యవసాయ క్షేత్రం, ఒక్కో విభాగానికి ప్రత్యేకంగా పరిశోధనాశాలలు ఉన్నాయని వ్యవసాయ విభాగం డీన్ డా.గిరీశ్ పాండే చెప్పారు. ఐటీఎం వర్సిటీలో ఇటీవల తనిఖీలు చేపట్టిన ఐసీఏఆర్ అధికారులు, ఇక్కడి మౌలిక వసతులు, బోధన పద్ధతులతో సంతృప్తి చెంది అక్రెడిటేషన్ మంజూరుచేశారని వెల్లడించారు.

కశ్మీర్‌పై మధ్యవర్తిత్వానికి రెడీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ పాతపాటే పాడారు. కశ్మీర్ సమస్య పరిష్కారం కోసం భారత్-పాకిస్తాన్‌ల మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమని ప్రకటించారు. ఫ్రాన్స్‌లోని బియారిట్జ్‌లో ఈ వారాంతంలో జరిగే జీ7 సదస్సు సందర్భంగా కశ్మీర్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ప్రధాని మోదీతో చర్చిస్తానని ట్రంప్ తెలిపారు. వాషింగ్టన్‌లో ట్రంప్ మాట్లాడుతూ.. 'భారత్, పాకిస్తాన్‌లతో నాకు సత్సంబంధాలు ఉన్నాయి. అయితే ఈ రెండు దేశాల మధ్య పరిస్థితులు ప్రస్తుతం బాగోలేవు. కాబట్టి ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి నా వల్ల వీలైనంతమేరకు ప్రయత్నిస్తాను. అవసరమైతే అందుకోసం మధ్యవర్తిత్వం చేస్తాను' అని వెల్లడించారు. భారత్-పాక్‌ల మధ్య సంబంధాలు ప్రస్తుతం ఘోరంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ను కేంద్రం ఇటీవల రద్దుచేసిన సంగతి తెలిసిందే. అలాగే జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలు(జమ్మూకశ్మీర్, లదాఖ్)గా విభజించింది. దీంతో భారత్-పాక్‌ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడంపై ట్రంప్ ఈ మేరకు స్పష్టం చేశారు. కశ్మీర్ ద్వైపాక్షిక సమస్యనీ, ఇందులో మూడోపక్షం జోక్యాన్ని తాము సహించబోమని భారత్ ప్రకటించినప్పటికీ మధ్యవర్తిత్వం చేస్తానని ట్రంప్ చెప్పడం గమనార్హం. మరోవైపు తాలిబన్లతో చర్చలపై ట్రంప్ స్పందిస్తూ.. అఫ్గానిస్తాన్‌లో తాలిబన్లు బలపడకుండా అమెరికా బలగాలు అక్కడే మరి కొంతకాలం ఉంటాయని ట్రంప్ తెలిపారు. ప్రస్తుతం తాము తాలిబన్లతో చర్చలు జరుపుతున్నామనీ, గతంలో ఏ అధ్యక్షుడూ ఈ పనిని చేయలేకపోయారని వ్యాఖ్యానించారు.

ద్వైపాక్షికమే: బ్రిటన్ ప్రధాని

లండన్: జమ్మూకశ్మీర్ అన్నది భారత్-పాకిస్తాన్‌ల ద్వైపాక్షిక సమస్య మాత్రమేనని బ్రిటన్ తెలిపింది. ఈ సమస్యను ఇరుదేశాలు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించింది. భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడిన బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ కశ్మీర్, ఉగ్రవాదం, లండన్‌లో భారత హైకమిషన్ దగ్గర విధ్వంసం సహా పలు అంశాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా బోరిస్ మాట్లాడుతూ..' కశ్మీర్ సమస్యను భారత్-పాక్‌ల ద్వైపాక్షిక సమస్యగానే బ్రిటన్ గుర్తిస్తోంది. దీన్ని ఇరుదేశాలు చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలి. భారత్-బ్రిటన్‌లు తమ భాగస్వామ్యాన్ని పటిష్టం చేసుకోవాల్సిన అవసరముంది' అని తెలిపారు.

ఉగ్రవాదమే పెనుముప్పు: మోదీ

ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందిస్తూ.. భారత్‌తో పాటు యూరప్‌కు ప్రస్తుతం ఉగ్రవాదం పెనుముప్పుగా మారిందని తెలిపారు. 'ఈ ఉగ్రభూతంపై పోరాడేందుకు మనం సమిష్టిగా చర్యలు తీసుకోవాలి. అప్పుడే తీవ్రవాదం, హింస అసహనం పెచ్చరిల్లకుండా, ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా(ఐఎస్) వంటి ఉగ్రవాద సంస్థలు మన గడ్డపై అడుగుపెట్టకుండా నిలువరించగలం' అని ప్రధాని తెలిపారు. ఫ్రాన్స్‌లో జరిగే జీ7 సదస్సు సందర్భంగా మోదీ, బోరిస్ కలుసుకోనున్నారు.

యోగి కేబినెట్‌లో మరో 18 మంది

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో రెండున్నరేళ్ల తర్వాత బీజేపీ ప్రభుత్వం మంత్రివర్గాన్ని బుధవారం విస్తరించింది. 18 మందికి కొత్తగా మంత్రి పదవులు దక్కగా, సహాయ మంత్రులుగా ఉన్న మరో ఐదుగురికి కేబినెట్ మంత్రులుగా పదోన్నతి కల్పించింది. ప్రస్తుత మంత్రివర్గంలోని ఐదుగురు తమ పదవులకు రాజీనామా చేశారు. 18 మంది కొత్త, 5 మంది పదోన్నతి పొందిన.. మొత్తం 23 మంది మంత్రుల చేత గవర్నర్ ఆనందీబెన్ పటేల్ రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించారు. ఈ 23 మందిలో ఆరుగురు కేబినెట్ మంత్రులుగా, మరో ఆరుగురు స్వతంత్ర హోదా కలిగిన సహాయ మంత్రులుగా, ఇంకో 11 మంది సహాయ మంత్రులుగా ప్రమాణం చేశారు. కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేసిన సురేశ్ రాణా, మహేంద్ర సింగ్, భూపేంద్రసింగ్ చౌదరి, అనిల్ రాజ్‌భర్‌లు గతంలో స్వతంత్ర హోదా కలిగిన సహాయ మంత్రులుగా ఉన్నవారే. కేబినెట్ మంత్రుల్లో కమల్ రాణి ఒక్కరే మహిళ.

ప్రకటనలపై ఫేస్‌బుక్ నియంత్రణ

శాన్‌ఫ్రాన్సిస్కో: ఫేస్‌బుక్ ఉపయోగిస్తున్నప్పుడు మీరెప్పుడైనా ఓ విషయాన్ని గమినించారా. ఫేస్‌బుక్‌లో వచ్చే ప్రకటనలు చూసి.. ఇది ఇప్పుడే ఎక్కడో చూశానే అని మీకెప్పుడూ డౌట్ రాలేదా?.. ఈ యాడ్‌లో వచ్చిన కంటెంట్‌ను ఎక్కడో బ్రౌజ్ చేశానే అని అనిపించలేదా.. కచ్చితంగా చాలామందికి అనిపించే ఉంటుంది. ఎందుకంటే స్మార్ట్‌ఫోన్‌లో మనం ఉపయోగించిన ఇతర యాప్‌లు, బ్రౌజర్లు, వెబ్‌సైట్లు, ఇతర డేటా ప్రకారమే ఫేస్‌బుక్‌లో మనకు ప్రకటనలు వస్తుంటాయి. దీనికి కారణం ఫేస్‌బుక్ మనం చేసే ప్రతీ కార్యకలాపం పైనా ఓ కన్నేసి ఉంచుతుంది. అయితే తాజాగా దీనిపై ఫేస్‌బుక్ స్వీయ నియంత్రణ విధించుకోనుంది. ఇకపై మనం చూసిన వెబ్‌సైట్లు, బ్రౌజర్లలో యూజర్ కార్యకలాపాల ప్రకారం ఫేస్‌బుక్‌లో ఇచ్చే ప్రకటనలను తగ్గించుకోనున్నట్లు పేర్కొంది. దీనికోసం ఫేస్‌బుక్ యాప్‌లో ఓ ఆప్షన్‌ను తీసుకురానుంది. యూజర్లు సంబంధిత సెక్షన్‌లోకి వెళ్లి 'ఆఫ్-ఫేస్‌బుక్ యాక్టివిటీ'అనే ఆప్షన్‌ను ఆఫ్ చేసుకోవాలి. అయితే దీంట్లో ఓ మెలిక ఉంది. ఆఫ్ చేసినప్పటికీ ఫేస్‌బుక్ మీ డేటాను ట్రాక్ చేయడం ఆపదు. కేవలం దానికి సంబంధించిన ప్రకటనలు మాత్రమే తక్కువ సంఖ్యలో వచ్చేలా చేస్తుంది. ప్రస్తుతం ఈ ఆప్షన్‌ను సౌత్ కొరియా, ఐర్లాండ్, స్పెయిన్‌ల్లో మంగళవారం నుంచి అందుబాటులోకి తెచ్చింది. అయితే ఈ ఆప్షన్‌ను ఇతర మార్కెట్లలోకి ఎప్పుడు ప్రవేశపెట్టేది స్పష్టతివ్వలేదు.

మొరాయించిన ట్విట్టర్

న్యూఢిల్లీ: ప్రముఖ సోషల్ మీడియా వేదిక ట్విట్టర్ బుధవారం రాత్రి గంటపాటు మొరాయించింది. రాత్రి 8 గంటల సమయంలో ఈ పరిస్థితి ఎదురైందని పలువురు ట్విట్టర్ యూజర్లు తెలిపారు. కేవలం భారత్‌లోని కొందరు యూజర్లు ఈ పరిస్థితి ఎదుర్కొన్నారని ట్విట్టర్ అధికార ప్రతినిధి తెలిపారు. ఆండ్రాయిడ్‌లో నెట్‌వర్క్ సమస్య వల్ల ఖాతాలను తెరవడంలో సమస్య ఎదురైందని దాన్ని సరిదిద్దామన్నారు. ఇప్పుడు ట్విట్టర్ సజావుగా పని చేస్తోందని తెలిపారు. మొరాయించిన ఒక్క గంటలోనే 2,764 ఫిర్యాదులు అందడం గమనార్హం. భారత్‌లో ట్విట్టర్‌కు 3.4 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు.



ఉత్తరాఖండ్‌లో వరదబాధితుల కోసం సామగ్రిని తరలిస్తున్న ఓ హెలికాప్టర్ కుప్పకూలిన దృశ్యం. ఈ దుర్ఘటనలో విమానంలోని పైలట్ సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

అభినందన్ ఆకాశయానం..!

విధుల్లో చేరి మళ్లీ యుద్ధవిమానాలు నడుపుతున్న వింగ్ కమాండర్

న్యూఢిల్లీ: భారత వాయుసేనలో వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ మళ్లీ విమానాలను నడపడం ప్రారంభించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న పాకిస్తాన్ యుద్ధ విమానాలతో జరిగిన పోరులో వర్ధమాన్ నడుపుతున్న మిగ్-21 విమానం కూలిపోయి ఆయన గాయాలపాలై పాకిస్తాన్‌లో పడిపోవడం తెలిసిందే. తన విమానం కూలిపోవడానికి ముందే వర్ధమాన్ పాకిస్తాన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధవిమానాన్ని కూల్చేశారు. ఆ తర్వాత ఆయన పాకిస్తాన్‌లో పడిపోయినా ఎంతో ధైర్యం ప్రదర్శించి అందరి మన్ననలూ అందుకున్నారు. ఇటీవలే కేంద్రం ఆయనకు వీర చక్ర అవార్డును కూడా ప్రకటించింది. మార్చి 1న రాత్రి వర్ధమాన్‌ను పాక్ భారత్‌కు అప్పగించాక, దాదాపు రెండు వారాల పాటు వర్ధమాన్ చికిత్స అందుకుంటూ భద్రతా సంస్థల పర్యవేక్షణలో ఉన్నారు. వారి విచారణను ఎదుర్కొన్నారు. వీలైనంత త్వరగా మళ్లీ యుద్ధ విమానాన్ని నడపాలని తాను కోరుకుంటున్నట్లు అప్పట్లో వర్ధమాన్ చెప్పారు. బెంగళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ వర్ధమాన్‌కు వైద్య పరీక్షలన్నీ చేసి, ఆయన మళ్లీ విమానం నడిపేందుకు అన్ని రకాలుగా సిద్ధమేనని మూడు వారాల క్రితం వెల్లడించింది. దీంతో వర్ధమాన్ మళ్లీ యుద్ధ విమానాలు నడుపుతున్నారు. ప్రస్తుతం రాజస్తాన్‌లోని వైమానిక స్థావరంలో విధులు నిర్వర్తిస్తున్నారు.

సాక్షి
గురువారం, ఆగస్టు, 22

తరుముకొచ్చిన తప్పులు

''మనం ఇతరులకు ఏది ఇస్తే మనకు అదే తిరిగి వస్తుంది..'' తత్వవేత్తలే కాదు కాస్త తెలివి ఉన్న వాళ్లంతా తరచూ చెప్పేమాట ఇది. ఈ తత్వం బోధపడడానికి ఇంత తక్కువ సమయం పడుతుందని బహుశా పళనియప్పన్ చిదంబరం ఊహించి ఉండరు. కేంద్ర ఆర్థికమంత్రిగా, హోం మంత్రిగా పనిచేసిన అనుభవశాలి, కాకలు తీరిన కాంగ్రెస్‌లో చక్రం తిప్పిన సీనియర్ నాయకుడు... వ్యవస్థలను స్వీయ ప్రయోజనాలకు వాడుకుని, అధికార దుర్వినియోగానికిపాల్పడిన నేరానికి దేశ అత్యున్నత దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ కేసులతో తరుముతున్నాయి. అరెస్టు చేయకుండా నివారించాలన్న మొరలను కోర్టులు వినడం లేదు. బుధవారం సుప్రీంకోర్టు తలుపు తట్టినా ఉపయోగం లేకపోయింది. పోలీసుల సాయంతో సీబీఐ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఐఎన్ఎక్స్ మీడియా' కేసులో చిదంబరం ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడమే కాక ఆయనను అరెస్టు చేసి విచారించాల్సిందేనని మంగళవారం ఢిల్లీ హైకోర్టు తీర్పునివ్వడం కాంగ్రెస్ వర్గాలలో కలకలం రేపింది. అప్పటి నుంచి చిదంబరం కనిపించకుండా పోయారు. ఆయన సెల్ ఫోన్ కూడా స్విచాఫ్ అయిపోయింది. దీంతో బుధవారం ఈడీ లుక్ అవుట్ నోటీసు జారీ చేసింది. కపిల్ సిబల్, వివేక్ తంఖా, సల్మాన్ ఖుర్షీద్, దయాన్ కృష్ణన్ వంటి ఉద్ధండులైన న్యాయవాదులు చిదంబరం తరపున వకాల్తా పుచ్చుకుని సుప్రీంలో వాదించినా ఫలితం దక్కలేదు. ఆ తర్వాత చిదంబరం మీడియా ముందుకు వచ్చారు. ''నేను సాక్ష్యులను ప్రభావితం చేయడంలేదు, సాక్ష్యాలను తారుమారు చేయడం లేదు, అన్నీ నిరాధార ఆరోపణలు, రాజకీయ దురుద్దేశంతో నాపై ఆపాదించారు, దర్యాప్తు సంస్థలు ఎపుడు పిలిస్తే అపుడు విచారణకు హాజరవుతున్నా, 2007 నాటి ఉదంతంలో పద్నేళ్ల తర్వాత 2017లో కేసు దాఖలు చేశారు, రాజ్యసభ ఎంపీని కాబట్టి దేశం విడిచిపెట్టి వెళ్లే అవకాశాలు లేవు'' అంటూ వాదించారు. అరెస్టు తప్పించుకునేందుకు అందరూ చెప్పే మాటలే ఇవి. ఈ వాదనలతో ఇప్పటికే 20సార్లు చిదంబరం, కార్తి అరెస్టు తప్పించుకున్నారని, న్యాయస్థానాల నుంచి ఊరట పొందారని న్యాయనిపుణులు అంటున్నారు. తగిన మోతాదులో సాక్ష్యం కనిపించబట్టే ఈసారి చిదంబరానికి ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించిందన్నది నిపుణుల మాట.

చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉండగా 2007లో ఐఎన్ఎక్స్ మీడియా సంస్థకు రూ.307 కోట్ల విదేశీ నిధులు వచ్చాయి. ఈ వ్యవహారంలో చిదంబరం అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు, ఆయన కుమారుడు కార్తీకి కోట్ల మేర ముడుపులు అందినట్లు ఆరోపణలొచ్చాయి. విదేశీ పెట్టుబడుల అభివృద్ధి బోర్డు (ఎఫ్ఐపీబీ) అనుమతుల విషయంలో అవకతవకలు జరిగాయని 2017 మే 15న సీబీఐ కేసు నమోదు చేసింది. చిదంబరం, కార్తీ, కొందరు ఆర్థిక శాఖ అధికారులు, ఐఎన్ఎక్స్ సంస్థకు చెందిన ఇంద్రాణి ముఖర్జీ, పీటర్ ముఖర్జీ పై అభియోగాలు నమోదయ్యాయి. 2018 అక్టోబర్12న కార్తికి చెందిన రూ. 54 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఇంద్రాణి, పీటర్‌లు అరెస్టయ్యారు. కార్తి గత ఏడాది ఫిబ్రవరిలో అరెస్టయ్యారు. తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. కార్తిని ఈడీ అనేక పర్యాయాలు విచారించింది. చిదంబరంను గత ఏడాది డిసెంబర్‌లో, ఈ ఏడాది జనవరిలో ఈడీ అధికారులు విచారించారు. అయితే జైలులో ఉన్న ఇంద్రాణి ముఖర్జీ అప్రూవర్‌గా మారారని, ఈ కేసులో మారిషస్ దొంగదారులతో సహా అన్ని అవకతవకల గురించి పూసగుచ్చినట్లు ఏకరువు పెట్టారని అధికారులు చెబుతున్నారు. ఢిల్లీ హైకోర్టుకు ఈడీ అన్ని ఆధారాలు సమర్పించబట్టే చిదంబరం కథ కంచికి చేరిందని అంటున్నారు. ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణమే కాదు ఎయిర్ సెల్ మాక్సిస్ కుంభకోణం కూడా చిదంబరం కుటుంబాన్ని 2006 నుంచి వెంటాడుతోంది. అలాగే 2జీ స్పెక్ట్రమ్ కేసు కూడా. ఆర్థిక మంత్రిగా ఉండగా చేసిన తప్పులన్నీ తరుముకొస్తున్నాయి.

కుంభకోణాలే కాదు చీకటి ఒప్పందాలకూ చిదంబరం మారుపేరన్న ఆరోపణలున్నాయి. చిరకాల ప్రత్యర్థి పార్టీలైన తెలుగుదేశం,కాంగ్రెస్‌ల మధ్య కుదిరిన రహస్య మిత్రత్వం వెనుక మంత్రాంగం నెరపిన మాయలమారిగా చిదంబరం పేరుమోశారు. కేంద్రంలో చిదంబరం మంచి ఫామ్‌లో ఉన్న రోజుల్లో ఆయనతో కుదుర్చుకున్న రహస్య ఒప్పందం మేరకే చంద్రబాబు మీద పలు కేసులు మాఫీ అయిపోయాయని ఏకంగా జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. టీడీపీ ఎంపీగా ఉన్న నామా నాగేశ్వరరావు ఒక సందర్భంలో పార్లమెంటులో అనర్గళ ఉపన్యాసం ఇస్తుంటే.. నువ్వు, మీ నాయకుడు చంద్రబాబు నన్ను రహస్యంగా కలిసి ఏంమాట్లాడారో ఇక్కడ చెప్పమంటావా అంటూ చిదంబరం ఆయన నోరు మూయించడం చూసి తెలుగుదేశం మాత్రమే కాదు యావద్దేశం నివ్వెరపోయింది. ఇలాంటి వివాదాలు చిదంబరానికి కొత్తేమీ కాదు. మన దేశంలో 'చెప్పు దెబ్బ' తిన్న తొలి రాజకీయ ప్రముఖుడు కూడా ఘనత వహించిన చిదంబరమే. సిక్కుల ఊచకోత కేసులో జగదీష్ టైట్లర్‌కు సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిన ఉదంతంపై 2009 ఏప్రిల్ 7న మాట్లాడుతుండగా చిదంబరంపై సిక్కు జర్నలిస్టు చెప్పు విసరడం అప్పట్లో సంచలనం సృష్టించింది. హార్వర్డ్ బిజినెస్ స్కూలులో ఎంబీఏ పట్టా పుచ్చుకున్నా తండ్రి వ్యాపార వారసత్వాన్ని కొనసాగించకుండా మద్రాసు లా కాలేజీలో అందుకున్న ఎల్ఎల్‌బీ పట్టానే చిదంబరం నమ్ముకున్నారు. మద్రాసు హైకోర్టులో మొదలై సుప్రీంకోర్టు వరకు ఎదిగారు. కానీ తర్వాత న్యాయాన్యాయ లొసుగులను, హార్వర్డ్ వాణిజ్య కిటుకలను కలబోసి కుంభకోణాలు చేసే స్థాయికి దిగజారతారని ఎవరూ ఊహించలేదు. వీటితో పాటు ప్రత్యర్థులపై రాజ్యాంగ వ్యవస్థలను, దర్యాప్తు సంస్థలను ప్రయోగించడంలో చిదంబరాన్ని మించినవారు లేరు. విధి బలీయమైనది.. రాజకీయ కక్షసాధింపు కేసులలో ఆయన ఏమేం చేశారో ఇపుడు అవే ఆయనకు జరుగుతున్నాయి.. కుట్ర కేసులు మోపి వేధించడం, ఆరోపణలు రుజువు కాకపోయినా అరదండాలు వేయించడం, బెయిల్ దొరక్కుండా చేయడం ఇలాంటివన్నీ ఎక్కడో విన్నట్లుంది కదూ... అందుకే అన్నారు.. మనం ఏమి ఇస్తే తిరిగి మనకు అదే వస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి బ.సప్తమి రా.3.10 వరకు,తదుపరి అష్టమి నక్షత్రం భరణి రా.11.11 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం ఉ.7.58 నుంచి 9.41 వరకు, దుర్ముహూర్తం ఉ.9.56 నుంచి 10.46 వరకు తదుపరి ప.2.57 నుంచి 3.47 వరకు, అమృతఘడియలు...సా.6.07 నుంచి 7.46 వరకు,

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం: 6.20
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

రద్దుల పద్దులో రిజర్వేషన్లు!

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రాజ్యాంగం ప్రకారం లభిస్తున్న రిజర్వేషన్లపై దాపరికం లేకుండా చర్చించాల్సి ఉందని ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ తాజాగా ప్రకటించిన నేపథ్యంలో గత ఏడుదశాబ్దాలుగా దేశంలో అమలవుతూ వస్తున్న రిజర్వేషన్లు ప్రమాదంలో పడనున్నాయి. దేశంలో గోరక్షణ చట్టాల పేరుతో దళితుల, ఆదివాసీల, మైనారిటీల ఆహార ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిన ప్రస్తుత పాలకులు ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశారు. తాజాగా ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూ కశ్మీర్ స్వయం ప్రతిపత్తికి మంగళం పాడేశారు. ఇక రామమందిర నిర్మాణం. రిజర్వేషన్ చట్టం రద్దు వీరి కీలక ఎజెండాగా మారాయి. వీలైనంత త్వరలో రిజర్వేషన్ రద్దు బిల్లును కూడా కేంద్రం తీసుకు వచ్చే ప్రమాదం ఉంది. మనం ఇప్పుడు దళిత, ఓబీసీ, ఆదివాసీ, మైనారిటీ, శరణార్థుల హక్కులను రద్దు చేసే యుగంలో ఉంటున్నాం. ఇది మన ప్రజాస్వామ్యం నూతన దశ.

విశ్లేషణ

ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఆరెస్సెస్ రిజర్వేషన్లను వ్యతిరేకించే సంస్థగా ఉంటోంది. ఆ సంస్థ అధినేత మోహన్ భాగవత్‌కు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చాలా ప్రకటనలు చేసిన రికార్డు కూడా ఉంది. ఆగస్టు 19న ఆయన తాజా ప్రకటనలో రిజర్వేషన్ల సమస్యపై నిర్దిష్ట దిశలో తప్పక చర్చించాల్సిందేనని వక్కాణించారు. ''ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఇస్తున్న రిజర్వేషన్‌కు సంబంధించి దాపరికం లేకుండా చర్చించాల్సి ఉంద''ని ఆరెస్సెస్ చీఫ్ చెప్పారు. ఆయన గతంలోనూ ఇలాంటి ప్రకటనలే చేసి ఉన్నారు.

ఆరెస్సెస్ దీర్ఘకాలంగా తాను పెట్టుకుంటూ వచ్చిన అజెండాలను ఒక్కటొక్కటిగా మోదీ ప్రభుత్వం ద్వారా అమలు చేయిస్తోంది. పశువులను మేపే శూద్ర రైతుల ఆర్థిక వ్యవస్థను, దళిత, ఆదివాసీ, ముస్లింలు నిర్వహిస్తున్న ఆహార ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసేందుకోసం గోరక్షణ చట్టాలను రూపొందించాల్సిందిగా అది రాష్ట్రాల ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చింది. ట్రిపుల్ తలాక్ చట్టాన్ని తీసుకురావలసిందిగా కూడా ఆరెస్సెస్ నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చింది. ఈ కోవలో తాజాగా ఆర్టికల్ 370కి కూడా మంగళం పాడేసింది. దాని దీర్ఘకాలిక ఎజెండా అమలుకు సంబంధించి మరో రెండు ప్రధాన సమస్యలు పెండింగులో ఉన్నాయి. అవి రామమందిర నిర్మాణంపై తీర్మానం. రిజర్వేషన్ చట్టాల రద్దు. సమీప భవిష్యత్తులోనే ఆరెస్సెస్ వీటి అమలుకు కూడా పావు కదపనుంది.

ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో ఓబీసీల ఓట్లను భారీగా రాబట్టుకున్న నరేంద్రమోదీని ఇప్పుడు రిజర్వేషన్ రద్దు చట్టాన్ని అమలు చేయాలని ఆరెస్సెస్ ఒత్తిడికి గురిచేయవచ్చు. ఆ రోజు కూడా ఎంతో దూరంలో లేదు. కాంగ్రెస్ వేదికలపై పనిచేస్తున్న రిజర్వేషన్ వ్యతిరేక మేధావులు రిజర్వేషన్ రద్దు చట్టాన్ని పూర్తిగా బలపరుస్తారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు మనీష్ తివారీ, జనార్దన్ ద్వివేదీలు రిజర్వేషన్‌లపై ఏ వైఖరితో ఉన్నారో దేశం మొత్తానికే తెలుసు. చాలామంది లౌకికవాద మేధావులు తమ హృదయంలో రిజర్వేషన్ల వ్యతిరేకులుగా ఉంటున్నారు.మోహన్ భాగవత్ తేలికగా తీసిపారవేయదగిన స్థాయి వ్యక్తి కాదు. బీజేపీ, ఆరెస్సెస్ యంత్రాంగాల్లో ఆయనకు చాలా పట్టుంది. తాను చంద్రగుప్తునికి కౌటిల్యుడి వంటివాడు. మురా అనే శూద్ర/ఓబీసీకి చెందిన మహిళ పుత్రుడే మౌర్యుడు. కుల వ్యవస్థను వ్యవస్థీకృతం చేయడానికి అవసరమైన ప్రతి పనినీ, చర్యనూ కౌటిల్యుడు.. చంద్రగుప్త మౌర్యుడితో చేయించాడు.

కులవ్యవస్థపై, మన విద్యా సంస్థల్లోని సైన్స్ వ్యతిరేక, మానవ వ్యతిరేక స్వభావంపై చర్చించాలని ఆరెస్సెస్ ఎన్నడూ కోరలేదు. పైగా శూద్రులకు, ఎస్సీలకు, ఆదివాసులకు ఎలాంటి హక్కులను ప్రసాదించని వేదాలు, రామాయణం, మహాభారతంపై చర్చించాలని ఈ సంస్థ కోరింది. ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ హిందూ మతంలో మానవ సమానత్వం గురించి ఎన్నడూ మాట్లాడిన పాపాన పోలేదు. హిందూ మతం నుంచి అంటరానితనాన్ని రద్దు చేయాలని ఒక్క ప్రకటన కూడా ఆయన విడుదల చేయలేదు. హిందూ మతం పరిధిలో శూద్రులకు, ఓబీసీలకు, ఆదివాసీలకు అర్చకత్వ హక్కులను

కల్పించడమే ఆయన ఏనాడూ మాట్లాడలేదు. హిందూమతంలో పురుషులతోపాటు మహిళలకు కూడా సమాన హక్కులు ఇవ్వాలని తాను ఎప్పుడూ బహిరంగ ప్రకటన చేయలేదు. పైగా చరిత్రాత్మక పోరాటాల ద్వారా ప్రజలు సాధించుకున్న కొన్ని హక్కులను రద్దు చేయాలని బలంగా వాదించేవారు.

కులవ్యవస్థ రద్దుపై మోహన్ భాగవత్ ఎన్నడూ ప్రకటించలేదు. హిందూమతంలోనూ వెలుపలా బ్రాహ్మణాధిపత్యాన్ని రద్దు చేయాలని అయన ఎన్నడూ మాట్లాడి ఉండలేదు. ప్రధానంగా దళితులు, ఓబీసీలే ఉంటున్న వ్యవసాయ కూలీల వేతనాలు పెంచడంపై తానెన్నడూ మాట్లాడింది లేదు. కానీ రిజర్వేషన్లపై తీవ్రంగా చర్చించాల్సి ఉందంటూ ఆయన పదే పదే మాట్లాడుతూ వచ్చారు.ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆరెస్సెస్ చీఫ్ ఏ కీలక ప్రకటన చేసినా ప్రధాని నరేంద్రమోదీ మాత్రం మౌనవ్రతం పాటిస్తుంటారు. ఆయన మౌనం తన గురువు ఆదేశాన్ని పూర్తిగా ఆమోదించడాన్నే సూచిస్తుంది. ఆరెస్సెస్‌లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు సంస్థకు కండబలంగా మాత్రమే ఉంటున్నారు. పెద్దగురువు ఆదేశాలను ఏమాత్రం వ్యతిరేకించకుండా వీరికి పూర్తిగా బ్రెయిన్‌వాష్ చేస్తుంటారు. జాతి ప్రయోజనాల బట్టే ఆరెస్సెస్ పనిచేస్తుందని వీరికి నూరిపోస్తుంటారు. జాతి ప్రయోజనాలు సమాజంలోని విడి వర్గాల ప్రయోజనాలకు పైనే ఉంటాయి మరి.

దళితులు, ఓబీసీలు, ఆదివాసీలు హిందూ సమాజంలో విభాగాలు మాత్రమే. బ్రాహ్మణవాదపు ప్రతిభా మూర్తులే జాతికి ప్రతిబింబం అన్నమాట.దీన్ని ఏ పరిస్థితుల్లోనూ ఇబ్బందిపెట్టరాదు. సంఘ్ పరివార్‌లోని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఇచ్చే సైద్ధాంతిక శిక్షణలో కులాలకు, కమ్యూనిటీలకు, మహిళలకు ఇవ్వాల్సిన సమాన హక్కుల కంటే దేశంలోని మైనారిటీ మతస్తులే అసలు శత్రువులని నూరిపోస్తుంటారు.ఏబీసీలకు చెందిన మన ప్రధాన మంత్రి కూడా దీనికి భిన్నంగా ఉండరు. రిజర్వేషన్ బిల్లు రద్దు కనుక పార్లమెంటు ముందుకు వస్తే దాన్ని ఆమోదింపచేసే బాధ్యత మోదీ మీదే ఉంది. పైగా దానికి అనుగుణంగా ఓట్లేయడానికి ప్రతిపక్ష పార్టీలనుంచి బొచ్చెడుమంది సభ్యులు క్రాస్ ఓటు వేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు కూడా.

దేశంలో శూద్ర, ఓబీసీ, దళిత నేపథ్యంలోని ప్రాంతీయ రాజకీయ పార్టీలకు మోహన్ భాగవత్ నిర్నిరోధక శక్తిని నిలువరించే సత్తా లేదు. శక్తివంతుడైన ఓబీసీ ప్రధానమంత్రి గత అయిదేళ్ల పాలనలో దేశంలోని మొత్తం కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, ఐఐఎమ్‌లు వంటి అత్యున్నత విద్యాసంస్థలను రిజర్వేషన్ సమస్యపై మోహన్ భాగవత్‌ను అనుసరించే వ్యక్తుల చేతుల్లో పెట్టారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, ఐఐటీ, ఐఐఎమ్‌ల డైరెక్టర్లలో చాలామంది రిజర్వేషన్లపై ఆరెస్సెస్ అధినేత అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నవారే. చివరకు కమ్యూనిస్టులలో కూడా చాలామంది ఈ సిద్ధాంతాన్నే విశ్వసిస్తున్నారు. కులపరమైన అసమానతలకు సంబంధించిన ప్రశ్న ఎదురైనప్పుడు అనేక పార్టీల రాజకీయ సరిహద్దులు చెరిగిపోతుంటాయి. రిజర్వేషన్ బిల్లు తీరా పార్లమెంటులో ప్రవేశపెట్టిన రోజున మోహన్ భాగవత్ తన నిజమైన మిత్రులను తప్పక కనుగొంటారు. అదేసమయంలో అంబేడ్కర్, ఆయన అనుయాయులు, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగెత్తుతుంటారు.

ముస్లింలు అంతర్జాతీయ కమ్యూనిటికీ చెందినవారు కాబట్టి ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పుడు అదొక ప్రపంచ సమస్య అయిపోయింది. కానీ రిజర్వేషన్ల రద్దు చట్టం ఉనికిలోకి వచ్చినప్పుడు ఏ అంతర్జాతీయ వేదిక కూడా దానిగురించి చర్చించబోదు. ఎందుకంటే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు.. ముస్లింలలాగా అంతర్జాతీయ శక్తిగా లేరు. రిజర్వేషన్ల పరిధికి అవతల ఉన్న కులాల్లో రిజర్వేషన్ వ్యతిరేక సెంటిమెంట్ బీజేపీ అధికారంలోకి వచ్చాక బాగా పెరుగుతోంది.

దళితులు, ఓబీసీలు, ఆదివాసీలకు ఇప్పటివరకు ఇంగ్లిష్ చదివిన మేధో శక్తి దన్ను లేదు. సర్ సయ్యద్ హమద్, అలీగర్ ముస్లిం యూనివర్శిటీ ప్రభావ ఫలితంగా ముస్లింలు ఇంగ్లిష్ చదువుకున్న విద్యావంతుల వర్గంగా మారారు. కానీ అలాంటి సెక్షన్ దళితులకు, ఓబీసీలకు లేదు. రిజర్వేషన్ చట్టం రద్దుకు ఆరెస్సెస్ తప్పకుండా బలమైన పునాదిని సిద్ధం చేస్తుంటుంది. ప్రాచీనకాలపు వర్ణధర్మ వ్యవస్థను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని గోల్వాల్కర్ తన ఒక పుస్తకంలో ప్రతిపాదించారు. మహాత్మాగాంధీ కూడా వర్ణధర్మ పునరుద్ధరణకు అనుకూలంగా వాదించారు కాబట్టి ఆరెస్సెస్ శక్తులు గాంధీ భావాల మద్దతును కూడా తీసుకోవచ్చు.

ఆరెస్సెస్, బీజేపీలు రిజర్వేషన్ బిల్లు రద్దుకు పూనుకుంటే, సెక్యులర్ ముసుగులోని రిజర్వేషన్ వ్యతిరేక శక్తులు చాలావరకు వారికి మద్దతు ఇస్తాయి. లౌకికవాదులు కాంగ్రెస్ పాలనలో విద్యా సంస్థలను నిర్వహించినప్పుడు రిజర్వేషన్ల అమలుకు తిరస్కరించిన చరిత్ర కూడా ఉంది. నేడు ఆర్టికల్ 370 రద్దు విషయంలో ఆరెస్సెస్, బీజేపీకి కొత్త మద్దతుదారులు చాలామంది దొరికారు. అలాగే రిజర్వేషన్ల రద్దు విషయంలోనూ ప్రతిపక్ష శిబిరం నుంచి వీరికి మరింత మద్దతు లభించవచ్చు కూడా. ఒక్కమాటలో చెప్పాలంటే మనం ఇప్పుడు దళిత, ఓబీసీ, ఆదివాసీ, మైనారిటీ, శరణార్థుల హక్కులను రద్దు చేసే యుగంలో ఉంటున్నాము. ఇది ప్రజాస్వామ్యం నూతన దశ.

వ్యాసకర్త డైరెక్టర్, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రతీకారం

"కేంద్ర మాజీ మంత్రి చిదంబరాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలు వేధిస్తున్న తీరు పూర్తిగా అన్యాయం. బాధ్యతాయుతమైన, గౌరవప్రదమైన వ్యక్తిపై లుక్ ఔట్ నోటీసులు జారీ చేయడం సరికాదు. దేశంలోని ప్రతివ్యక్తికీ చట్టపరంగా తనను తాను రక్షించుకునే అవకాశం ఉంది. అటువంటప్పుడు దర్యాప్తు సంస్థలు వెంటపడటం ఎందుకు? దీన్నిబట్టి అధికారులపై ఎవరో ఒత్తిడి తెస్తున్నారని అర్థమవుతోంది. వివిధ స్థాయిల్లో దేశానికి సేవలందించిన ఆయనను అవమానించాలనుకోవడం ప్రతికార రాజకీయాలకు పాల్పడటమే. ఆయనకే నా మద్దతు. న్యాయమే గెలుస్తుంది. "

– అశోక్ గెహ్లోత్, కాంగ్రెస్ నేత

శిక్ష

"కాంగ్రెస్ పార్టీ, చిదంబరం 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్నారు. గుజరాత్ అల్లర్లకు కారణమైనవారిని శిక్షించడానికి వాళ్లు చేసిందేమీ లేదు. గుజరాత్‌లో వాళ్లు చేసిన నేరాలకు వాళ్లను కాంగ్రెస్ శిక్షించి ఉంటే, ఈ రోజు దేశం మరో రకంగా ఉండేది."

–మహ్మద్ అసిఫ్ ఖాన్, సామాజిక కార్యకర్త

దారి

"విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ ఎలా దేశం దాటిపోయారని చిదంబరం అడుగుతుంటే ప్రజలంతా ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని అనుకున్నారు. కానీ, ఆయన ఆ దారి తెలుసుకోవడానికి అడుగుతున్నాడని ఇప్పుడు ప్రజలకు అర్థమై ఉంటుంది. "

– అశ్విన్ షీల్వంత్‌మర్, వైద్యుడు

నిజాయితీ

"ఎన్డీటీవీ వ్యవస్థాపకుడు ప్రణయ్ రాయ్, ఆయన భార్య రాధికా రాయ్, విక్రమ్ చంద్ర తదితరులపై సీబీఐ కేసు దాఖలు చేసింది. వాళ్లు తమను ఎవరూ ఏమీ చేయలేరని అనుకుంటున్నారు. కానీ, త్వరలోనే వాళ్ల వ్యవహారాలన్ని బయటపడి, శిక్ష అనుభవించనున్నారు. ఒక నిజాయతీపరుడైన వ్యక్తి సరైన స్థానంలో ఉంటే ఇలాంటివన్నీ సాధ్యమే."

– వినాయక్, రచయిత

హ్యూమర్

"సౌహార్ద రాయబారిగా ప్రియాంకా చోప్రాను తొలగించాలంటూ యూనిసెఫ్‌కు పాకిస్తాన్ మానవహక్కుల మంత్రి లేఖ రాయడం జోక్ ఏమీ కాదు. కానీ, మానవ హక్కులకు పాకిస్తాన్‌లో ఒక మంత్రి ఉండటం జోక్."

– సువలగ్న చంద్ర, రచయిత్రి

జీఎస్టీ

"జీఎస్టీని తగ్గించాల్సి ఉందనీ, దాని వల్ల చాలా నష్టం వాటిల్లుతోందని, బిస్కెట్లు తినడం తగ్గిపోయిందనీ, అందుకే తాము ఉద్యోగులను తగ్గిస్తున్నామనీ పార్లే సంస్థ ఒక ఇంటర్వ్యూలో చెప్పింది. జీఎస్టీకి సంబంధించి నేను చేయగలిగేదేమీ లేదు. అయితే, మరిన్ని ఎక్కువ బిస్కెట్లు తినడం ద్వారా ఉద్యోగాలు కాపాడాలనుకుంటున్నా."

– నైగెల్ డిసౌజా, యాంకర్

రజాకార్లను ఎదిరించిన ఆంధ్ర కేసరి

సందర్భం

టంగుటూరి శ్రీరాం

రజాకార్ల దురాగతాలు జరుగుతున్న రోజులవి. హైదరాబాద్‌తో సహా పరిసర గ్రామాలు కూడా భయాందోళనలలో గడుపుతున్న చీకటి రోజులవి. రజాకార్ల హింసను భరించలేక మునగాల పరగణాలలోనూ అల్లర్లు చెలరేగాయి. మునగాల పరగణా నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగమే. వాసిరెడ్డి దుర్గాసదాశివేశ్వర ప్రసాద్ నందిగామ తాలూకా కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉండేవారు. ఆంధ్ర రాష్ట్రావతరణ జరిగిన తరువాత విశాలాంధ్ర (ఆంధ్రప్రదేశ్) ఏర్పాటుకు కృషి జరుగుతున్న కాలమది, ప్రకాశం పంతులు గారు జగ్గయ్యపేట చేరుకున్నారు. దుర్గాసదాశివేశ్వర ప్రసాద్ ప్రకాశం గారికి ఆ ప్రాంత ప్రజల స్థితిగతులు వివరించారు. పంతులుగారు ఆ వివరణతో తృప్తి చెందక మునగాలకు పోదామన్నారు. తాను స్వయంగా అక్కడి వారిని కలిసి బాగోగులు తెలుసుకోవాల న్నారు. ఆరోజులలో నిజాం రాష్ట్రంలో ప్రయాణ మంటే ఆత్మహత్యే అని, రజాకార్లు దారి దోపిడీ చేస్తారని, హత్యలు కూడా చేస్తారని స్థానిక ఎస్ఐ వచ్చి పంతులు గారిని వారించారు. ఏమి జరిగినా సరే వెళ్లి తీరవలసిందే. అక్కడ మనవాళ్లు అగచాట్లు పడుతూఉంటే మనం ఇక్కడ ఉబుసుపోక మాటలు చెప్పుకుంటు ఉంటామా.. వెళ్లి తీరాలి అన్నారు.

కారు బయలుదేరి పోలేటి (నిజాం సరిహద్దు) వద్ద ఆగింది. ఆవలివైపు రోడ్డుకు అడ్డంగా

పెద్ద మోకు ఉంచారు. రజాకార్లు కత్తులతో పచార్లు చేస్తున్నారు. పంతులుగారు పరిస్థితి అంతా గమనించి డ్రైవర్‌తో 'నీ నైపుణ్యం చూపవలసిన సమయమిది.. రివ్వున వారి మధ్యనుంచే కారు పోనీ.. నేనున్నానుగా,' అని గర్జించాడు. డ్రైవరు కూడా సింహం పక్కనుండగా సాహసంతో కారును మెరుపులా దూసుకు పోనిచ్చాడు. మోకు తెగి దూరంగా పడిపోయింది. రజాకార్లు హాహాకారాలు చేస్తూ కొద్ది దూరం వెంబడించారు. కారు దూసుకు పోయింది. కోదాడ చేరినారు. మళ్ళీ అక్కడ కూడా రజాకార్లు అడ్డగించారు. కారు దిగమన్నారు. బెదిరించారు. పంతులుగారు దిగలేదు. వాళ్ళ ప్రశ్నలకు సమాధానం కూడా చెప్పలేదు.ప్రకాశం గారిని కిందకు లాగడానికి రజాకార్లు యత్నించారు.

ఇదంతా గమనించిన కలెక్టరు.. ప్రకాశంగారి దగ్గరకు వచ్చి అయ్యా నేను మీ శిష్యుడ్ని. మాది కర్నూలు, మీరు ప్రాక్టీసు చేస్తుండగా మీ వద్ద పని చేశాను. లోనికి వచ్చి టీ తీసుకోండి అని మర్యాదగా ఆహ్వానించాడు. టీ తాగుతుండగా కలెక్టరు గారు పంతులుగారిని వెనక్కు తిరిగి వెళ్లిపొమ్మని ప్రాధేయపడ్డాడు. మాటతప్పడం, వెనుతిరగడం ప్రకాశం పంతులుగారి నైజం కాదు. ప్రమాదమెక్కడో ప్రకాశం అక్కడ. రజాకార్ల మధ్యనుంచే కారులో పంతులుగారు మునగాల చేరుకుని వారి సమస్యలను తెలుసుకుని. త్వరలో మీ కష్టాలు పోతాయి. హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ (విశాలాంధ్ర) ఏర్పడబోతోంది. రజాకార్లను పారదోలే రోజులువచ్చాయని వారికి ధైర్యం చెప్పారు. ఇంతటి తెగింపు, సాహసం, ధైర్యంలోనూ ఆయనలోని శాంతికపోతం, సుస్పష్టంగా గోచరిస్తుంది.

బ్రిటిష్ గుండుకు తన గుండె చూపిన, రజాకార్లను ఎదిరించి వారి సెల్యూట్ స్వీకరించిన ఏకైక తెలుగు తేజం ప్రకాశం పంతులు. ఆజన్మాంతం ప్రకాశంగారు ప్రజల క్షేమం, సర్వ తోము ఖాభివృద్ధిని కోరి సర్వస్వాన్ని త్యాగం చ

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 22-8-2019

తాగుడు తెచ్చిన తంటా!
సినిమా పేజీలో...

ప్రేమించిన వాళ్లను
మళ్లీ ప్రేమించాలి ఇంట్లో.
అభిమానించే వాళ్లని
అభిమానిస్తూనే ఉండాలి ఇంట్లో.
అనుబంధాన్ని కుండీలో మొక్కలా
నీరు పోసి కళకళలాడిస్తూనే ఉండాలి ఇంట్లో.
ఎవరైనా ఎటైనా పోనీలే అనుకునే చోటు కాదు ఇల్లు.
ఎవరైనా ఎలాగైనా ఉండచ్చులే అనుకునే చోటు కాదు ఇల్లు.
మళ్లీ మళ్లీ దగ్గరగా హత్తుకుంటూనే ఉండాలి.
మళ్లీ మళ్లీ మన కుటుంబంతో ప్రేమలో పడుతూనే ఉండాలి.

భార్యగారూ... ప్రేమించండి

నాలుక పచ్చగా అయిపోయిందా అన్న భ్రాంతి. లోపల లివర్ పెరిగిపోయిందేమోనన్న భ్రాంతి. తల తిరగడుగాని తిరిగిపోతున్నదేమోన్న భ్రాంతి. ఇంట్లో ఉంటే ఆఫీసుకు వెళ్లబుద్ధవుతుంది. ఆఫీసుకు వెళితే ఇంటికి పారిపోమని మనసు చెబుతుంది. పొట్ట ఏమీ కదిలినట్టు అనిపించదు. లేదా ఎంతో కదిలిపోయినట్టు అనిపిస్తుంది. గతంలో టిఫెనుకు కూచుంటే మూడు రకాల ప్లేట్లు లేవాలి. నేడు ఒక ఇడ్లీ గతికితే పెద్ద విషయం. లోకం మీద ఏ ఆశా లేదు. అసలు ఏం కావాలో అర్థం కావడం లేదు.

అతికష్టం మీద ఈ బడబాగ్నిని దాచుకుంటున్నాడు. భార్యకు తెలియకుండా. కూతురికి తెలియకుండా. కూతురు చాలా తెలివైనది. అది నాన్న పిల్ల.

'ఏంటి నాన్న అలా ఉంటున్నావు?' అంది మొన్న చూసి.

'నాకేమైంది బాగున్నానే' అన్నాడు హుషారు నటిస్తూ.

'బీరు తాగడం కూడా మానేశావు. 'నా లగ్జరీ అదే... వారానికి ఒకసారి' అంటే అమ్మా నేను పర్మిషన్ ఇచ్చాం కదా. మూడు వారాలుగా నువ్వు తాగట్లేదు. ఫ్రెండ్స్‌తో జోకులు వేయడం లేదు. ఎప్పుడూ లేనిది గుడికెళ్లి కూచుంటున్నావు. ఏమైంది నాన్నా?'

ఏం చెబుతాడు.

ఏమీ చెప్పడు.

'ఏం లేదమ్మా. ఫైనాన్షియల్‌గా ఎదుగుదల ఆగిపోయినట్టు అనిపిస్తుంది. ఫార్టీ ఫైవ్‌కు చేరుకున్నా కదా. కొత్త ఉద్యోగాలకు ఎవరూ పిలువరు. ఉన్న ఉద్యోగంలో ఎదుగుదల ఉండదు' అన్నాడు.

భార్య వచ్చి కూచుంది.

'ఇప్పుడు ఏం కొంప మునిగిపోయిందనండీ. మనమ్మాయి జెమ్. ఒకటికి నాలుగు స్కాలర్‌షిప్‌లు వస్తున్నాయి. రేపోమాపో అమెరికా వెళ్లిపోతుంది. అందుకు కావలసిన ఏర్పాట్లు అమౌంట్ మనం ముందే చూసుకున్నాం. తను అమెరికా వెళ్లిపోతే మన ఖర్చెంతని. మీరు ఉద్యోగం మానేసినా ప్రధాని రోజ్‌గార్ యోజన కింద పప్పులు ఉప్పులు అయినా వస్తాయిగా' అంది జోక్ చేస్తూ.

తను కూడా నవ్వాడు.

చాలా రోజుల తర్వాత ముగ్గురు కాసేపు కబుర్లు చెప్పుకున్నారు.

* * *

పట్టాల మీద నడుస్తూ ఉన్నాడు. కారు ఖైరతాబాద్ స్టేషన్ దగ్గర పెట్టేశాడు. తాళాలు జేబులో ఉన్నాయి. ఫోన్ కూడా జేబులోనే ఉంది. పర్స్, అందులో విజిటింగ్ కార్డులు కూడా ఉన్నాయి. గుర్తు పట్టడానికి ఆ మాత్రం ఆనవాలు చాలు. పట్టాలమీద అనుమానం రాకుండా ఉండేందుకు ఏదో క్యాజువల్‌గా నడుస్తున్నట్టు నడుస్తున్నాడు. కాని బ్రాండెడ్ ప్యాంట్ మీద బ్రాండెడ్ షర్ట్ ఇన్ చేసి పాయింట్ షూస్ వేసి ఎగ్జిక్యూటివ్‌లాగా వున్న వ్యక్తి అలా పట్టాల మీద నడవడం స్ట్రేంజ్‌గానే ఉంది. ఎంత స్ట్రేంజ్‌గా ఉన్నా ఇంకో ఐదు పది నిమిషాల సేపే. ఈలోపు ఏదో ఒక ట్రైన్ వస్తుంది. కథ కంచికి చేరుతుంది.

దూరంగా అలజడి మొదలైంది.

ఏదో ట్రైన్ చాలా వేగంగా వస్తున్నట్టు అర్థమైపోయింది.

చాలా ధైర్యంగా గుండెలు కూడగట్టుకుంటూ నిలబడ్డాడు.

ట్రైన్ సమీపిస్తూ ఉంది.

ఇంతలో ఫోన్. రింగవుతూనే ఉన్న ఫోన్. బహుశా తాను మాట్లాడబోయే లాస్ట్ కాల్. తీసి చూశాడు. కూతురు. మాట్లాడాలా వద్దా... మాట్లాడాలా వద్దా? అప్రయత్నంగా ప్రెస్ చేశాడు.

'నాన్నా... ఎక్కడున్నావ్?' ఆ ప్రశ్న కూతురి గొంతు అప్రయత్నంగా అతడి కళ్లల్లో నీళ్లు చిప్పిల్లేలా చేశాయి. అప్రయత్నంగా పట్టాల మీద నుంచి తప్పుకున్నాడు. పెద్ద హోరు చేస్తూ రైలు వెళ్లిపోయింది.

కాని ఎప్పుడూ లేనిది తండ్రి ఫోనులో రైలు చప్పుడు విని ఆ అమ్మాయి ఎంతో అప్రమత్తం అయ్యింది.

* * *

'సాధారణంగా మీలాంటి పేషెంట్లను పెద్ద వాళ్లు తీసుకొస్తూ ఉంటారు. మిమ్మల్ని మీ అమ్మాయి తీసుకురావడం బాగుంది. గుడ్. పిల్లలు ఇలా ఉండాలి' అంది లేడీ సైకియాట్రిస్ట్ అతనివైపూ అతని కూతురి వైపూ చూస్తూ.

'నువ్వెళ్లి బయట కూచోమ్మా' అని అతని వైపు చూసి అడిగింది– 'చెప్పండి.. ఎందుకంత డిప్రెషన్‌లోకి వెళ్లిపోయారు... బంగారంలాంటి జీవితం పెట్టుకొని'

అతడు తల వొంచుకొని జవాబు చెప్పడానికి మాటలు వెతుక్కుంటూ ఉన్నాడు.

* * *

ఇద్దరూ నచ్చాక పెద్దలు పెళ్లి చేయడం ఆనవాయితీ. అయితే నచ్చాక కూడా నచ్చని విషయాలు ఉండొచ్చు. చాలా ఏళ్లు నచ్చాక ఆ తర్వాత నచ్చని పరిస్థితులు రావచ్చు. ఇప్పుడు అతని పరిస్థితి అదే. భార్యతో పెద్ద అగాథం వచ్చేసింది. అగాథం అంటే కొట్టుకోవడం తిట్టుకోవడం కాదు. రోజూ ఒకే ఇంట్లో ఉంటున్నా కలిసి జీవిస్తూ ఉన్నా మాట్లాడుకుంటున్నా ఏదో దూరం ఉంది అని అనిపిస్తూ ఉంటుందే అలాంటిది అది. భార్య ఏ తప్పూ చేయడం లేదు. కూతురు వయసులోకి వచ్చాక ఆ అమ్మాయి అన్ని అవసరాల కోసం ఉద్యోగం మానేసి మరీ ఇంట్లో కూచుంది. కొన్నేళ్ల క్రితం వరకూ భర్త సర్వస్వంగా ఉండేవాడు. ఇప్పుడు కూతురు సర్వస్వంగా ఉంది.

'నేను ఈ లోకాన్ని నమ్మను. నా కూతురి మనసు అటూ ఇటూ వెళ్లనివ్వను. ఆ తర్వాత తీరిగ్గా బాధ పడను. దానికి ఫ్రెండ్‌గా ఉండి దాని జీవితం గట్టెక్కిస్తాను' అని అతనితో ఒకరోజు వాదనలో అంది.

'మీరు ఉద్యోగానికి వెళతారు. రేపు అది ప్రేమ గీమ అని ఎవరినో ఒకరిని తీసుకొస్తే లేనిపోని తలనొప్పి. అదొక్కటే కాదు సెక్యూరిటీ కూడా పెద్ద విషయం. అలాగని అవసరానికి ముందే పెళ్లి చేసి ఇంటి నుంచి సాగనంపాలని లేదు. దాని సంగతి నేను చూసుకుంటానుగా' అంది.

నిజమే కాని ఏదో వెలితి మొదలైనట్టు అనిపించసాగింది అతనికి.

అప్పుడే తను హెడ్‌గా పని చేస్తున్న హెచ్‌ఆర్‌లో ఒక అమ్మాయి చేరింది. మొదట సార్.. సార్ అనేది. తర్వాత చనువుగా 'ఏమిటిది సుభాష్‌జీ' అనేది. ఆ తర్వాత 'గుడ్‌మాణింగ్ సుభాష్' అని మెసేజ్ పెట్టేది. ఆమె వయసుకు తనను దించడం మొదట అతనికి థ్రిల్లింగ్ అనిపించింది. ఆ తర్వాత ఏదో ఆకర్షణగా అనిపించింది. ఆ తర్వాత మాయ కమ్మేసింది. రోజూ ఆఫీసయ్యాక ఇంటి వరకూ దింపడం ఉదయాన్నే ఇంటి మీదుగా వస్తూ ఆఫీసుకు తేవడం... జోకు లేస్తూ అప్పుడప్పుడు ఆ అమ్మాయి చేయి తట్టేది. నవ్వుతూ భుజాన్ని భుజంతో తాకించేది. మాయ ఎంతగా కమ్మేసిందంటే ఇంత వరకూ గడుపుతున్న జీవితం రస హీనమైనదని, ఇప్పుడే తన జీవితంలోకి సంతోషం వచ్చిందని అతనికి అనిపించింది. వీలైతే డివోర్స్ చేసుకొని ఈ అమ్మాయితో పెళ్లి చేసుకుందామా అని అనిపించేంత.

నాలుగు నెలలు ఇలాగే గడిచాక ఆ అమ్మాయి ఢిల్లీ ఆఫీసుకు లెటర్ పెట్టుకొని షిఫ్ట్ అయిపోయింది.

'ఈ ఉద్యోగం నాకు చాలా ముఖ్యం సార్. నా గోల్ ఢిల్లీ. అక్కడ నా బోయ్‌ఫ్రెండ్ ఉన్నాడు. తప్పులు చేసి పోగొట్టుకుంటే దెబ్బ తింటానని మీతో ఫ్రెండ్లీగా ఉన్నాను. మీరు కూడా చాలా హెల్ప్ చేశారు. థ్యాంక్యూ' అని ఒక కాడ్‌బరీ చాక్లెట్ ఇచ్చి వెళ్లిపోయింది.

ఆ తర్వాత నుంచి ఇతనికి ఈ డిప్రెషన్.

* * *

లేడీ సైకియాట్రిస్ట్ బెల్ నొక్కి కూతురుని పిలిచింది. అతను కంగారుగా ఆమెవైపు కూతురివైపు చూస్తున్నాడు ఏం చెబుతుందోనని. సైకియాట్రిస్ట్ కళ్లతోనే అభయం ఇస్తూ...

'మీ నాన్న ప్రేమలో పడాలనుకుంటున్నాడమ్మా' అంది.

కూతురు కంగారు పడింది.

'ఎవరితో డాక్టర్?'

'మీ అమ్మతోనే. మీ అమ్మను చాలా మిస్ అవుతున్నాడు. నువ్వూ మీ అమ్మా కలిసి మీ నాన్నను మిస్ కొడుతున్నారు. ఇక మీదట ఆయన రాసే లవ్ లెటర్‌కు నువ్వే పోస్ట్‌మేన్ అవ్వాలి. రోజూ లెటర్ రాసేలా చూడు. దానికి మీ అమ్మను రిప్లై ఇచ్చేలా చూడు. ఇదే నేను చెప్పే ట్రీట్‌మెంట్. '

కూతురు ఫైనలియర్ బీటెక్ చదువుతోంది. చిన్నపిల్ల కాదు.

తల్లిదండ్రులు మళ్లీ ప్రేయసీ ప్రియులుగా మారే విధంగా తల్లికి ఏం కౌన్సెలింగ్ చేయాలో మననం చేసుకుంటూ తండ్రి చేయి పట్టుకుని బయటకు నడిచింది. కారును ఒకచోట ఆపి 'అమ్మకు ఏదైనా గిఫ్ట్ తీసుకో నాన్నా.. ఇద్దువుగానీ' అంది నవ్వుతూ.

ట్రీట్‌మెంట్ మొదలైనట్టే.

– కథనం: **సాక్షి ఫ్యామిలీ**

అగాథం అంటే కొట్టుకోవడం తిట్టుకోవడం కాదు. రోజూ ఒకే ఇంట్లో ఉంటున్నా కలిసి జీవిస్తూ ఉన్నా మాట్లాడుకుంటున్నా ఏదో దూరం ఉంది అని అనిపిస్తూ ఉంటుందే అలాంటిది అది.

వార్తల్లో వనితలు

ఆమే లేకపోతే..!

నీతూ కపూర్

క్యాన్సర్ చికిత్స కోసం గత ఏడాది సెప్టెంబరులో న్యూయార్క్ వెళ్లిన బాలీవుడ్ పూర్వపు తరాల ఆరాధ్య కథానాయకుడు రిషి కపూర్ ఈ వినాయక చవితికి (సెప్టెంబరు 2) ముంబైలో ఉండేలా ప్రయాణ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 'చికిత్స జరుగుతున్నంత కాలం నా భార్య నీతూ నాకు పెద్ద ఆలంబనగా నిలిచారు. కుటుంబ బాధ్యతలన్నీ మీద వేసుకుని అందరికీ అండగా నిలబడ్డారు. ఇండియా వెళ్లాక నాకెంతో ఇష్టమైన చేపల వేపుడు, మృదువైన చపాతీలను నీతూ చేత చేయించుకుని తింటాను. గణేశ్ పూజ కోసం, నా అభిమానులను చూడ్డం కోసం నా మనసు త్వరపడుతోంది'' అని రిషి కపూర్ అమెరికాలోని ఇండియన్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

కోపం తట్టుకోలేక!

సునందా పుష్కర్

అందగాడైన కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అంతరంగపు వికృతరూపం త్వరలో ప్రత్యక్షమవబోతోందా! ఆయన భార్య సునందా పుష్కర్ హఠాన్మరణానికి సంబంధించి అతడిని వేలెత్తి చూపించే సాక్ష్యాధారాలు తమ వద్ద ఉన్నట్లు ఢిల్లీ పోలీసులు బుధవారం నాడు వాదనల సమయంలో మళ్లొకసారి కోర్టు దృష్టికి తెచ్చారు. దాంతో ఈ భార్యాభర్తల మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్న పర్యవసానమే సునంద మరణం అనే అనుమానం బలపడుతోంది. తోపులాట కారణంగా సునంద శరీరంపై మొత్తం పదిహేను చోట్ల బలమైన గాయాలు అయినట్లు పోలీసులు గతంలోనే చార్జిషీటు దాఖలు చేశారు. పాకిస్తానీ మహిళా జర్నలిస్టుకు భర్త పంపిన ప్రణయ సందేశాలను చూశాక సునంద కోపం తట్టుకోలేకపోయారని, ఆ గొడవలో శశి థరూర్‌తో జరిగిన పెనుగులాటలో ఆమె గాయపడి, మరణించారని పోలీసులు గట్టిగా విశ్వసిస్తున్నారు.

హూ ఆర్ యు?

ఇరాఖాన్

ఆమిర్ ఖాన్ కూతురు ఇరా ఖాన్ కొన్నాళ్లుగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేస్తున్న ఫొటోషూట్ సీరిస్ నిన్నటితో పూర్తయ్యాయి. 'హూ ఆర్ యు?' అనే టైటిల్‌తో ఇన్నాళ్లూ ఇరా పోస్ట్ చేస్తున్న ఫొటోలు (తనవే) బోల్డ్‌గా, బ్యూటిఫుల్‌గా, ఇన్‌స్పైరింగ్‌గా ఉండటంతో బ్యూటీ లవర్స్ అంతా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌కు అంటుకుపోయారు. ముగింపు చిత్రాలలో చీరను పోలిన వస్త్రధారణతో, నుదుటిపై బొట్టుతో ఇరా మెరుపులు కురిపించారు.

పాతికేళ్ల జీవితం

జియాఖాన్

జియాఖాన్ జీవితకథపై బ్రిటిష్ నిర్మాత ఒకరు డాక్యుమెంటరీ తీయబోతున్నారని వార్తలు వస్తున్నాయి. సహనటుడు సూరజ్ పంచోలీతో తెగిపోయిన బంధం ఆమెను మరణానికి చేరువ చేసింది. 2013లో జియా ఆత్మహత్య చేసుకున్నారు. పాతికేళ్ల వయసులో చనిపోయిన జియా జీవితంలో ఆమె బతికిన క్షణాల కన్నా, చావలేక బతికిన క్షణాలే ఎక్కువ కనుక బ్రిటిష్ నిర్మాత తీయబోయే జియా డాక్యుమెంటరీ ఆమె ఆత్మహత్య చుట్టూ తిరుగుతుందా, లేక ఆత్మహత్యను వదిలేసి తిరుగుతుందా అనేది కూడా స్పష్టం కావలసి ఉంది. న్యూయార్క్‌లో పుట్టి, లండన్‌లో పెరిగి, పాకిస్థాన్‌లో సమీప బంధువులున్న జియాఖాన్.. రామ్ గోపాల్ వర్మ తీసిన 'నిశ్శబ్ద' (2017) చిత్రంతో బాలీవుడ్‌లోకి ప్రవేశించారు. అందులో ఆమె అమితాబ్‌తో కలిసి నటించారు. తర్వాత ఘజనీ, హౌస్‌ఫుల్ చిత్రాలలో కనిపించారు.

స్త్రీ శక్తి

ఆత్మవిశ్వాసమే ఆమె ఆయుధం

భర్త అనారోగ్యం ఆమెపై మోయలేని భారాన్ని మోపింది. ఉన్నదంతా భర్త వైద్యానికే ఖర్చు చేసింది. చేతిలో చిల్లిగవ్వ లేదు. పూట గడవటం కష్టంగా మారింది. అటువంటి పరిస్థితుల్లో ఆత్మవిశ్వాసాన్ని ఆయుధంగా మలుచుకున్న ఆ ఇల్లాలు కష్టాలకు ఎదురొడ్డి నిలిచి సైకిల్ రిపేరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ ఆదర్శంగా నిలుస్తోంది. ఆమే వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండలంలోని భీంపల్లికి చెందిన చింతల శారద.

కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవించే చింతల సుభాష్ 2002లో ఒళ్లంతా తిమ్మిర్లు వస్తూ అనారోగ్యం బారిన పడ్డాడు. తమకున్న భూమి అమ్మగా వచ్చిన డబ్బుతో పాటు అక్కడిక్కడ సుమారు రూ. రెండులక్షల వరకు అప్పు చేసి భర్తకు వైద్యం చేయించింది శారద. అయినా సుభాష్‌కు వ్యాధి నయం కాకపోవడంతో ఏ పనీ చేయలేని పరిస్థితుల్లో ఇంటి వద్దే ఉంటున్నాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తి పూట గడవటం కష్టమైంది. అలాంటి పరిస్థితుల్లో కుటుంబ పోషణ భారం తనపై వేసుకుని సైకిల్ మరమ్మతులు చేయడం ప్రారంభించింది శారద. సైకిల్ పంక్చర్లు వెయ్యడం నుంచి మెల్లిగా స్కూటర్లు, ట్రాక్టర్ టైర్ల పంక్చర్లు అతకడం నేర్చుకుని ప్రస్తుతం సైకిల్ రిపేరింగ్‌తో పాటు అన్ని వాహనాల పంక్చర్లు వేస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తూ తమ ఇద్దరు పిల్లలను పెంచి పెద్ద చేసింది. తల్లి పడుతున్న కష్టాన్ని కళ్లారా చూసిన వీరి కుమారుడు రాజు పదో తరగతి తర్వాత చదువు మానేసి గొర్ల కాపరిగా జీతం ఉంటూ కుటుంబ పోషణలో తల్లికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు.

టైర్ పంక్చర్ అతుకుతున్న శారద

సొంతిల్లు అమ్ముకుని అద్దె ఇంట్లో..

సుభాష్ వైద్య ఖర్చుల కోసం మొదట తమకు ఉన్న 20 గుంటల భూమిని అమ్మేసింది శారద. వైద్య ఖర్చులకు ఆ డబ్బు చాలకపోవడంతో మరో రూ.2 లక్షల వరకు అప్పు చేసింది. సైకిల్ రిపేరింగ్‌తో వచ్చే డబ్బు కుటుంబ పోషణకే చాలడం లేదంటే సుభాష్‌కు నెలనెలా మందుల కోసం సుమారు రూ. రెండు వేల వరకు ఖర్చవుతోంది. ఈ క్రమంలోనే ఉన్న ఇల్లు కూడా అమ్మేశారు. అప్పటినుంచి అద్దె ఇంట్లోనే కాలం వెళ్లదీస్తూ... దాతల ఆసరా, ప్రభుత్వ సాయం కోసం కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు.

– గాజుల సతీష్‌కుమార్,
సాక్షి కమలాపూర్ (వరంగల్ అర్బన్ జిల్లా)

ప్రభుత్వమే ఆదుకోవాలి

నా భర్త అనారోగ్యం బారిన పడి పదిహేడేళ్లు అయితాంది. ఉన్న ఆస్తి అంతా పోయి ఇంకా రూ.3 లక్షల దాక అప్పు ఉన్నది. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. సైకిల్ రిపేరింగ్ చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొత్తాన. ఇప్పటికైనా ప్రభుత్వం సబ్సిడీ రుణం ఇప్పించి ఆదుకోవడంతో పాటు ఇళ్లు లేని మాకు డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టిచ్చి ఇయ్యాలె.

- చింతల శారద

ఏ పని చేయలేక పోతాన

నాకొచ్చిన వ్యాధి నయం కాక ఒళ్లంతా తిమ్మిర్లు వత్తానయి. ఏ పనీ చేయలేక పోతాన. నా వైద్యం కోసం, బిడ్డ పెళ్లి కోసం ఉన్నదంతా అమ్ముకున్నం. నా భార్య శారద ఇంటికి పెద్ద దిక్కుగా మారి నన్ను, నా కుటుంబాన్ని సాకుతాంది. ఆమె పడే కష్టం చూడటం తప్ప మరేమీ చేయలేక పోతాన. ప్రభుత్వమే మా కుటుంబాన్ని ఆదుకోవాలె.

- చింతల సుభాష్

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ గురువారం
22-8-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

నేను లేకపోతే బతకలేనన్నాడని మా వాళ్లని కాదనుకుని, మా అత్త కొడుకుని పెళ్లి చేసుకున్నాను. తను నాకంటే మూడు సంవత్సరాలు చిన్నవాడు. తనకి స్నేహితులు ఎక్కువ. పెళ్లి జరిగిన తర్వాత నుంచి నన్ను టార్చర్ చేస్తున్నాడు. ఇల్లు మొత్తం నడిపించేది నేనే. అతడు ఒక్క రూపాయి కూడా ఇవ్వడు. ఏం చెయ్యాలి అన్నయ్యా? నాకొక మంచి సలహా ఇవ్వండి. మీ సమాధానం కోసం ఎదురుచూస్తూ ఉంటాను.

– మీ చెల్లెలు

చిన్నోడు కదా బుద్ధి చెప్పు!

'మరి మేనరికం కదా సార్? దానికి మీరు ఫుల్‌గా అగనెస్ట్ కదా.. పుట్టే పిల్లలకు ప్రాబ్లమ్ కదా మరి! ఏంటి సార్ వేరే అడ్వైజ్ ఇస్తున్నారు?'

మనకు చెప్పి పెళ్లి చేసుకుంటే ఆపేవాళ్లం.. వాళ్ల మమ్మీడాడీలకే చెప్పకుండా జంపు కొట్టింది. ఇప్పుడు పిల్లలను కనొద్దంటే వింటుందా చెప్పు నీలూ? అయినా చెబుతా!! మేనరికం చేసుకుని.. ఒక తప్పు చేశావు. ఇప్పుడు డాక్టర్ సలహా లేకుండా పిల్లల్ని కని ఇంకో తప్పు చెయ్యకు అని.

'కానీ విషయం అది కాదు కదా సార్?? టైమంతా ఫ్రెండ్స్‌తో తగలెడుతున్నాడు. వన్ రూపీ కూడా తేవడం లేదు. మీ చెల్లెలిని వీడించుకుని తింటున్నాడు. డర్టీఫెలో అయిపోయాడు!'

అవును నీలూ! అందుకనే.. మూడు సంవత్సరాలు చిన్నవాడు కదా.. చెవి పట్టుకుని నాలుగు తగిలించి ఇంటిపట్టునే ఉండని చెబితే వర్కౌట్ అవుతుందేమో అనుకుంటున్నాను నీలూ!?

'పొండి సార్! వాడెక్కడ వింటాడు సార్? పోకిరీ ఫెలో.. రెస్పాన్స్‌బులిటీ లేని తిక్కలోడు..! అసలు వాడిని ఎలా చేసుకుంది సార్ మీ సిస్టర్???'

ఇప్పుడు వదిలెయ్యి అని చెబితే వింటుందా నీలూ??? అందుకే ప్రేమగా మార్చుకోమని చెబుతున్నాను నీలూ!

'ఏది? చెవి పట్టుకుని.. గుంజీళ్లు తీయించి.. వీపు విమానం మోత మోగించి.. గోడ కుర్చీ వేయించేనా సార్???' అని నవ్వింది నీలాంబరి.

lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

8		7	3	5	1		6	
6			7		4	8	3	
	1			6	2			
5	6	8		4				3 8
2				8		7	4	
			9	2			1	
	7 2	3	4 5	3	6 8	9		5 4

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

5	2	3	1	9	4	6	7	8
8	7	6	3	5	2	1	9	4
1	9	4	8	6	7	2	5	3
4	6	8	7	3	1	5	2	9
2	3	7	5	4	9	8	1	6
9	5	1	2	8	6	4	3	7
3	1	5	4	7	8	9	6	2
7	4	9	6	2	5	3	8	1
6	8	2	9	1	3	7	4	5

నేను దారి తప్పకుండా అన్నయ్య కాపాడారు

– పవన్ కల్యాణ్

''ఈ రోజు ప్రత్యేకించి మీలో (అభిమానులు) ఒకడిగా నేనూ ఇక్కడికి వచ్చాను. నాకు స్ఫూర్తి ప్రదాత అయిన మా అన్నయ్య చిరంజీవిగారికి మనస్ఫూర్తిగా జన్మదిన శుభాకాంక్షలు. ఇది చాలా ప్రత్యేకమైన సంవత్సరం. ఓ అభిమానిగా అన్నయ్యను ఎలాంటి సినిమాలో చూడాలని ఉవ్విళ్లూరానో అలాంటి సినిమా 'సైరా నరసింహారెడ్డి'' అన్నారు పవన్ కల్యాణ్ . నేడు చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బుధవారం జరిగిన చిరంజీవి పుట్టినరోజు వేడుకల్లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ– ''సైరా' లో నటించినవారిలో నాకిష్టమైన ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. ఒకరు అన్నయ్యగారు, మరొకరు అబితాబ్ బచ్చన్‌గారు. వీళ్లిద్దరూ నాకు జీవితంలో చాలా బలమైన స్ఫూర్తి ప్రదాతలు. అమితాబ్‌గారిని కలిసే అరుదైన అవకాశం నాకు 'సైరా' షూటింగ్‌లో కలిగింది. అన్నయ్య నాకు స్ఫూర్తి ప్రదాత అని ఎందుకు అన్నానంటే.. ఆ మధ్య తెలంగాణలో ఇంటర్మీడియట్ విద్యార్థులు పదుల సంఖ్యలో చనిపోయినప్పుడు చాలా బాధ కలిగింది. జీవితంలో నేనూ అలాంటి సందర్భంలో ఉన్నప్పుడు అన్నయ్యగారు నన్ను మూడు సార్లు దారి తప్పకుండా కాపాడారు. ఇంటర్మీడియట్ ఫెయిల్ అయినప్పుడు నాకూ నిరాశ, నిస్పృహ కలిగింది. అన్నయ్య వద్ద ఉన్న లైసెన్స్‌డ్ గన్‌తో కాల్చుకుందామనుకున్నా. ఆ డిప్రెషన్‌లో నేను ఏం చేసుకుంటానో అని మా వదిన, నాగబాబు అన్నయ్య కలిసి పెద్దన్నయ్య వద్దకు తీసుకెళ్లారు. 'ఇంటర్మీడియట్ పరీక్షలో ఫెయిలైనా మనిషిగా నువ్వు ఉండాలి. ఇలా చదువుకోకపోతే ఇంకోలా చదువుకో, అంతే కానీ డిప్రెషన్‌కి గురికావొద్దు' అంటూ అన్నయ్య ఆరోజు చెప్పిన మాటలు నాకు కొండంత ఊపిరినిచ్చాయి. మొన్న చనిపోయిన విద్యార్థుల ఇళ్లల్లో అన్నయ్య లాంటి పెద్దవారు ఉండుంటే ఆ బిడ్డలు అలా అయ్యుండేవారు కాదేమో అనిపించింది. టీనేజ్‌లో ఉన్నప్పుడు భారతదేశాన్ని ఎవరైనా ఏదైనా అంటే కోపంతో ఊగిపోయేవాణ్ణి. నా కోపాన్ని చూసిన అన్నయ్య వీడు ఉద్యమకారుడు అయిపోతాడేమో అనుకుని, 'కులం, మతం అనే వాటిని దాటి మానవత్వం అనేది ఒకటుంటుంది. దాన్ని నీ ఉద్యమంలో, ఆలోచనలో మరచిపోకు' అన్నారు. హద్దులు దాటకుండా నన్ను ఆపేసిన మాట అది. జీవితంలో అనుకున్నవి ఏవీ సాధించలేకపోయానని 22 ఏళ్లప్పుడు తిరుపతిలో నిర్మాత తిరుపతి ప్రసాద్‌గారు యోగాశ్రమం పెడితే నేను వెళ్లిపోయి ఐదారు నెలలు మా అన్నయ్యకి కనిపించకుండా ధ్యానం, యోగాసనాలు చేసుకుంటూ ఉన్నా. ఆ తర్వాత మా అన్నయ్యతో 'నాకేమీ అవసరం లేదు. నేను ఇలా వెళ్లిపోతాను' అంటే, ఆయన నన్న గొప్ప మాటలు నన్ను ఎంత మార్చేశాయంటే... 'నువ్వు భగవంతుడివై వెళ్లిపోతే ఎలా? సమాజానికి ఎందుకు ఉపయోగపడలేవ్.. ఇంట్లో బాధ్యతలు అనేవి ఉంటే ఇలా మాట్లాడవు' అన్నారు. దెబ్బలు తిన్నానో, కింద పడ్డానో, పైన పడ్డానో ఆ మాటలు ఈ రోజు నన్ను ఇక్కడిదాకా తీసుకొచ్చి మీ ముందు నిలబెట్టాయి. అందుకే నాకు ఆయన చాలా స్ఫూర్తి ప్రదాత. రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కథతో తెరకెక్కిన 'సైరా'కి నేను గొంతు ఇవ్వడం చాలా అదృష్టంగా భావిస్తున్నా. మా అన్నయ్యకి ఇలాంటి ఓ సినిమా ఉండాలని కలలు కన్నాను కానీ, ఇలాంటి గొప్ప సినిమా తీసే శక్తి, సమర్థత నాకు లేకపోయాయి. కానీ, నా తమ్ముడులాంటి రామ్‌చరణ్.. ఎవరైనా కొడుకును తండ్రి లాంచ్ చేస్తాడు. కానీ, తండ్రి తిరిగి సినిమాల్లోకి రావాలనుకుంటే 'ఖైదీ నంబర్ 150' సినిమాతో లాంచ్ చేశాడు. చరిత్ర మరచిపోయిన నరసింహారెడ్డి జీవిత కథని ఎంతో మంది ఎన్నోసార్లు దశాబ్దాలుగా, చిత్ర పరిశ్రమ మద్రాసులో ఉన్నప్పటి నుంచి ఈ మాట వింటున్నా.. ఎవరికీ ధైర్యం సరిపోలేదు.. ఒక్క రామ్‌చరణ్‌కి తప్ప. ఇలాంటి సినిమా తీస్తే ఆ పాత్ర చిరంజీవిగారే చేయాలి, ఇలాంటి సినిమాని రామ్ చరణే తీయాలి. అందుకనే సినిమాకి ఎన్ని వందల కోట్లైనా, ఆ డబ్బులు వస్తాయో రావో కానీ, మంచి బలమైన సినిమా తీయాలనుకున్నారు. 'సైరా' తో తన కలని సురేందర్‌రెడ్డిగారు నెరవేర్చుకున్నారు. మన దేశం, చరిత్ర గురించి ఎవరో రాసినదాని గురించి మనం మాట్లాడుతాం. సింహంలాటి వ్యక్తి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. చరిత్ర, భారతదేశ చరిత్ర ఆయన్ని మరచిపోయిందేమో కానీ, తెలుగు నేల, మన కర్నూలు, రేనాడు, మన కొణిదెల మాత్రం మరచిపోలేదు. అలాంటి గొప్ప నేలలో పుట్టిన వీరుడి చరిత్రను సగర్వంగా తీశారు. మనం దరికీ ఈ కథ చాలా స్ఫూర్తిదాయకం. కొణిదెల ప్రొడక్షన్ నుంచి ఇలాంటి సినిమా రావడం మాకు నిజంగా గర్వకారణం. కొణిదెల నామధేయాన్ని సార్థకత చేసుకున్నారు. ఇలాంటి గొప్ప సినిమాలో చిన్న పాత్రలో అయినా నేను నటించలేకపోయాను. కానీ, గొంతుతో 'సైరా నరసింహారెడ్డి' అనగలిగానంటే నా గుండె లోతుల్లోంచి, ఓ అభిమాని నుంచి వచ్చిన పిలుపది. అన్నా నువ్వు బద్దలుగొట్టగలవు, అన్నా నువ్వు చరిత్ర తిరగరాయగలవు. అన్నా మేము మీకు బానిసలం, దాసోహం.. అందుకే నేను అరిచానన్నా. చరిత్ర మరచిపోయిన వీరుణ్ణి వెలికి తీసిన అన్నయ్య చిరంజీవిగారికి, కథా రచయితలకు, సురేందర్ రెడ్డి, రామ్‌చరణ్‌గార్లకు, నా తల్లితర్వాత తల్లి లాంటి మా వదినగారికి(సురేఖ), నటీనటులందరికీ, ప్రత్యేకంగా అమితాబ్ బచ్చన్‌గారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అన్నారు.

''చిరంజీవిగారు చాలా కాలం జీవించాలి.. జై 'సైరా నరసింహారెడ్డి'' అన్నారు అల్లు అరవింద్.

''హ్యాపీ బర్త్ డే పెద్దమావయ్య. 'సైరా నరసింహారెడ్డి' లాంటి సినిమాలు మీరు ఇంకా ఎన్నో చేస్తూ ఉండాలి'' అన్నారు సాయిధరమ్ తేజ్. నిర్మాత వెంకటేశ్వరరావు, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, చిరంజీవి చిన్న అల్లుడు, హీరో కళ్యాణ్‌దేవ్, ఐపీఎస్ అధికారి టి. మురళీ కృష్ణ, నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాయిధరమ్ తేజ్, కల్యాణ్ దేవ్, పవన్ కల్యాణ్, అల్లు అరవింద్

రజనీకాంత్

పండగే పండగ

రజనీకాంత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దర్బార్' చిత్రీకరణ పూర్తి కావొస్తోంది. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది. దీంతో రజనీ తర్వాతి చిత్రం ఏంటీ? అనే చర్చ మొదలైంది. రజనీకాంత్ తర్వాతి సినిమాకు శివ దర్శకత్వం వహించనున్నారట. ఇంతకుముందు అజిత్‌తో 'వేదాలం, వీరమ్, వివేగమ్, విశ్వాసం' వంటి మాస్ సినిమాలు తీశారు శివ. రజనీకాంత్‌కు కూడా ఆయన ఓ మాస్ స్టోరీని చెప్పారని, వీరి కాంబినేషన్‌లో సినిమా ఆల్మోస్ట్ ఒకే అయిపోయిందని చెన్నై టాక్. వచ్చే ఏడాది దీపావళికి రిలీజ్ ప్లాన్ చేస్తున్నారనే ప్రచారం ఇప్పుడు కోడంబాక్కమ్ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ ప్రచారమే నిజమైతే.. రజనీ అభిమానులకు వచ్చే ఏడాది డబుల్ ధమాకాయే. సంక్రాంతికి ఒక సినిమా, దీపావళికి ఒక సినిమా అంటే అభిమానులకు పండగే కదా.

అల.. కొత్తింట్లో...

అల్లు అర్జున్

అల్లు అర్జున్ కొత్త ఇంటి పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇక అడుగుపెట్టడమే ఆలస్యం. ఇంతకీ ఇది సినిమా ఇల్లు అన్నమాట. త్రివిక్రమ్ హీరోగా అల్లు అర్జున్ హీరోగా 'అల.. వైకుంఠపురములో...' అనే సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసమే ఇంటి సెట్ వేస్తున్నారు. ఇందులో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్నారు. చిన్న బ్రేక్ తీసుకున్న చిత్రబృందం గురువారం నుంచి మళ్లీ షూటింగ్ స్టార్ట్ చేయాలనే ప్లాన్‌లో ఉందని సమాచారం. ఈ షెడ్యూల్ షూటింగ్ కోసమే భారీ హౌస్ సెట్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో డిజైన్ చేయించారని తెలిసింది. సినిమా టైటిల్ లోగోలో ఓ పెద్ద భవనం కనిపిస్తున్న విషయం తెలిసిందే. కీలక సన్నివేశాలన్నీ ఈ ఇంటి సెట్‌లో తీస్తారని ఊహించవచ్చు. సినిమాలో టబు, జయరామ్‌ల కొడుకుగా అల్లు అర్జున్ పాత్ర ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. సుశాంత్, నివేదా పేతురాజ్ కీలక పాత్రధారులు. ఎస్. రాధాకృష్ణ, అల్లు అరవింద్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది.

కోనేరు సత్యనారాయణ, అనుపమ , రమేష్ వర్మ

మా నమ్మకం నిజమైంది

– రమేష్ వర్మ

''రాక్షసుడు' సినిమా చాలా పెద్ద విజయాన్ని సాధించింది. ఆడపిల్లల పెంపకం విషయంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సందేశాత్మకంగా చూపించిన సినిమా ఇది'' అన్నారు నిర్మాత కోనేరు సత్యనారాయణ. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా రమేష్ వర్మ దర్శకత్వంలో కోనేరు సత్యనారాయణ నిర్మించిన చిత్రం 'రాక్షసుడు'. ఆగస్టు 2న విడుదలైన ఈ చిత్రం విజయవంతంగా మూడు వారాలు పూర్తి చేసుకుని నాలుగో వారంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ– ''పిల్లల నుంచి పెద్దల వరకు ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంది. మరో రెండు వారాల వరకూ వసూళ్లను సాధించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మా 'ఏ స్టూడియోస్ బ్యానర్'పై తొలి చిత్రంగా తెరకెక్కిన 'రాక్షసుడు' ఇంత పెద్ద విజయాన్ని సాధించడం ఆనందంగా ఉంది'' అన్నారు. ''కథపై నమ్మకంతో ఈ సినిమా చేశాం. ఈ రోజు మా నమ్మకం నిజమైంది. ఒరిజినల్ కంటెంట్‌లోని అంశాలను మిస్ చేయకుండా మనకు తగ్గట్లు చేశాం'' అన్నారు రమేష్ వర్మ. ''ఆర్టిస్టులు, టెక్నీషియన్‌ల కెరీర్‌లకు మంచి సినిమా ఎప్పుడూ ఉపయోగపడుతూనే ఉంటుంది. అలాంటి సినిమానే 'రాక్షసుడు'' అన్నారు అనుపమా పరమేశ్వరన్.

తాగుడు తెచ్చిన తంటా!

తాగి మోటార్ వెహికల్‌ను నడిపితే అది ఎంతటి దారుణ ప్రమాదానికి దారి తీస్తుందో ఊహించి చెప్పడం కష్టం. మత్తులో రెండు, మూడు, నాలుగు చక్రాల వాహనాలు నడపడమే రిస్క్ అంటే.. ఫుల్‌గా తాగి ఏకంగా ఓ రైలును నడపడానికి సిద్ధమయ్యారు పరిణీతీ చోప్రా. ఇక మద్యపానం వల్ల వృత్తిపరంగా ఉద్యోగం పొగొట్టుకుంటే, వ్యక్తిగతంగా విడాకులు తీసుకోవాల్సి వచ్చింది. ఈ సమస్యలు చాలవన్నట్టు ఓ మిస్సింగ్ కేసు ఇన్వెస్టిగేషన్ ప్రాబ్లమ్ ఆమె చుట్టూ తిరుగుతుంది. పరిణీతి నటిస్తున్న తాజా చిత్రం స్టోరీ లైన్ ఇదేనట. రిభు దాస్‌గుప్తా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మద్యపానం అలవాటు ఉన్న మహిళ పాత్రలో పరిణీతి చోప్రా నటిస్తున్నారట. అదితీ రావ్ హైదరీ, కృతీ కుల్హరీ, అవినాష్ తివారి కీలక పాత్రధారులు. 2016లో విడుదలైన ఇంగ్లీష్ చిత్రం 'ద గాళ్ ఆన్ ద ట్రెన్'కు ఇది హిందీ రీమేక్. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ లండన్‌లో జరుగుతోంది. బుధవారం ఈ సినిమాలో పరిణీతీ చోప్రా ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సినిమాను వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నారు.

పరిణీతీ చోప్రా

ఫస్ట్ లుక్...

ఓ విద్యార్థి జీవితం

హైస్కూల్ ఆఖరి రోజుల్లో ఓ విద్యార్థి జీవితం ఎలా ఉంటుంది? అనే కథతో రూపొందిన చిత్రం 'బోయ్'. లక్ష్, సాహితి జంటగా అమర్ విశ్వరాజ్ దర్శకత్వంలో ఆర్. రవిశేఖర్ రాజు, అమర్ విశ్వరాజ్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాత రాజ్ కందుకూరి బిగ్ సీడీ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''తొలి ప్రయత్నంగా ఓ కమర్షియల్ సినిమానో, ప్రేమకథో చేయవచ్చు. కానీ, 'బోయ్' లాంటి సినిమా చేయడం గొప్ప విషయం. నాలుగైదేళ్లుగా చిన్న సినిమాలే పెద్ద విజయాలు సాధిస్తున్నాయి. 'బోయ్' కూడా పెద్ద హిట్ కావాలి'' అన్నారు. ''ఈ సినిమాలో హీరో పాత్ర కోసం ఇండియా మొత్తం వెతికాను. మా కెమెరామేన్ ఆష్కర్ లక్ష్‌ని చూపించడంతో వెంటనే ఓకే చేశా. తను ఇండియాలోనే నంబర్ వన్ హీరో అవుతాడు'' అన్నారు అమర్ విశ్వరాజ్. ''ఈ సినిమాలో నటించడం ఆనందంగా ఉంది'' అన్నారు లక్ష్. ఈ చిత్రానికి సంగీతం: ఎల్విన్ జేమ్స్, జయ ప్రకాశ్.జె, సహ నిర్మాతలు: శశిధర్ కొండూరు, ప్రదీప్ మునగపాటి.

రాజ్ కందుకూరి, అమర్ విశ్వరాజ్, రవిశేఖర్, లక్ష్

విలన్‌గానూ చేస్తా

''నేను ఎమోషనల్ సీన్స్‌లో బాగా నటించగలనని నా నమ్మకం. అందుకే ఆ జానర్ సినిమాలు చేస్తూ ప్రేక్షకులను మెప్పించాలనుకుంటున్నాను. కేవలం హీరోగానే కాదు పాత్ర ప్రాధాన్యతను బట్టి విలన్‌గా నటించడానికి కూడ సిద్ధమే. నటుడిగా నాకు రజనీకాంత్‌గారు ఫేవరెట్'' అన్నారు శేఖర్ వర్మ. 'శ్రీరాముడింట శ్రీకృష్ణుడంట' ఫేమ్ శేఖర్ వర్మ హీరోగా నటించిన చిత్రం 'నివాసి'. కె.ఎన్.రావు, టీవీవీ ఎస్ఎన్ వర్మ నిర్మించిన ఈ సినిమా రేపు విడుదల కానుంది. శేఖర్ వర్మ మాట్లాడుతూ– ''అనుకోకుండా యాక్టర్ అయ్యాను. కానీ ఆ తర్వాత నటనపై ఆసక్తి పెంచుకున్నాను. 'శ్రీరాముడింట శ్రీకృష్ణుడంట'లో హీరోగా నటించిన తర్వాత బాలకృష్ణగారు హీరోగా చేసిన 'జై సింహా'లో ఓ పాత్ర చేశాను. 'నివాసి'లో మూలాలను వెతుక్కుంటూ ఇండియాకు వచ్చే హీరో పాత్ర నాది. తండ్రీకొడుకుల భావోద్వేగ సన్నివేశాలు అలరిస్తాయి. 'అంగుళిక' చిత్రంలో లీడ్ రోల్ చేశాను. ఇందులో ప్రియమణి కీలకంగా నిలిచే చిన్న పాత్ర చేశారు. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో 'యుగన్' అనే మూవీ, బాలకృష్ణగారి తాజా సినిమాలో పోలీసాఫీసర్‌గా, గాయత్రి ప్రొడక్షన్స్‌లో హీరోగా ఓ సినిమా చేయబోతున్నాను'' అన్నారు.


శేఖర్ వర్మ

పిల్లలు... ఎముక... ఎరుక!

పిల్లలు ఆటలాడుతూ ఉంటారు. కొద్దిపాటి స్థలం ఉంటే చాలు ఓ ఫోల్డింగ్ కుర్చీని వికెట్లలా పెట్టి గల్లీ క్రికెట్ ఆడటం మనం చూస్తూనే ఉంటాం. వారు తమ ఆటల్లో ఎంతగా నిమగ్నమవుతారంటే తమకు ఏదైనా హాని జరుగుతుందా లేదా అన్న అంశాన్ని కూడా చూసుకోరు. పైగా జనం, ట్రాఫిక్, కార్లు, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే సందుల్లోనూ ఇలా ఆడుతుంటారు. ఇంకా చెప్పాలంటే ఇక వారు టీనేజ్ లోకి ప్రవేశించగానే వాళ్లలో ప్రవించే కొన్ని హార్మోన్ల కారణంగా సాహసప్రవృత్తితో ఉంటారు. దాంతో టూవీలర్లు నేర్చుకోవడంతోనే తమ వాహనాలను విపరీతమైన వేగంతో నడపటం, ముందు చక్రాలు లేదా వెనక చక్రాలు ఎత్తడం వంటి ఫీట్లకూ, సాహసాలకు పాల్పడుతుంటారు. ఫలితంగా కింద పడి గాయాల పాలు కావడం, ఎముకలు విరగడం చూస్తుంటాం. పిల్లల్లో అయ్యే చాలా రకాల ప్రమాదాలు ఇలాగే ఎక్కువగా జరుగుతుంటాయి.

పిల్లల్లో ప్రమాదాలు ముప్పు చాలా ఎక్కువ... ఎందుకంటే...

పెరిగే వయసులో ముఖ్యంగా టీనేజీ పిల్లల ఎముకలు పెద్దవారితో పోలిస్తే మృదువుగానే ఉంటాయి. కానీ... అలా పెరిగే ఎముకకు అనుగుణంగా పక్కనే ఉన్న కండరాలు (మజిల్స్), మృదు కణజాలం (సాఫ్ట్ టిష్యూస్), లిగమెంట్లు, టెండన్లు పెరిగేందుకు వీలుగా అంతే అనువుగానూ ఉండవు. కాబట్టి ఎముక పెరిగే దశలో ఎముకకూ... కండరాలు, మృదుకణజాలం, లిగమెంట్లు, టెండన్ల మధ్య సమన్వయం అదే స్థాయిలో ఉండదు. అందుకే ఎముకలు పెరిగే దశలో ఉన్న పిల్లల్లో గాయాలయ్యే రిస్క్ చాలా ఎక్కువ.

పిల్లలకూ, పెద్దలకూ ఎముకల్లో తేడా ఇలా ఉంటుంది...

పిల్లల్లోని ఎముకల చివర్లో పెరుగుదలకు వీలుగా ఉండే మృదులాస్థి (కార్టిలేజ్) ఉంటుంది. వీటిని 'గ్రోత్ ప్లేట్స్' అంటారు. పెద్దవాళ్ల ఎముకల్లో పెరుగుదలకు వీలు కల్పించే ఈ కార్టిలేజ్ ఉండదు. ఈ గ్రోత్‌ప్లేట్స్‌లోని మృదులాస్థి చిగురులా మెత్తగా పెరుగుతూపోయి... పెరుగుదల ప్రక్రియ పూర్తయ్యాక... ఆ భాగం గట్టిగా మారిపోయి పెళుసుగా అయిపోతుంది. దీన్నే వైద్య పరిభాషలో చెప్పాలంటే క్యాల్సిఫికేషన్ అంటారు.

పెరిగే పిల్లల్లో ఈ గ్రోత్‌ప్లేట్ వల్లనే ఎముక పొడవుగా పెరుగుతుంటుంది. ఎముకలను కండరంతో అతికి ఉంచే టెండన్స్ ఉన్న ప్రాంతం లోనూ గ్రోత్ కార్టిలేజ్ ఉంటుంది. ఈ ప్రాంతాన్ని 'అపోఫైసిస్' అంటారు. ఎముకకూ, టెండన్ అంచుకూ మధ్య భాగంలో ఉన్న కార్టిలేజ్‌ను 'అపోఫైసీల్ కార్టిలేజ్' అంటారు. ముందుగా కార్టిలేజ్ నిడివి పెరుగుతుంది. ఆ తర్వాత దాని కింద ఉన్న ఆ పెరిగిన భాగం పెళుసుబారిన ఎముకగా మారుతుంది. ఇలా అయ్యేటప్పుడు ఎముకకూ, టెండన్‌కూ మధ్య ఉన్న కాస్త బలహీనమైన ప్రాంతంలో గాయాలయ్యేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఆటల్లో భాగంగా ఏదైనా కండరం బిగుసుకున్నప్పుడు (మజిల్ కంట్రాక్షన్ సమయంలో) ఆ కండరం చాలా ఎక్కువగా కుంచించుకుపోతుంది. కానీ అదే సమయంలో పక్కన ఎముక పెరుగుతూ ఉంటుంది. ఇలా పెరిగే ఎముక లాగే దిశకూ, ఈ కండరాల బిగుసుకునే దిశకూ ఉండే తేడా వస్తుంది. దాంతో పిల్లల్లో గాయాలయ్యే (ఫ్రాక్చర్స్ అయ్యే) ఆస్కారం ఎక్కువ. ఎముకపై ఒకే చోట ఎప్పుడూ గాయం మాటిమాటికీ అవుతుండటం వల్ల అది 'అపోఫైసైటిస్' అనే కండిషన్‌కు దారితీయవచ్చు. ఓస్గూడ్-స్లాటర్ అనే ఒక రకం మోకాళ్ల రుగ్మతకు ఇదో ఉదాహరణ. ఈ ఓస్గూడ్-స్లాటర్ కండిషన్‌లో పైనున్న కార్టిలేజ్ చాలా మృదువుగా ఉండటం, దాని కిందనే ఉన్న ఎముక మాత్రం గట్టిగా ఉండటం, ఆటల్లో కండరం లాగేయడంతో మోకాలి భాగంలో ఇన్‌ఫ్లమేషన్ వచ్చి మోకాలి వాపు వచ్చి పిల్లలను బాధిస్తూ ఉంటుంది. అయితే దాదాపు చాలా సందర్భాల్లో పిల్లలకు ఇదేమీ శాశ్వతమైన నష్టం కలగజేయదు. ఆర్థోపెడిక్ నిపుణులు తరచూ ఉపయోగించే రైస్ (అంటే రెస్ట్, ఐస్, కంప్రెషన్, ఎలివేషన్) చికిత్సతో ఉపశమనం కలుగుతుంది. అంటే కాలికి తగినంత విశ్రాంతి (రెస్ట్) ఇవ్వడం, ఐస్ కాపడం పెట్టడం, నొక్కి పట్టి ఉంచేందుకు ఎలాస్టిక్ రాప్ లేదా స్లీవ్ తొడగడం (కంప్రెషన్), పడుకున్నప్పుడు కాలిని కాస్త ఎత్తుగా దిండు మీద ఉంచడం (ఎలివేషన్)తో ఈ సమస్య తగ్గుతుంది. నొప్పి మరీ ఎక్కువగా ఉంటే డాక్టర్ల సలహా మేరకు నొప్పి నివారణ మాత్రలు తీసుకుంటే సరిపోతుంది.

ఎదిగే వయసు పిల్లల్లో ఎముకల్లో నొప్పి...

కొన్ని సందర్భాల్లో పిల్లల్లో ఎముకలు పెరుగుతున్నప్పుడు కూడా వారి ఎముకల్లో నొప్పి వస్తుంటుంది. ఎముక పెరుగుతున్నప్పుడు దానికి అనుగుణంగా కండరం, లిగమెంట్ కూడా పెరగాలి. కానీ పిల్లల్లో ఒకదశలో ఎముక పెరుగుదల చాలా వేగంగా సాగుతుంది. ఆ టైమ్‌లో పిల్లలు వేగంగా ఎత్తు పెరుగుతారు. ఒకటి రెండేళ్ల పాటు చూడని పిల్లలను అకస్మాత్తుగా చూసినప్పుడు చాలామంది పిల్లల్లో మనం దీన్ని గమనించగలుగుతాం. ఇలా ఎత్తు పెరగడాన్ని 'గ్రోత్ స్పర్ట్' అంటారు. ఈ పెరుగుదల సమయాన్నే వైద్యులు లాగ్ ఫేజ్ అని కూడా అంటారు. (ఈ లాగ్ ఫేజ్ దశలో ఎముకలు వేగంగా పెరిగి పిల్లాడు అకస్మాత్తుగా పొడవవుతాడు. ఆ తర్వాత ఈ వేగం మందగించి, చాలా నెమ్మదిగా కొద్దికాలం పాటు పెరిగి... ఆ తర్వాత పెరుగుదల ఆగిపోతుంది. అలా నెమ్మదిగా పెరిగే దశను 'ల్యాగ్' ఫేజ్ అంటారు).

పిల్లలు వేగంగా పెరిగే గ్రోత్‌స్పర్ట్ సమయంలో ఎముకకూ, కండరానికి మధ్య లోపించిన సమన్వయం వల్ల కీళ్లు బిగుతుగా అనిపించడం, కీళ్లు సులభంగా వంగకపోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఇదే సమయంలో పిల్లలు ఏదైనా పనిని అదేపనిగా చేస్తూ ఉన్నప్పుడు వారిలో కొన్ని చోట్ల కండరాలకు, ఎముకలకు అయినచోటే మాటిమాటికీ గాయాలు అవుతుండవచ్చు. ఫలితంగా కండరాలు బిగుసుకుపోయినట్లుగానూ అనిపించవచ్చు. సాధారణంగా ఆటలాడే పిల్లల్లో ఈ తరహా గాయాలు కనిపిస్తుంటాయి. కాబట్టి ఈ దశలో పిల్లలకు ఏవైనా గాయాలైనప్పుడు అదేపనిగా వ్యాయామాన్ని గాని, ఏదైనా శారీరకమైన శ్రమను (యాక్టివిటీని) గాని చేయించడం అంత సరికాదు. అలాగే ఒక్కోసారి మనం చేసే శారీరక శ్రమ (ఫిజికల్ యాక్టివిటీ) తాలూకు తీవ్రతను ఒకేసారి పెంచడం కూడా ఆర్థోపెడిక్ గాయాలకు ఆస్కారం ఇస్తుంది.

అలాగే కొన్ని సందర్భాల్లో పిల్లల వ్యాయామ తీవ్రతనూ అలాగే వారు వ్యాయామం చేసే వ్యవధినీ చాలా ఎక్కువగానూ, అనూహ్యంగానూ పెంచడం, పాదాలకు సరిగ్గా సరిపోనివీ, సరిగా అమరని పాదరక్షలు వాడటం, ఎగుడుదిగుడుగా ఉన్న ఉపరితలంపై ఆటలాడటం వల్ల దొడ్డికాళ్లు (బౌలెగ్స్) రావచ్చు, కొందరిలో మోకాళ్లు ఒకదానికి ఒకటి కొట్టుకునే నాక్ నీస్ అనే సమస్య ఉంటుంది. చిన్నతనంలో రికెట్స్ వంటి వ్యాధి వచ్చిన వారిలో ఇలా మోకాళ్లు కొట్టుకునే సమస్య వచ్చే అవకాశాలుంటాయి. ఇలాంటి పిల్లలకు క్యాల్షియమ్ లోపం ఉందేమో పరీక్షించి, ఆ లోపాన్ని భర్తీ చేయాల్సి ఉంటుంది.

ఇక మనందరిలోనూ మడమకూ, వేళ్లకూ మధ్య ఉండే భాగం అర్ధచంద్రాకారంలో పైకిలేచి నేలకు ఆనకుండా చేసే ఆర్చ్‌లా ఉంటుందన్న విషయం తెలిసిందే. కానీ కొందరిలో వంశపారంపర్యంగా ఈ ఆర్చ్ ఉండదు. అయితే ఇలా ఆర్చ్ లేకపోవడం అన్నది పిల్లల్లోనూ, వారి ఎదుగుదల లోనూ ఎంతమాత్రమూ సమస్య కాబోదు. ఇలా ఫ్లాట్‌ఫీట్ ఉన్న ఒక ఆటగాడు ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ కూడా సాధించాడు. కాకపోతే ఫ్లాట్‌ఫీట్ కారణంగా వారి మోకాళ్లపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది కాబట్టి అలాంటి వారు తమ ఆర్చ్ భాగంలో సపోర్ట్ ఉండేలాంటి పాదరక్షలు ధరిస్తే చాలు.

పిల్లల్లో వచ్చే మరికొన్ని ఎముకల సమస్యలు...

గ్రోత్‌ప్లేట్ ఫ్రాక్చర్స్: పిల్లల ఎముకలు గ్రోత్‌ప్లేట్స్‌తో ఉంటాయన్న విషయం తెలిసిందే. ఎముకతో పోలిస్తే ఈ పెరిగే భాగం బలహీనంగా ఉంటుందన్న విషయమూ చెప్పుకున్నాం కదా. దాంతో ఈ తేడాల వల్ల ఒక్కోసారి ఎముకకూ, గ్రోత్ ప్లేట్స్‌కూ మధ్యనుండే భాగం ఫ్రాక్చర్స్ అయి జాయింట్ డిస్‌ప్లేస్‌మెంట్‌కూ, చాలా ముందుగానే వచ్చే ఆర్థ్రరైటిస్ వంటి సమస్యకూ దారి తీయవచ్చు. చాలా అరుదుగా ఒక్కోసారి కొంత మంది పిల్లల్లో పెరుగుదల ఆగిపోవచ్చు. వైద్య పరిభాషలో ఇలా పెరుగుదల ఆగిపోవడాన్ని 'స్టంటెడ్ గ్రోత్' అని చెబుతారు. ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు లేదా శిక్షకులు పిల్లాడిలోని సమస్యను సరైన సమయంలో గుర్తించాలి. దానికి ఇవ్వాల్సిన చికిత్స కూడా చాలా శ్రద్ధగా చేయించాల్సి ఉంటుంది.

ఆస్టియోకాండ్రోసిస్: ఇది ఎముక చివరన పెరిగే కార్టిలేజ్‌లో చాలా సాధారణంగా కనిపించే సమస్య. ఎముక చివరన జరిగే రక్తసరఫరాలో తేడాల వల్ల ఈ సమస్య వస్తుంది. తుంటి ఎముక కీలు వద్ద కనిపించే 'పార్థెస్ డిసీజ్' అన్నది ఈ తరహా సమస్యకు ఒక మంచి ఉదాహరణ. దీనివల్ల తుంటి ఎముక కీలు శాశ్వతంగా దెబ్బతినవచ్చు. సాధారణంగా సమస్య తుంటికే వచ్చినా... పిల్లలు మాత్రం మోకాలు నొప్పి అని చెబుతుంటారు. ఇలా ఒకచోట ఉన్న నొప్పి మరో చోట బయటకు కనిపించడాన్ని వైద్యపరిభాషలో 'రిఫర్డ్ పెయిన్' అంటారు. కాబట్టి పిల్లలు మోకాళ్లలో నొప్పి అంటే తుంటి ఎముకను జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. పిల్లల వయసును బట్టి కూడా సమస్యలతో పాదాల సమస్యలు (కొహ్లర్స్ డిసీజ్), పాదాల వేళ్ల సమస్యలు (ఫ్రీబెర్గ్స్ డిసీజ్), మడమ సమస్యలు (సెవెర్స్ డిసీజ్) వంటివి కూడా కనిపించవచ్చు.

ఒక పనిని అదేపనిగా పదేపదే చేస్తే వచ్చే సమస్యల్లో ముఖ్యమైనది ఆస్గుడ్ ష్లాటర్స్ డిసీజ్ అని చెప్పుకున్నాం కదా. ఇది కూడా చాలావరకు ఆస్టియోకాండ్రోసిస్‌లాగే ఉంటుంది. కానీ ఇందులో టెండెనైటిస్, అపోఫైసైటిస్ వంటివి ఎక్కువగా కనిపిస్తాయి. ఇది మోకాలి చిప్ప వద్ద ఉండే టెండన్‌ను ఎక్కువగా దెబ్బతీస్తుంది. మోకాలి చిన్న కింద చిన్న బుడిపె వంటిది కనిపించవచ్చు. దీన్ని టిబియల్ ట్యుబర్కిల్ అంటారు. తొడకు సంబంధించిన అతిపెద్ద కండరం అయిన క్వాడ్రసెప్ కండరపు చివరి భాగం... మోకాలి చిప్ప టెండన్ ద్వారా మోకాలి కిందనున్న ట్యుబర్కిల్‌కు అంటుకుని ఉంటుంది. మనం తరచూ అదేపనిగా ఏదైనా వ్యాయామమో, శారీరక శ్రమో చేస్తున్నప్పుడు ఆ ట్యుబర్కిల్ వద్ద ఉన్న కండరం ఊడినట్లుగా అవుతుంది. అలాంటప్పుడు ఒక్కోసారి ఆ పరిసరాల్లో ఎముక వద్ద, కండరాల వద్ద కాస్తంత పెద్ద గాయం కావచ్చు. అలాంటప్పుడు పిల్లలు తమ మోకాలిచిప్ప కింది భాగంలో నొప్పిగా ఉందంటూ బాధపడుతుంటారు. అక్కడ కొంత వాపు కూడా కనిపించవచ్చు. చూడటానికి కాస్తంత ప్రమాదకరంగా అనిపించినా... నిజానికి ఇది అంత పెద్ద హానికరం కాని సమస్య. కాస్త విశ్రాంతి తీసుకోవడం, కాలికి శ్రమ ఇవ్వకపోవడం వల్ల ఇది తగ్గిపోతుంది. కొందరిలో శస్త్రచికిత్స చేయాల్సిన పరిస్థితి రావచ్చు. కానీ అది చాలా చాలా అరుదు.

పిల్లల్లో పుట్టుకతో వచ్చే కంజెనిటల్ సమస్యలు..

కొన్నిసార్లు పిల్లలు పుట్టుకతోనే వెన్నులో కాస్త లోపంతో పుట్టవచ్చు. ఇలాంటి సమస్యను 'స్పాండిలోలైసిస్' అంటారు. దీనివల్ల కూడా వెన్నునొప్పి రావచ్చు. ఒక్కోసారి పైన ఉన్న వెన్నుపూస తన కింద ఉన్నదానిపైనుంచి జారిపోయి... ముందుకు వెళ్లిపోవచ్చు. అలాంటప్పుడు కూడా పిల్లల్లో వెన్నునొప్పి వస్తుంది. ఈ పరిస్థితిని స్పాండిలోలైస్థెసిస్ అంటారు. పిల్లలు లేదా యుక్తవయస్కుల్లో వెన్నునొప్పితో పాటు జ్వరం, మల, మూత్రవిసర్జనలకు సంబంధించిన సమస్యలు ఉంటే మరిన్ని వైద్యపరీక్షలు అవసరమవుతాయి. అలాంటి సమయాల్లో వారిని మరింత నిశితంగా పరీక్షించాల్సి ఉంటుంది. ఇక కొందరిలో వెన్ను వంకరగా ఉండే స్కోలియోసిస్ అనే సమస్య కూడా వస్తుంది. దీనికి శస్త్ర చికిత్స అవసరం అవుతుంది.

ఈ తరహా నడుమునొప్పి ప్రమాదకరం కాదు...

అయితే చాలా మంది పిల్లల్లో నిద్రలో నడుం పట్టేసి మర్నాడు వారికి నడుమునొప్పి రావచ్చు.

ఇలా వచ్చే నడుము నొప్పి గురించి ఆందోళన పడాల్సిన అవసరం ఉండదు. నిద్రలో నడుం పట్టేసి వచ్చే నొప్పికి విశ్రాంతి తీసుకుంటే చాలు. ఒకవేళ నొప్పి తీవ్రంగా ఉంటే ఉపశమనం కోసం, డాక్టర్ సలహా మేరకు ఒకటి రెండు రోజులు మాత్రమే పెయిన్ కిల్లర్స్ వేసుకోవడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది.

ఈ తరహా నడుమునొప్పి విషయంలో జాగ్రత్త...

కొన్ని సందర్భాల్లో లోపల ఏదైనా ఇన్ఫెక్షన్ ఉండటం లేదా గడ్డ (ట్యూమర్) వల్ల కూడా నడుం నొప్పిరావచ్చు. ఈ తరహా నడుమునొప్పి నిద్రలో పట్టేసినప్పుడు వచ్చే నొప్పిలా ఒకపట్టాన తగ్గదు. ఇలా నొప్పి తగ్గకుండా అదేపనిగా వస్తున్న సందర్భాల్లో తప్పక వైద్య పరీక్షల కోసం ఆర్థోపెడిక్ నిపుణుడిని సంప్రదించాలి. అలాంటప్పుడు వైద్యపరీక్షల్లో తేలే అంశాన్ని బట్టి చికిత్స ఆధారపడి ఉంటుంది.

పిల్లల్లో వచ్చే చాలా రకాల ఎముకలకు సంబంధించిన నొప్పులు చాలావరకు తాత్కాలికం. వారి ఎదుగుదలకూ, పెరుగుదలకూ చాలావరకు ప్రతిబంధకం కాదు. చిన్నపాటి విశ్రాంతి, ఐస్ కాపడం వంటి జాగ్రత్తలతోనే అది తగ్గిపోతుంది. అయితే నొప్పి ఎంతకూ తగ్గనప్పుడు మాత్రం అదేపనిగా కాపడం పెట్టడం, నొప్పి ఉన్నచోట మర్దన చేస్తూనే ఉండటం సరికాదు. ఎందుకంటే కొన్ని సందర్భాల్లో వారిలో ఏదైనా తీవ్రమైన సమస్య (లుకేమియా అంటే బ్లడ్‌క్యాన్సర్) ఉన్నదానికి కూడా ఎముకల్లో నొప్పి ఒక లక్షణం కావచ్చు. అందుకే పిల్లల్లో నొప్పి వచ్చినప్పుడు ఒకసారి డాక్టర్‌కు చూపించి, అది ప్రమాదకరం కాని సాధారణమైన నొప్పేనని నిర్ధారణ చేసుకొని, ఆపైన నిశ్చింతగా ఉండవచ్చు.

డాక్టర్ కె. సుధీర్‌రెడ్డి,
చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్,
ల్యాండ్‌మార్క్ హాస్పిటల్స్,
హైదరాబాద్

ఆటల్లో గాయాలతోనూ ప్రమాదాలు...

తరచూ ఆటల్లో ఎక్కువగా పాల్గొనే పిల్లల్లో పెద్దవాళ్లలాగే గాయాల కావచ్చు. కొన్ని సార్లు బెణుకులు (స్ప్రెయిన్), ఎముకలు విరగడం (ఫ్రాక్చర్లు) వంటి ప్రమాదాలు కూడా జరగవచ్చు. ప్రమాదాలు ఎప్పుడు ఎలా జరుగుతాయో తెలియదు. కాబట్టి వాటిని మనం ఎలాగూ నివారించలేం. కాకపోతే పిల్లలు పదేపదే ఆటలాడుతూ ఉండటం వల్ల వారిలో చోటు చేసుకునే భౌతిక కార్యకలాపాల (ఓవర్ యూజ్ ఆక్టివిటీ)ని తగ్గించడం ద్వారా వాటి వల్ల అయ్యే గాయాలను కొంతవరకు నివారించవచ్చు. అందుకే పిల్లలు ఆటలు లేదా వ్యాయామం లేదా స్ట్రెచ్చింగ్ ఎక్సర్‌సైజ్ చేసే సమయంలో ముందుగా చేయాల్సిన వార్మ్-అప్ వ్యాయామాలు, అటు తర్వాత చివగా చేయాల్సిన కూలింగ్ డౌన్ వ్యామామాలు తప్పనిసరిగా చేసేలా చూడాలి. వారి శిక్షణ కార్యక్రమాలను ఆ విధంగా రూపొందించాలి. చిన్నారి అథ్లెట్లలో ఎముకలు అకస్మాత్తుగా పెరిగే గ్రోత్ స్పర్ట్ (లాగ్) దశలో కండరాలకు ఫ్లెక్సిబిలిటీ కలిగించేలా తరచూ మసాజ్ చేయడం వంటివి అవసరం. అలాంటి పిల్లలకు ఏవైనా గాయాలైనప్పుడు అవి పూర్తిగా మానేవరకు, ఆ వ్యాయామాన్ని పూర్తిగా ఆపేసి, వారికి తగినంత విశ్రాంతి ఇవ్వడం వంటి జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం.

పిల్లల్లో వెన్ను నొప్పి...

ప్రకృతి నియమం ప్రకారం చిన్నపిల్లల్లో వెన్ను నొప్పి రాదు. రానే కూడదు. ఒకవేళ పిల్లల్లో వెన్ను నొప్పి వస్తున్నా లేదా తరచూ కనిపిస్తూ లేదా దాని తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నా... ఆ పరిస్థితిని తేలిగ్గా తీసుకోకూడదు. పిల్లలు లేదా టీనేజీలో ఉన్న వారు లేదా అప్పుడే టీనేజీ దాటిన యుక్తవయస్కుల్లోని వారికి వెన్ను నొప్పి వచ్చిందంటే అది వెన్నుపై తీవ్రమైన ఒత్తిడి వల్ల కావచ్చని భావించాలి. ఒక్కోసారి వాళ్లు నిల్చునే లేదా కూర్చునే భంగిమలు సరిగా లేక పోవడం వల్ల కూడా ఇది ఇస్తుంది. సాధారణంగా పూర్తి విశ్రాంతితో ఇలాంటి సమస్యలు చక్కబడతాయి. అయితే గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే ఒకటి లేదా అంతకు మంచి వెన్నుపూసల్లో ఏదైనా/ఏవైనా ఫ్రాక్చర్ ఉందేమో చూడాలి.

హోమియో కౌన్సెలింగ్స్

అజీర్ణం... కడుపు ఉబ్బరం... నయమవుతాయా?

నా వయసు 52 ఏళ్లు. నాకు కొంతకాలంగా కడుపులో విపరీతమైన మంటతోనూ, నొప్పి, అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలతో బాధపడతున్నాను. డాక్టర్‌ను సంప్రదిస్తే గ్యాస్ట్రైటిస్ అన్నారు. ఈ సమస్య ఎందుకు వస్తుంది. హోమియో చికిత్స ద్వారా నయమవుతుందా?

– ఆర్. యాదగిరిరెడ్డి, నల్లగొండ

జీర్ణకోశం లోపల ఉండే మ్యూకస్ పొర ఇన్‌ఫ్లమేషన్ లేదా వాపునకు గురికావడాన్ని గ్యాస్ట్రైటిస్ అంటారు. మనం తీవ్రమైన ఒత్తిడికి గురైనప్పుడు మన మెదడు లాగే జీర్ణ వ్యవస్థ మీద కూడా ప్రభావం పడుతుంది. గ్యాస్ట్రిక్ సమస్యలు ఆకస్మికంగా మొదలై కొన్ని రోజుల వరకు ఉండి తగ్గిపోతే అక్యూట్ గ్యాస్ట్రైటిస్ అంటారు. దీర్ఘకాలికంగా ఇదే సమస్య ఉంటే దాన్ని క్రానిక్ గ్యాస్ట్రైటిస్ అంటారు. కొందరిలో గ్యాస్ట్రిక్ సమస్య ముదిరితే అవి కడుపులో అల్సర్స్ లేదా పుండ్లుగా ఏర్పడతాయి.

కారణాలు

– 20 నుంచి 50 శాతం అక్యూట్ గ్యాస్ట్రైటిస్‌లకు వైరస్, బ్యాక్టీరియా (ముఖ్యంగా హెలికోబ్యాక్టర్ పైలోరీ అనే బ్యాక్టీరియా) కారణమవుతుంది. ● తీవ్రమైన మానసిక ఒత్తిడి, మద్యం ఎక్కువగా తీసుకోవడం, సమయానికి ఆహారం తీసుకోకపోవడం ● కొన్ని రకాల మందులు... ముఖ్యంగా పెయిన్ కిల్లర్స్ వాడటం ● పైత్య రసం వెనక్కి ప్రవహించడం ● క్రాన్స్ డిసీజ్, కొన్ని ఆటో ఇమ్యూన్ వ్యాధులు ● శస్త్రచికిత్స లేదా వంశపారంపర్య చరిత్ర ఉన్నవారిలో ● ఆహారంలో వేపుళ్లు, మసాలాలు, కారం, పులుపు వంటివి ఎక్కువగా తీసుకునే వారిలో గ్యాస్ట్రైటిస్ సమస్య కనిపిస్తుంది.

లక్షణాలు

కడుపు నొప్పి, మంట ● కడుపు ఉబ్బరం, కొంచెం తిన్నా కడుపు నిండుగా అనిపించడం ● అజీర్ణం, వికారం, రక్తంతో కూడిన వాంతులు ● ఆకలి తగ్గిపోవడం ● కొందరిలో గ్యాస్ట్రిక్ సమస్య వల్ల మలం రంగు మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నివారణ కోసం పాటించాల్సిన జాగ్రత్తలు

● సమయానికి ఆహారం తీసుకోవాలి ● కొద్దికొద్ది మోతాదుల్లో ఎక్కువ సార్లు తినాలి ● పొగతాగడం, మద్యపానం వంటి దురలవాట్లు పూర్తిగా మానేయాలి ● ఆహారంలో మసాలాలు, కారం, వేపుళ్లు తగ్గించాలి తిన్న వెంటనే పడుకోకూడదు. కనీసం రెండు గంటల తర్వాత నిద్రించాలి.

చికిత్స

హోమియో వైద్యవిధానం ద్వారా గ్యాస్ట్రిక్ సమస్యలకు చక్కటి పరిష్కారం లభిస్తుంది. ఈ సమస్యలకు మూలకారణమైన ఆమ్లాలు, తీవ్ర రసాయనాల సమతౌల్యతను చక్కదిద్దడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించవచ్చు.

డా॥ శ్రీకాంత్ మొర్లావర్,
సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్,
హైదరాబాద్

ఏడీహెచ్‌డీ అంటే ఏమిటి? చికిత్స ఉందా?

మా బాబు వయసు ఆరున్నరేళ్లు. ఎప్పుడూ ఉన్న చోట కుదురుగా ఉండడు. ఒంటరిగా ఉండటానికే ఎక్కువగా ఇష్టపడతాడు. ఏకాగ్రత తక్కువ. దాదాపు ప్రతిరోజూ స్కూల్ నుంచి ఎవరో ఒక టీచర్ మావాడి ప్రవర్తన గురించి ఏదో ఒక కంప్లయింట్ చేస్తుంటారు. డాక్టర్‌కు చూపిస్తే ఒకరు ఏడీహెచ్‌డీ అన్నారు. హోమియోలో మా వాడి సమస్యకు ఏదైనా చికిత్స ఉందా?

– ఆర్. సుందరయ్య, తాడేపల్లిగూడెం

ఏడీహెచ్‌డీ అనేది అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివ్ డిజార్డర్ అనే వ్యాధి పేరుకు సంక్షిప్త రూపం. మీరు చెప్పిన లక్షణాలను బట్టి చూస్తే కూడా మీ బాబుకు అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌యాక్టివ్ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) అనే సమస్యే ఉందని అనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 5 శాతం మంది పిల్లలు ఈ సమస్యతో బారిన పడుతుంటారు. కొంతమంది పిల్లల్లో వారు పెరుగుతున్న కొద్దీ సమస్య తగ్గుతుంది. ఏడీహెచ్‌డీ అనేది సాధారణంగా ఆరు నుంచి పన్నెండు సంవత్సరాల పిల్లల్లో వస్తుంది. ఏడీహెచ్‌డీతో బాధపడే పిల్లలు సాధారణ పిల్లల్లా ఉండరు. ఈ సమస్య ఉన్న పిల్లలకు సాధారణంగా ఏమీ గుర్తుండదు.

సమస్యకు కారణాలు

● జన్యుపరమైన కారణాలు ● తల్లిదండ్రులు ఎవరిలో ఒకరికి ఈ సమస్య ఉండటం ● తక్కువ బరువుతో ఉండే పిల్లల్లోనూ, సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల సమస్య రావచ్చు.

లక్షణాలు

● మతిమరపు, తలనొప్పి ● ఆందోళన, వికారం, నిద్ర లేమి, చిరాకు ● మానసిక స్థితి చక్కగా లేకపోవడం ● ఒక చోట స్థితిమితంగా ఉండలేక పోవడం. ● ఇతరులను ఇబ్బంది పెట్టడం.

నిర్ధారణ

రక్తపరీక్షలు, సీటీ స్కాన్, ఎమ్మారై

చికిత్స

హోమియోలో ఏడీహెచ్‌డీ సమస్యకు మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి వ్యక్తమయ్యే తీరు, లక్షణాలను విశ్లేషించి మందులు ఇవ్వాలి. ఈ మందుల వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు. ఈ సమస్యకు హోమియోలో స్ట్రామోనియమ్, చైనా, అకోనైట్, బెల్లడోనా, మెడోరినమ్ వంటి మందులు అందుబాటులో ఉన్నాయి. వీటిని డాక్టర్ల పర్యవేక్షణలో వాడాలి.

డాక్టర్ కె. శ్రీనివాస్ గుప్తా,
ఎండీ (హోమియో),
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

ఇన్‌ఫెర్టిలిటీ అంటే ఏమిటి?

నా వయసు 34 ఏళ్లు. వివాహమై పదేళ్లు అయ్యింది. ఇంతవరకు సంతానం లేదు. డాక్టర్‌ను సంప్రదిస్తే కొన్ని వైద్య పరీక్షలు చేసి ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ అని చెప్పారు. ఇన్‌ఫెర్టిలిటీ అంటే ఏమిటి? దానికి కారణాలు ఏమిటి? హోమియోలో నా సమస్యకు శాశ్వత పరిష్కారం ఉందా?

– ఒక సోదరి, మంచిర్యాల

ఇటీవల చాలా మందిలో సంతానలేమి సమస్య కనిపిస్తోంది. దీనికి అనేక అంశాలు కారణమవుతాయి. సమస్య మహిళల్లో లేదా పురుషుల్లో ఉండవచ్చు.

స్త్రీలలో సాధారణంగా కనిపించే కారణాలు : ● జన్యు సంబంధిత లోపాలు ● థైరాయిడ్ సమస్యలు ● అండాశయంలో లోపాలు; నీటిబుడగలు ● గర్భాశయంలో సమస్యలు ● ఫెలోపియన్ ట్యూబ్స్‌లో వచ్చే సమస్యలు ● డయాబెటిస్ ● గర్భనిరోధక మాత్రలు అధికంగా వాడటం.

పురుషుల్లో సాధారణంగా కనిపించే కారణాలు: ● హార్మోన్ సంబంధిత సమస్యలు ● థైరాయిడ్ ● పొగతాగడం ● శుక్రకణాల సంఖ్య తగ్గిపోవడం

సంతానలేమిలో రకాలు : ● ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ ● సెకండరీ ఇన్‌ఫెర్టిలిటీ

ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ: అసలు సంతానం కలగకపోవడాన్ని ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ అంటారు. ఇది ముఖ్యంగా జన్యుసంబంధిత లోపాలు, హార్మోన్ సంబంధిత లోపాల వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది.

సెకండరీ ఇన్‌ఫెర్టిలిటీ: మొదటి సంతానం కలిగిన తర్వా

సాక్షి భవిత

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

స్పర్ధయా వర్ధతే విద్య

గురువారం
22-8-2019

ఉన్నత విద్యపరంగా విభిన్నమైనది..బీఫార్మసీ. సర్టిఫికెట్ చేతికందుతూనే ఉద్యోగంలో చేరే అవకాశం బీఫార్మసీ ద్వారానే లభిస్తుంది. అలాగే బీఫార్మసీతో మరో ప్రత్యేకత.. సొంత కాళ్ల మీద నిలబడే వెసులుబాటు ఉండటం! ఆరోగ్య రంగం దూసుకుపోతున్న తరుణంలో.. ఫార్మసీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు అవకాశాలకు కొదవలేదు. తాజాగా తెలుగు రాష్ట్రాల్లోని ఫార్మసీ కోర్సుల్లో చేరుతున్న విద్యార్థుల కోసం ఫార్మా కెరీర్‌పై ప్రత్యేక కథనం...

కెరీర్ ప్రిస్క్రిప్షన్.. ఫార్మసీ

- డి.ఫార్మసీ టు పీహెచ్‌డీ వరకూ వివిధ స్థాయిల్లో కోర్సులు
- నైపుణ్యాలుంటే అవకాశాలకు కొదవలేదంటున్న నిపుణులు

డిప్లొమా టు పీహెచ్‌డీ

బీఫార్మసీ

✦ బీఫార్మసీ కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, డీఫార్మసీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులో చేరొచ్చు. తెలుగు రాష్ట్రాల్లో ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేస్తున్నారు. బీఫార్మసీ మూడో సంవత్సరం నుంచి ఫైనల్ ఇయర్ మధ్యకాలానికి 250 గంటల పాటు ఔషధాలు తయారుచేసే పరిశ్రమల్లో శిక్షణ పొందాలి. బీఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులు రాష్ట్ర ఫార్మసీ కౌన్సెల్‌లో పేరు నమోదు చేసుకొని..'రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్' సర్టిఫికెట్ తీసుకొని ఫార్మసీ ప్రాక్టీస్ చేసుకోవచ్చు.

✦ బీఫార్మసీలో.. ఫార్మకాలజీ, ఫార్మసీ ప్రాక్టీస్, క్లినికల్ ఫార్మసీ, కమ్యూనిటీ ఫార్మసీ, హ్యూమన్ అనాటమీ, ఫిజియాలజీ, పాథో ఫిజియాలజీ, ఫార్మస్యూటికల్స్, కెమిస్ట్రీ, ఫార్మకాగ్నసీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ ఫార్మసీ, ఫార్మ ఇంజనీరింగ్ లాంటి క్లినికల్, ఇండస్ట్రీకి సంబంధించిన సబ్జెక్టులను విద్యార్థులు చదువుతారు.

✦ బీఫార్మసీ విద్యార్థులకు ప్రధానంగా లభించే ఉద్యోగాలు.. హాస్పిటల్ ఫార్మసిస్టు, కమ్యూనిటీ ఫార్మసిస్టు, క్లినికల్ ఫార్మసిస్టు; ఫార్మసీ ప్రాక్టీషనర్, ఫార్మకో విజిలెన్స్,ఏడీఆర్ మానిటరింగ్, పేషెంట్ కౌన్సెలింగ్, పేషెంట్ థెరప్యూచర్. అలానే ఫార్మస్యూటికల్, బయోటెక్ కంపెనీల్లో రీసెర్చ్ సైంటిస్టు, రీసెర్చ్ అసోసియేట్, ప్రీ క్లినికల్ రీసెర్చ్‌లో.. స్టడీ డైరెక్టర్, క్యూసీ మేనేజర్, క్యూసీ ఆడిటర్, క్యూసీ అసోసియేట్ కొలువులు; ఫార్మ ఇండస్ట్రీలో... ఫార్ములేషన్స్ ఆర్ అండ్ డీ, అనలిటికల్ ఆర్ అండ్ డీ, క్వాలిటీ కంట్రోల్స్, క్వాలిటీ అస్యూరెన్స్ విభాగాల్లో అవకాశాలు ఉంటాయి. ప్రభుత్వ రంగంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, జూనియర్ అనలిస్ట్ వంటి అవకాశాలు, రెగ్యులేటరీ అఫైర్స్‌లో ఉద్యోగాలు లభిస్తాయి.

మాస్టర్ ఆఫ్ ఫార్మసీ (ఎం ఫార్మసీ)

బీఫార్మసీ తర్వాత అందుబాటులో ఉన్న ఉన్నత విద్యావకాశం.. ఎంఫార్మసీ. ఫార్మాస్యూటిక్స్, ఫార్మకాలజీ, ఫార్మా కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్, ఇండస్ట్రియల్ ఫార్మసీ, ఫార్మసీ ప్రాక్టీస్, క్వాలిటీ అస్యూరెన్స్ తదితర స్పెషలైజేషన్లు ఎంచుకోవచ్చు. గ్రాడ్యుయేట్ ఫార్మసీ అప్టిట్యూడ్ టెస్ట్(జీప్యాట్) స్కోర్ ఆధారంగా ఎం ఫార్మసీలో ప్రవేశం పొందవచ్చు. సెంట్రల్ యూనివర్సిటీలు మొదలు దేశంలో వందల సంఖ్యలో కాలేజీల్లో ప్రవేశాలను ఖరారు చేసుకోవచ్చు. జీప్యాట్ స్కోర్‌తో అభ్యర్థులు తాము చేరాలనుకుంటున్న యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్‌కు స్వయంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయిలోని కాలేజీల్లో ప్రవేశాల కోసం పీజీఈసెట్ రాయాలి.

✦ నైపర్ పరీక్ష ద్వారా దేశంలో పేరొందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్) విద్యాసంస్థల్లో ప్రవేశం పొందవచ్చు.

✦ అంతర్జాతీయ అర్హత పరీక్షల ద్వారా విదేశాల్లో ఎంఎస్(ఫార్మస్యూటికల్ సైన్సెస్)తో పాటు ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీలో చేరే అవకాశముంది.

✦ క్లినికల్ విభాగంపై శ్రద్ధ, ఆసక్తి ఉంటే.. బీఫార్మసీ తర్వాత మూడేళ్ల ఫార్మ-డి(పోస్ట్ బ్యాచులరేట్) లో చేరవచ్చు. ఫార్మ్-డి(పోస్ట్ బ్యాచులరేట్)ను లేటరల్ ఎంట్రీగా పరిగణిస్తారు. బీఫార్మసీ తర్వాత ఫార్మ్-డిలో నేరుగా నాలుగో సంవత్సరంలో ప్రవేశం పొందొచ్చు. ఇందులో రెండేళ్లు క్లాస్ రూం టీచింగ్.. చివరి ఏడాది ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఫార్మసీ కాలేజీల్లో 10 సీట్ల చొప్పున ఫార్మ్-డికి కేటాయిస్తారు.

ఫార్మ్-డి

✦ ఫార్మ్-డి కోర్సులో ప్రవేశానికి అర్హత.. ఇంటర్మీడియట్(ఎంపీసీ, బైపీసీ). ఫార్మ్ డి కోర్సు దాదాపు ఎంఫార్మసీతో సమానమైనదని చెప్పొచ్చు. కోర్సు వ్యవధి ఆరేళ్లు. ఈ కోర్సులో విద్యార్థులు అనాటమీ, ఫిజియాలజీ, పాథో ఫిజియాలజీ, ఫార్మకో థెరప్యూటిక్స్ వంటి సబ్జెక్టులు చదువుతారు. థియరీతోపాటు ప్రాక్టికల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వడం ఫార్మ్ డి కోర్సు ప్రత్యేకత. ఇందులో అయిదేళ్లు తరగతి బోధన, ప్రాక్టికల్స్ సమ్మిళితంగా ఉంటుంది. చివరి ఏడాది పూర్తిగా ఇంటర్న్‌షిప్. ఈ కోర్సులో చేరిన విద్యార్థులు రెండో సంవత్సరం నుంచే ఆసుపత్రులను సందర్శిస్తారు. రోగుల సమస్యలను అవగాహన చేసుకుంటారు. తర్వాత ఆరో సంవత్సరంలో ఫార్మ డాక్టర్స్‌గా ఇంటర్న్‌షిప్ చేస్తారు. ఫార్మ్-డీ కోర్సు ఉత్తీర్ణులైన తర్వాత రాష్ట్ర ఫార్మసీ కౌన్సెల్‌కు సంబంధించిన రిజిస్టర్‌లో పేరు నమోదు చేసుకోవాలి.

✦ ఫార్మ్-డి కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు క్లినికల్ ఫార్మసిస్టు, కమ్యూనిటీ ఫార్మసిస్టు, హాస్పిటల్ ఫార్మసిస్టుగా అవకాశాలు లభిస్తాయి. క్లినికల్ రీసెర్చ్ ఆర్గనైజేషనల్‌లో ఏడీఆర్ మానిటరింగ్, డ్రగ్ ఇంటరాక్షన్ మానిటరింగ్, టాక్సికాలజీ, థెరప్యూటిక్స్, బీఏబీఈ స్టడీస్, పేషెంట్ మానిటరింగ్, క్లినికల్ ప్రోటోకాల్ డెవలప్‌మెంట్, పేషెంట్ కేస్ స్టడీ, పేషెంట్ కౌన్సెలింగ్, క్లినికల్ ట్రయల్స్, డేటా మేనేజ్‌మెంట్ వంటి అవకాశాలు ఉంటాయి.

✦ విదేశాలలో వీరికి మంచి అవకాశాలు ఉన్నాయి. ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు.. పరిశోధనలపై దృష్టిసారించాలనుకుంటే పీహెచ్‌డీ చేయడానికి అవకాశం ఉంది.

డీఫార్మసీ

✦ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ 50 శాతం మార్కులతో పూర్తి చేసిన విద్యార్థులు డీ ఫార్మసీ (డిప్లొమా ఇన్ ఫార్మసీ)లో చేరడానికి అర్హులు. ఫార్మసీ కళాశాలలో 50 శాతం సీట్లు మొదట ఎంపీసీ చదివిన విద్యార్థులకు, మిగతా 50 శాతం సీట్లు బైపీసీ విద్యార్థులకు కేటాయిస్తారు. ఇంటర్‌లో పొందిన మార్కుల ఆధారంగా డీ ఫార్మసీ అడ్మిషన్లు చేపట్టడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రత్యేకంగా నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. డీఫార్మసీ కోర్సు కాలవ్యవధి రెండేళ్లు.

✦ ఈ కోర్సు పూర్తయిన తర్వాత 500 గంటలు ప్రభుత్వ ఆసుపత్రిలో డిస్పెన్సరీలలో శిక్షణ తీసుకోవాలి. ఆ తర్వాత రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌లోని రిజిస్టర్‌లో పేరు నమోదు చేసుకొని 'రిజిష్టర్డ్ ఫార్మసిస్ట్'గా అర్హత పొందవచ్చు. డీఫార్మసీ కోర్సులో హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, ఫార్మకాలజీ, ఫార్మస్యూటిక్స్, ఫార్మ స్యూటికల్ కెమిస్ట్రీ, బయో కెమిస్ట్రీ, ఫోరెన్సిక్ ఫార్మసీ, డ్రగ్ స్టోర్ మేనేజ్‌మెంట్ వంటి సబ్జెక్టులపై అవగాహన కల్పిస్తారు.

✦ **ఉద్యోగవకాశాలు:** హాస్పిటల్ ఫార్మసిస్ట్, రిటైల్ ఫార్మసిస్ట్, మ్యానుఫాక్చరింగ్ కెమిస్ట్, కాస్మోటిక్స్, కమ్యూనిటీ ఫార్మసిస్ట్ వంటి ఉద్యోగాలు ఉంటాయి. డీఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వం నిర్వహించే ఈసెట్ పరీక్షలో ఉత్తీర్ణత పొంది.. బీఫార్మసీ రెండో సంవత్సరంలో లేదా ఫార్మ్-డి కోర్సులో చేరవచ్చు. వీరికి ప్రత్యేకంగా 10 శాతం సీట్లు కేటాయిస్తారు.

పీహెచ్‌డీ

బిట్స్, నైపర్, మణిపాల్ యూనివర్సిటీ వంటి కొన్ని ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లు ఫార్మసీలో వివిధ స్పెషలైజేషన్స్‌తో పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

ఫార్మసీ-మేనేజ్‌మెంట్ కోర్సులు

✦ ఫార్మసీ రంగంలో మేనేజ్‌మెంట్ నిపుణుల అవసరం నెలకొంది. దాంతో నైపర్ వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లు ఎంబీఏ కోర్సులు ప్రవేశపెట్టాయి. అలాగే ఎంటెక్ (ఫార్మసీ), ఎంబీఏ(ఫార్మ్)-ఫార్మస్యూటికల్ మేనేజ్‌మెంట్, ఎంఎస్(ఫార్మ్) లాంటి వినూత్న కోర్సులు సైతం అందుబాటులో ఉన్నాయి. బీఫార్మసీ, ఎమ్మెస్సీ లైఫ్ సైన్సెస్ సంబంధిత కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు వీటిలో చేరొచ్చు.

ఫార్మసీతో అవకాశాలు అనేకం

✦ ఫార్మసీ అభ్యర్థులు ఉద్యోగాలపరంగా వివిధ విభాగాల్లో పనిచేసే వీలుంది. వీరు రోగుల కోసం నేరుగా పనిచేయకున్నా.. తెరవెనక మాత్రం ప్రధాన పాత్ర వీరిదే.

✦ **రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్:** డ్రగ్ రికవరీ, రివర్స్ ఇంజనీరింగ్, ఫార్ములేషన్ అండ్ ప్రాసెస్ డెవలప్‌మెంట్, అప్‌స్కేలింగ్ ఫ్రమ్ పైలట్ టు మ్యానుఫ్యాక్చరర్, ట్రబుల్ షూటింగ్, స్టెబిలిటీ, ప్యాకేజింగ్ డెవలప్‌మెంట్.

✦ **ప్రొడక్షన్ అండ్ మ్యానుఫాక్చరింగ్:** బల్క్ డ్రగ్, ఇంటర్మీడియట్స్, ఫినిష్డ్ మెడిసిన్, వ్యాక్సిన్స్, ఇతర బయోలాజికల్ ప్రొడక్ట్‌లు, వెటర్నరీ మెడిసిన్, ఆయుర్వేదిక్ మెడిసిన్స్, డయాగ్నోస్టిక్ ప్రొడక్ట్స్, ఇతర వైద్య పరికరాల ఉత్పాదన, తయారీ.

✦ ఫార్మాస్యూటికల్స్‌ను ప్యాకేజ్ చేసే వేర్వేరు దశల్లోనూ వీరి అవసరం ఉంటుంది.

✦ నాణ్యత నియంత్రణలోనూ ఫార్మసిస్టులు పనిచేస్తున్నారు. డ్రగ్స్ లైఫ్ సైకిల్ మొత్తంలో టెస్టింగ్, ముడి సరుకులు, ప్యాకేజింగ్ నుంచి ఉత్పత్తి బయటికి వచ్చే వరకు నాణ్యత ప్రమాణాలను ఫార్మసిస్టులు పర్యవేక్షిస్తారు.

✦ నాణ్యత హామీ విభాగంలో ఫార్మసిస్టులే బాధ్యతలు చూస్తారు. అవసరమైన పత్రాలను సిద్ధం చేయడం, సమీక్షించడం, అందజేయడం, శిక్షణ, అంతర్గత ఆడిటింగ్ చేపట్టి నాణ్యత లోపించకుండా చూసుకోవాలి.

✦ సేల్స్ అండ్ మార్కెటింగ్.. సంస్థలు తమ ఉత్పత్తుల అమ్మకాలను పెంచుకోవడానికి, మార్కెట్ పరిధిని విస్తృతం చేయడానికి 'మెడికల్ రిప్రజెంటేటివ్'లను నియమించుకుంటున్నాయి. నియామకాల్లో ఫార్మసీ విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తున్నాయి.

✦ నియంత్రణ వ్యవహారాల్లో ఫార్మసీ విద్యార్థులకు అవకాశాలు మెండుగా ఉంటున్నాయి. ఫార్మసీ కంపెనీలు ఆయా నియంత్రణ సంస్థల నుంచి అనుమతి పొందేందుకు కావల్సిన పత్రాలు సిద్ధం చేయడం మొదలు అనుమతి పొందే వరకు అనుసరించాల్సిన ప్రక్రియను వీరే చూసుకోవాలి. కంపెనీ పరిశోధన, డెవలప్‌మెంట్, టెస్టింగ్, ప్రొడక్షన్, మార్కెటింగ్ చేసుకోవడానికి అనుమతులు, పేటెంట్స్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారం వరకు పర్యవేక్షించే బాధ్యత ఫార్మసిస్టులదే!

✦ ఫార్మా ఇండస్ట్రీతోపాటు ప్రాక్టీస్‌లోనూ ఫార్మసీ విద్యార్థులు రాణించవచ్చు.

✦ కమ్యూనిటీ(రిటైల్) ఫార్మసీలో భాగంగా.. మెడికల్ స్టోర్, కెమిస్ట్, డ్రగిస్టుగా ప్రాక్టీస్ చేయవచ్చు. సొంత ఫార్మసీ ప్రారంభించవచ్చు. స్టాక్ నిర్వహణ, వాటిని భద్రపరచడం, డాక్టర్ రాసిన ప్రిస్క్రిప్షన్ హ్యాండ్లింగ్, మెడిసిన్స్ ఇవ్వడం, వైద్య పరికరాల పనితీరును పేషెంట్లకు వివరించడం, న్యూట్రిషన్ సలహాలు లాంటి విధులు ప్రాక్టీస్‌లో ఉంటాయి.

✦ ఆసుపత్రుల ఫార్మసీల్లోనూ దాదాపు ఇవే బాధ్యతలు ఉంటాయి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రుల్లో వీరికి ఉద్యోగాలు లభిస్తాయి. అలానే, క్లినికల్ ఫార్మసీ విభాగంలోనూ అంటే ఇన్‌పేషెంట్‌కేర్‌లో ఫార్మసీ విద్యార్థులు రాణించవచ్చు. ఇక్కడ రోగికి లబ్ధి చేకూర్చేలా క్లినికల్ సర్వీసు అందించే అవకాశం ఉంటుంది.

✦ ఫార్మసీ కాలేజీల్లో, టీచింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో బోధన రంగంలో ఫార్మసీ విద్యార్థులు రాణించవచ్చు. అలానే పరిశోధన నైపుణ్యాలను కూడా ఎప్పటికప్పుడూ మెరుగుపరుచుకునే అవకాశముంది. పీజీ చేసిన విద్యార్థులు టీచింగ్ వైపు వెళ్లడానికి అర్హులు. ఇంకా ఉన్నతంగా ఎదగడానికి పీహెచ్‌డీ చేయడం తప్పనిసరి. మన దేశంతో పాటు ఆసియా దేశాల్లోనూ అర్హులైన టీచర్ల కొరత ఉంది. కాబట్టి పరిశోధన, టీచింగ్ వైపు వెళ్లాలనుకునే వారికి అవకాశాలు పుష్కలం.

✦ ప్రభుత్వ రంగంలోనూ ఫార్మసీ అభ్యర్థులు ఉద్యోగాలు పొందవచ్చు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్స్, డ్రగ్ కంట్రోలర్‌గా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉద్యోగాలు దక్కించుకోవచ్చు.

✦ సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్(సీడీఎస్‌సీవో)..భారత డ్రగ్ కంట్రోల్ సంస్థ. అలానే ప్రతి రాష్ట్రంలోనూ డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ ఉంటుంది. వీటిల్లో ఫార్మసిస్టులు డ్రగ్ నియంత్రణ విభాగంలో పనిచేస్తారు. ముడి పదార్థాల సేకరణ నుంచి అంతిమంగా ఉత్పత్తి బయటికి వచ్చి వినియోగదారుడికి చేరే వరకూ.. అడుగడునా భద్రతా చర్యలు చూసేది ఫార్మసిస్టే. వీరు ఫార్మ కంపెనీల్లో తనిఖీలు చేపట్టడం, మ్యానుఫాక్చరింగ్‌కు అనుమతులు ఇవ్వడం, మార్కెటింగ్‌కు ఆమోదం తెలపడం వంటి కీలక బాధ్యతలు చూడాల్సి ఉంటుంది. మరికొంత మంది డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన లేబరేటరీల్లో డ్రగ్ టెస్టింగ్‌ల్లో ఫార్మస్యూటికల్ కెమిస్ట్, అనలిస్ట్‌గా పనిచేస్తారు.

✦ క్లినికల్ రీసెర్చ్.. ఇప్పుడు తరచూ వినిపిస్తున్న మాట. అత్యంత నైపుణ్యం కలిగిన ఫార్మసీ అభ్యర్థులను నియమించుకొని పరిశోధనలు చేస్తున్న విభాగం.. క్లినికల్ రీసెర్చ్. విదేశీ సంస్థలు సైతం భారత్‌లో తమ శాఖలను ఏర్పాటు చేసుకొని క్లినికల్ రీసెర్చ్ నిర్వహిస్తున్నాయి. క్లినిషియన్స్, ఫార్మాకాలజిస్ట్స్, పోస్ట్ డాక్టరేట్ ఫార్మసిస్ట్స్, టాక్సికాలజిస్ట్, కెమిస్ట్స్, అనలిస్ట్స్ వంటి అడ్వాన్స్‌డ్ టెక్నికల్ అర్హతలు ఉన్నవారికి క్లినికల్ రీసెర్చ్‌లో అవకాశాలు లభిస్తున్నాయి.

✦ ఫార్మసీ అభ్యర్థులకు విదేశాల్లోనూ చక్కని అవకాశాలు ఉన్నాయి. ఫార్మసిస్ట్‌గా ప్రాక్టీస్ చేయాలంటే మాత్రం అక్కడి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫ్రాన్స్, సౌత్ ఆఫ్రికా, నైజీరియా, జర్మనీ, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాలు క్రేజీ డెస్టినేషన్స్‌గా నిలుస్తున్నాయి. గల్ఫ్ దేశాల కోసం అక్కడి స్థానిక భాషల్లో ప్రావీణ్యం సంపాదిస్తే అవకాశాలు మెరుగవుతాయి.

అవకాశాలు తగ్గవు

ఫార్మసీ విద్యార్థులకు డిమాండ్ తగ్గిందనే వార్తల్లో వాస్తవం లేదు. ఫార్మా రంగంలో అవకాశాలు పెరుగుతూనే ఉంటాయి తప్ప ఎప్పటికి తగ్గవు. అయితే కొన్ని ఫార్మా కంపెనీలు ఫార్మసీ చదువుతో సంబంధం లేని వారిని తక్కువ వేతనాలతో నియమించుకోవడం వల్ల అసలైన విద్యార్థులు నష్టపోతున్నారు. జీఎంపీ, డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ చట్టం 1940 నిబంధనల ప్రకారం-ఫార్మ విద్యార్థులనే కంపెనీలు నియమించుకోవాలి. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం 1940, ఫార్మసీ చట్టం 1948 ప్రకారం-ఫార్మసీలో రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్‌ల ద్వారా మాత్రమే ఔషధ సేవలను అందించాలి. రాబోయే రోజుల్లో ఫార్మాసిటీ వంటి పెద్ద ప్రాజెక్టులు రాబోతున్న నేపథ్యంలో అవకాశాలు మరింత విస్తృతమవుతాయి. బీఫార్మసీ విద్యార్థులు కనీసం ఫార్మా ఇండస్ట్రీలో రూ.15వేల వేతనంతో, సేల్స్ వైపు రూ.12వేల వేతనంతో కెరీర్ ప్రారంభించవచ్చు.

-డాక్టర్ ఆకుల సంజయ్ రెడ్డి,
ఫార్మకాలజిస్ట్,మెంబర్,
తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్.

టీచర్ కొలువుకు.. సీటెట్

పవిత్ర వృత్తి.. టీచర్. అందుకే అన్ని విధాల అర్హులు బోధన రంగంలో అడుగు పెట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సీటెట్‌కు శ్రీకారం చుట్టింది. బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఏటా రెండుసార్లు (జూన్, డిసెంబర్) సెంట్రల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతలను కేంద్ర మానవ వనరుల శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ).. సీబీఎస్‌ఈకి అప్పగించింది. ఈ ఏడాది సీటెట్ 2019 డిసెంబర్ పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో... పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం మీ కోసం...

- న్యూఢిల్లీలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) సెంట్రల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) డిసెంబర్-(2019 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

సీటెట్.. ప్రయోజనాలు

- కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ఆర్మీ స్కూళ్లతోపాటు రాష్ట్రస్థాయి పాఠశాలల్లో టీచర్ ఉద్యోగాలకు అర్హత లభిస్తుంది.

ఎన్నిసార్లు రాయొచ్చు

ఒక్కసారి ఈ పరీక్షలో అర్హత సాధిస్తే.. ఏడేళ్ల పాటు వ్యాలిడిటీ ఉంటుంది. ఈ పరీక్షను ఎన్నిసార్లు అయినా రాసుకునే వెసులుబాటు ఉంది. ఎక్కువ స్కోర్ వచ్చిన సీటెట్‌ను ఉపయోగించుకోవచ్చు.

పేపర్ 1-ప్రైమరీ స్టేజ్

(1-5వ తరగతులకు బోధించడానికి)

- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీతోపాటు బీఈడీ (లేదా) ఇంటర్‌తోపాటు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్/డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్)లో డిప్లొమా(లేదా) ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ (లేదా) డిగ్రీతోపాటు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లోడిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

పేపర్ 2- ఎలిమెంటరీ స్టేజ్

(6-8 తరగతులకు బోధించడానికి)

- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీతోపాటు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో డిప్లొమా/బీఈడీ (లేదా) 50 శాతం మార్కులతో ఇంటర్‌తోపాటు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ (లేదా) నాలుగేళ్ల బీఏ/బీఎస్సీ ఎడ్యుకేషన్, బీఏఈడీ, బీఎస్‌ఈడీ, డిగ్రీతోపాటు బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్) (లేదా) తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాత పరీక్ష ద్వారా

పేపర్ 1- ప్రైమరీ స్టేజ్(పీఆర్‌టీ)

(6-11 వయస్సు గల పిల్లలకు బోధించడానికి)

- **రాత పరీక్ష సిలబస్:** చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగీ, లాంగ్వేజ్1 (తప్పనిసరి), లాంగ్వేజ్ 2(తప్పనిసరి), మ్యాథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ అంశాల నుంచి ప్రతి విభాగంలో ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 30 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 150 ప్రశ్నలు-150 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు.

పేపర్ 2 -ఎలిమెంటరీ స్టేజ్(టీజీటీ)

(11-14 వయస్సు గల పిల్లలకు బోధించడానికి)

- **రాత పరీక్ష సిలబస్:** చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగీ, లాంగ్వేజ్ 1 (తప్పనిసరి), లాంగ్వేజ్ 2 (తప్పనిసరి) అంశాల నుంచి ప్రతి విభాగంలో నుంచి ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 30 ప్రశ్నలు, మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ లేదా సోషల్ స్టడీస్/ సోషల్ సైన్స్‌లో 60 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 150 ప్రశ్నలు-150 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు.
- ఈ పరీక్షలో నెగటివ్ మార్కింగ్ విధానం లేదు.

దరఖాస్తు ఫీజు

- జనరల్/ఓబీసీ అభ్యర్థులకు పేపర్-1(లేదా) పేపర్-2 రూ.700. (రెండు పేపర్లు -రూ.1200).
- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు పేపర్-1 లేదా పేపర్-2 రూ.350 (రెండు పేపర్లు-రూ.600)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **రిజిస్ట్రేషన్ చివరితేదీ:** సెప్టెంబర్ 18, 2019
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** సెప్టెంబర్ 23 (మధ్యాహ్నం 3.30 వరకు)
- **పరీక్ష తేదీ:** డిసెంబర్ 8
- **పేపర్-1:** ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు;
- **పేపర్-2:** మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్ర 4.30 గంటల వరకు .
- **వెబ్‌సైట్: www.ctet.nic.in**

ఈ మూడుంటే... ఉద్యోగం మీదే!

- ఉద్యోగ వేటలో తీవ్ర పోటీ ఎదుర్కొంటున్న ఫ్రెషర్స్
- ఇంటర్న్‌షిప్స్, ఫ్రీలాన్సింగ్, సర్టిఫికేషన్స్ ద్వారా అవకాశాలు మెరుగు

జాబ్ స్కిల్స్

ఫ్రెషర్‌గా ఉద్యోగం సాధించడం సులువే అనేది కొంతమంది అభిప్రాయం. ప్రస్తుత జాబ్ మార్కెట్‌ను పరిగణనలోకి తీసుకుంటే... ఉద్యోగం సొంతం చేసుకోవడం చెప్పినంత సులభం కాదన్నది ప్రయత్నించే వాళ్లకు మాత్రమే తెలిసే వాస్తవం. తొలి కొలువు సాధన అనేది అభ్యర్థి సబ్జెక్టు పరిజ్ఞానం, నెపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది.

విపరీతమైన వడపోత

నేటి పోటీ ప్రపంచంలో ఫ్రెషర్స్‌కు ఉద్యోగాల పరంగా తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఆయా కంపెనీలు తమ సంస్థల్లో కొత్త అభ్యర్థులకు ఆఫర్స్ ఇచ్చే విషయంలో విపరీతమైన వడపోత చేపడుతున్నాయి. దాంతో ఉద్యోగ వేటలో ఉన్న వారికి సరైన నైపుణ్యాలు లేకపోవడంతో చాలామంది అవకాశాలు అందుకోలేకపోతున్నారు. కొత్తగా చదువు పూర్తిచేసుకొని ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలకు హాజరైనప్పుడు.. అనుభవం కలిగిన అభ్యర్థులు కూడా పోటీగా రావడంతో ఫ్రెషర్స్ వెనుకబడిపోతున్నారు. ఫ్రెషర్స్ కంటే ఉద్యోగానుభవం ఉన్న వారికే అయా కంపెనీలు ప్రాధాన్యం ఇస్తుండటంతో.. కొత్తగా ఉద్యోగ వేటలో ఉన్న అభ్యర్థులకు నిరాశ ఎదురవుతోంది.

ఆ నాలుగు లేకపోవడం

- అనుభవం లేకపోవడం
- ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాన్ని ప్రదర్శించలేకపోవడం
- రిఫరెన్స్ లేకపోవడం, ఆయా రంగాల్లోని వ్యక్తులతో పరిచయాలు లేకపోవడం
- కమ్యూనికేషన్ స్కిల్స్ ఆకట్టుకునే రీతిలో లేకపోవడం.
- ఈ నాలుగు లోపాలను అధిగమించగలిగితే ఫ్రెషర్స్ సైతం ఉద్యోగం సొంతం చేసుకోవడం తేలికేనని నిపుణులు చెబుతున్నారు. అందుకు వారు ఇంటర్న

కోహ్లి సేన జలకాలాట

ప్రాక్టీస్ మ్యాచ్ అనంతరం రెండు రోజుల విరామం లభించడంతో కోహ్లి సేన పూర్తిగా సేద దీరింది. కెప్టెన్ సహా ఆటగాళ్లు అంటిగ్వా బీచ్‌లో సందడి చేశారు. 'కుర్రాళ్లతో ఓ అద్భుతమైన రోజు' అంటూ మయాంక్, బుమ్రా, ఇషాంత్, పంత్, రహానే, రోహిత్, రాహుల్‌లతో ఉన్న ఫొటోను కోహ్లి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు.

మొదలైంది వేట

గత ఐదు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో భారత్‌కు పతకాలు అందించిన స్టార్ క్రీడాకారిణులు పూసర్ల వెంకట (పీవీ) సింధు, సైనా నెహ్వాల్ మరోసారి పతకాల వేట ప్రారంభించారు. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడిన సింధు, సైనా అలవోక విజయాలతో ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌లను ఖాయం చేసుకున్నారు. మరోవైపు డబుల్స్ విభాగంలో భారత జోడీల పోరాటం ముగిసింది.

- ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు, సైనా
- డబుల్స్‌లో ముగిసిన పోరు
- ప్రపంచ చాంపియన్‌షిప్

బాసెల్ (స్విట్జర్లాండ్): అందని ద్రాక్షగా ఉన్న పసిడి పతకం అందుకోవాలనే లక్ష్యంతో ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన ఐదో సీడ్ పీవీ సింధు, ఎనిమిదో సీడ్ సైనా నెహ్వాల్ శుభారంభం చేశారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో సింధు 21-14, 21-15తో పాయ్ యు పో (చైనీస్ తైపీ)పై... సైనా 21-10, 21-11తో సొరాయ డివిష్ (నెదర్లాండ్స్)పై విజయం సాధించారు. పాయ్ యు పోతో జరిగిన మ్యాచ్‌లో సింధుకు అంతగా ప్రతిఘటన ఎదురుకాలేదు. తొలి గేమ్ ఆరంభంలో 11-7తో ఆధిక్యంలోకి వెళ్లిన సింధు ఆ తర్వాత అదే జోరును కొనసాగించింది. రెండో గేమ్‌లో పాయ్ యు పో తేరుకునే ప్రయత్నం చేసినా సింధు దూకుడు పెంచి విజయాన్ని ఖాయం చేసుకుంది. **నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో తొమ్మిదో సీడ్ బీవెన్ జాంగ్ (అమెరికా)తో సింధు; 12వ సీడ్ మియా బ్లిచ్‌ఫెల్ట్ (డెన్మార్క్)తో సైనా నెహ్వాల్ తలపడతారు.** పురుషుల డబుల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో సుమీత్ రెడ్డి-మనూ అత్రి (భారత్) 16-21, 19-21తో హాన్ చెంగ్ కాయ్-హావో డాంగ్ జౌ (చైనా) చేతిలో... అర్జున్-శ్లోక్ 14-21, 13-21తో లియు చెంగ్-నాన్ జాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయారు. మహిళల డబుల్స్ రెండో రౌండ్‌లో సిక్కి రెడ్డి-అశ్విని 20-22, 16-21తో ఏడో సీడ్ డు యువె-లిన్ యిన్ హుయ్ (చైనా) చేతిలో... మేఘన-పూర్వీషా 8-21, 18-21తో షిహో తనాక-కొహారు (జపాన్) చేతిలో ఓడారు.

శ్రీకాంత్ ముందంజ...

పురుషుల సింగిల్స్ విభాగంలో ఏడో సీడ్ శ్రీకాంత్ (భారత్) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మిషా జిల్బెర్‌మన్ (ఇజ్రాయెల్)తో జరిగిన రెండో రౌండ్‌లో శ్రీకాంత్ 13-21, 21-13, 21-16తో నెగ్గాడు. **నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో కెంటో మొమోటా (జపాన్)తో ప్రణయ్; ఆంథోని (ఇండోనేసియా)తో సాయిప్రణీత్; కాంతాఫోన్(థాయ్‌లాండ్)తో శ్రీకాంత్ పోటీపడతారు.**

కాచుకో... విండీస్

కరీబియన్ పర్యటనలో భారత జట్టు చివరిదైన టెస్టు సిరీస్ ఆడేందుకు సిద్ధమవుతోంది. జట్లకు ఏమోగానీ... ఇది టీమిండియా కెప్టెన్ కోహ్లి అరుదైన రికార్డులకు వేదికగా మారే వీలుంది. వన్డే ప్రపంచ కప్ వైఫల్యం నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్న మన జట్టు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో శుభారంభం చేయాలని భావిస్తోంది. భారత యువ ఓపెనర్లకు పరీక్షగా, స్పెషలిస్ట్ ఆటగాళ్లకు ప్రత్యేకంగా మారనున్న ఈ సిరీస్‌లో తమదైన ముద్ర వేసేది ఎవరో?

నార్త్‌సౌండ్ (అంటిగ్వా): ఆసక్తి రేపుతున్న ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో టీమిండియా ప్రయాణానికి నేటితో తెరలేవనునంది. కరీబియన్ దీవుల పర్యటనలో భాగంగా వెస్టిండీస్, భారత్ తొలి టెస్టు గురువారం ప్రారంభం కానుంది. 8 నెలల విరామం అనంతరం సంప్రదాయ ఫార్మాట్ బరిలో దిగుతున్న కోహ్లి సేనకు తుది జట్టు కూర్పు ఎలా అనే ఆలోచన తప్ప... గాయాలు, ఫామ్ లేమి వంటి ఇబ్బందులు లేవు. టి20, వన్డే సిరీస్‌లు కోల్పోయిన ప్రత్యర్థి వెస్టిండీస్ టెస్టుల్లోనైనా ప్రతాపం చూపాలని భావిస్తోంది. ఈ సిరీస్ కూడా ఓడితే ఆ జట్టు సొంతగడ్డపై తొలిసారిగా భారత్‌కు మూడు ఫార్మాట్లలో సిరీస్‌లు కోల్పోయిన దారుణ రికార్డు మూటగట్టుకుంటుంది. బలాబలాలరీత్యా టీమిండియానే ఫేవరెట్ అయినప్పటికీ, విండీస్‌ను తక్కువ అంచనా వేయలేం.

కోహ్లి ఓటు 5+1+5కేనా?

టెస్టుల్లో విజయానికి కెప్టెన్ కోహ్లి నమ్మే సూత్రం ఐదుగురు బ్యాట్స్‌మెన్, కీపర్, ఐదుగురు బౌలర్లు. మరీ ముఖ్యంగా విదేశాల్లో అతడు దీనిని ఎక్కువగా ఆచరిస్తాడు. ఈ లెక్కన చూస్తే మాత్రం ఆరో స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్‌కు అవకాశం లేనట్లే. ప్రాధాన్య ఓపెనర్‌గా మయాంక్ అగర్వాల్‌కు చోటు ఖాయం. రెండో ఓపెనర్‌గా రాహుల్‌కు తెలుగు ఆటగాడు హనుమ విహారి పోటీ ఇస్తున్నాడు. వన్‌డౌన్‌లో పుజారా, నాలుగో స్థానంలో కోహ్లితో దుర్బేధ్యంగా ఉంది. ఇషాంత్ శర్మ, షమీ, బుమ్రా త్రయం పేస్ బాధ్యతలు మోస్తారు. మరో పేసర్ ఉమేశ్ బెంచ్‌కే పరిమితం కాక తప్పదు. ఇద్దరు స్పిన్నర్ల వ్యూహానికి కట్టుబడితే అశ్విన్-జడేజా ద్వయం బరిలో దిగుతుంది. హార్దిక్ పాండ్యా దూరమైనందున లోయరార్డర్‌లో వీరిద్దరూ బ్యాట్‌తోనూ రాణించాల్సి ఉంటుంది.

హోల్డర్

రహానే-రోహిత్ మధ్య కుర్చీలాట...

టీమిండియాకు కొన్నాళ్లుగా వన్డేల్లో నాలుగో స్థానం ఎంత సమస్యగా మారిందో టెస్టుల్లో ఐదో స్థానం అంతే ఇబ్బంది కలిగిస్తోంది. వైస్ కెప్టెన్ హోదాలో ఓ బాధ్యత ఉన్న అజింక్య రహానే విఫలమవుతుండటమే దీనికి కారణం. రహానే సెంచరీ చేసి రెండేళ్లు దాటింది. ఆస్ట్రేలియా పర్యటన తర్వాత రంజీలు, ఇంగ్లండ్ కౌంటీల్లో తనను తాను పరీక్షించుకున్నా రహానే సాధించిందేమీ లేదు. ఇప్పుడు రోహిత్ నుంచి ముప్పు ఎదుర్కొంటున్నాడు. వన్డే ప్రపంచ కప్ తర్వాత రోహిత్ స్థాయి పెరిగింది. టెస్టుల్లో వరుసగా అవకాశాలు ఇవ్వాలనే స్థితికి అది చేరింది. మరి... ఐదో బ్యాట్స్‌మన్‌గా రోహిత్ శర్మ, వైస్ కెప్టెన్ రహానేలలో కెప్టెన్ మొగ్గు ఎవరి వైపు ఉంటుందో చూడాలి.

విండీస్ ఎలా ఆడుతుందో?

ఈ ఏడాది మొదట్లో తమ దేశంలో పర్యటించిన ఇంగ్లండ్‌ను తొలి టెస్టులో 381 పరుగులతో; రెండోదాంట్లో 10 వికెట్లతో విండీస్ ఓడించింది. స్వదేశంలో కరీబియన్లు ప్రమాదకారులు అని చెప్పడానికి ఇదే సంకేతం. ఈ సిరీస్‌లో భారత బ్యాట్స్‌మెన్‌కు పేసర్ రోచ్ నుంచి సవాలు తప్పదు. స్పిన్ ఆల్‌రౌండర్ చేజ్ సైతం గట్టి పిండమే. కెప్టెన్ హోల్డర్ ఆల్‌రౌండ్ పాటవం విండీస్‌కు సానుకూలాంశం. ఓపెనర్ బ్రాత్‌వైట్, హోప్, హెట్‌మైర్‌లతో బ్యాటింగ్‌లో జట్టు బలంగా ఉంది. మహాకాయుడు కార్న్‌వాల్ అరంగేట్రం చేయనున్నాడు.

గెలిస్తే 120 పాయింట్లు...

రెండు మ్యాచ్‌ల సిరీసే కాబట్టి... డబ్ల్యూటీసీలో భాగంగా ఒక్కో టెస్టు విజయానికి 60 పాయింట్లు దక్కుతాయి. రెండూ గెలిస్తే 120 పాయింట్లతో పట్టికలో ప్రస్తుతానికి భారత్ టాప్‌లోకి చేరుతుంది. న్యూజిలాండ్‌పై తొలి టెస్టు నెగ్గిన శ్రీలంక 60; యాషెస్‌లో మొదటి టెస్టు గెలిచి, రెండో టెస్టును డ్రాగా ముగించిన ఆస్ట్రేలియా 32 పాయింట్లతో ఉన్నాయి.

కోహ్లి, రహానే

నేటి నుంచి భారత్‌తో తొలి టెస్టు

- టీమిండియా కూర్పుపై ఆసక్తి
- రాత్రి గం.7 నుంచి సోనీ టెన్-1లో ప్రత్యక్ష ప్రసారం

తుది జట్లు (అంచనా)

భారత్: రాహుల్/విహారి, మయాంక్, పుజారా, కోహ్లి (కెప్టెన్), రహానే/రోహిత్, పంత్/సాహా, జడేజా, అశ్విన్, షమీ, బుమ్రా, ఇషాంత్.

వెస్టిండీస్: బ్రాత్‌వైట్, కాంప్‌బెల్, హోప్, డారెన్ బ్రేవో, హెట్‌మైర్, చేజ్, డౌరిచ్, హోల్డర్ (కెప్టెన్), కార్న్‌వాల్/కీమో పాల్, రోచ్, గాబ్రియెల్.

పిచ్, వాతావరణం

ఇక్కడి సర్ వివియన్ రిచర్డ్స్ మైదానంలో రెండేళ్లుగా విండీస్ పేసర్లు, ప్రత్యేకంగా రోచ్ చెలరేగుతున్నాడు. 2018లో ఐదు వికెట్లు తీసి బంగ్లాదేశ్‌ను 43 పరుగులకే ఆలౌట్ చేయడంలో కీలకంగా నిలిచాడు. ఈ జనవరిలో ఇంగ్లండ్‌పై రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ 4 వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. పిచ్ స్వభావ రీత్యా పేసర్లకు ఈసారీ పండుగే. ఇంగ్లండ్‌తో టెస్టు అనంతరం ఈ పిచ్‌కు ఒక డీ మెరిట్ పాయింట్‌తో పాటు, బిలో యావరేజ్ రేటింగ్ ఇచ్చారు. అంటిగ్వాలో వాతావరణం మబ్బులు పట్టి ఉంది. మూడో రోజు నుంచి జల్లులు పడతాయి.

1
కోహ్లి మరొక్క సెంచరీ చేస్తే అత్యధిక శతకాలు బాదిన కెప్టెన్ల జాబితాలో ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ (19) సరసన చేరతాడు. దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ 109 టెస్టుల్లో 25 సెంచరీలతో ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు.

26
కోహ్లి నేతృత్వంలో ఆడిన 46 టెస్టుల్లో భారత్ గెలిచిన టెస్టుల సంఖ్య. మరోటి నెగ్గితే మాజీ కెప్టెన్ ధోని (60 మ్యాచ్‌ల్లో 27) అత్యధిక విజయాల రికార్డును అతడు సమం చేస్తాడు.

'పేటీఎం'కే టైటిల్ స్పాన్సర్‌షిప్

నాలుగేళ్ల కాలానికి రూ.326.80 కోట్లు

ముంబై: భారత్‌లో జరిగే అన్ని క్రికెట్ మ్యాచ్‌ల టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులను ప్రముఖ డిజిటల్ వాలెట్ సంస్థ 'పేటీఎం' తిరిగి దక్కించుకుంది. స్వదేశంలో భారత జట్టు ఆడే అన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లతో (టెస్టులు, వన్డేలు, టి20లు) పాటు మహిళల క్రికెట్ సహా బీసీసీఐ నిర్వహించే దేశవాళీ టోర్నీలు అన్నింటికీ 'పేటీఎం' టైటిల్ స్పాన్సర్‌గా ఉంటుంది. స్పాన్సర్‌షిప్‌పై 'పేటీఎం' యాజమాన్యం వన్97 కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో 2019-2023 మధ్య నాలుగేళ్ల కాలానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు బోర్డు ప్రకటించింది. ఇందు కోసం 'పేటీఎం' రూ.326.80 కోట్లు చెల్లించనుంది. భారత్‌లో జరిగే మ్యాచ్‌ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే సుమారుగా ఒక్కో మ్యాచ్‌కు పేటీఎం రూ. 3.80 కోట్లు చెల్లిస్తుంది. గత ఏడాది రూ. 2.4 కోట్లతో పోలిస్తే ఇది 58 శాతం ఎక్కువ. సెప్టెంబర్ 15న దక్షిణాఫ్రికాతో జరిగే తొలి టి20తో భారత్ స్వదేశీ సీజన్ మొదలవుతుంది.

భారత్ డబుల్ ధమాకా

ఒలింపిక్ టెస్ట్ ఈవెంట్ హాకీ టోర్నీలో పురుషుల, మహిళల విభాగం టైటిల్స్ సొంతం

టోక్యో: జపాన్ గడ్డపై భారత పురుషుల, మహిళల హాకీ జట్లు గర్జించాయి. ఒలింపిక్ టెస్టు ఈవెంట్‌లో భారత జట్లే విజేతలుగా నిలిచాయి. ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌కు ముందు కొత్తగా నిర్మించిన స్టేడియాలని ప్రాక్టికల్‌గా పరిశీలించేందుకు ఈ టోర్నీలను నిర్వహిస్తారు. ఇందులో పురుషుల జట్టయితే లీగ్‌లో కివీస్ చేతిలో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకుంది. బుధవారం జరిగిన ఫైనల్లో భారత్ 5-0తో న్యూజిలాండ్‌ను చిత్తుగా ఓడించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (7వ ని.), షంషీర్ సింగ్ (18వ ని.), నీలకంఠ శర్మ (22వ ని.), గుర్‌సాహిబ్‌జిత్ సింగ్ (26వ ని.), మన్‌దీప్ సింగ్ (27వ ని.) తలా ఒక గోల్‌తో భారత్‌కు ఎదురులేని విజయాన్ని అందించారు.

మహిళల జట్టు జపాన్‌పై...

భారత మహిళల జట్టు ఆతిథ్య జట్టును 2-1తో ఓడించి టైటిల్ గెలుచుకుంది. భారత్ తరపున నవజ్యోత్ కౌర్ (11వ ని.), లాల్‌రెమ్‌సియామి (33వ ని.) ఒక్కో గోల్ చేశారు. జపాన్ తరపున మినామి (12వ ని.) ఏకైక గోల్ సాధించింది.

స్మిత్ లేని ఆస్ట్రేలియా

- విజయంపై ఇంగ్లండ్ ఆశలు
- నేటి నుంచి యాషెస్ మూడో టెస్టు
- మ.గం. 3.30 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

లీడ్స్: 378... మూడు ఇన్నింగ్స్‌లలో కలిపి స్టీవ్ స్మిత్ ఈ యాషెస్ సిరీస్‌లో చేసిన పరుగులు. ఆస్ట్రేలియా నుంచి రెండో స్థానంలో ఉన్న ట్రవిస్ హెడ్ చేసినవి 135 పరుగులు! స్మిత్‌పై ఆసీస్ ఎంతగా ఆధారపడుతుందో చెప్పడానికి ఈ తేడా చాలు. తొలి టెస్టు రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీలతో జట్టును గెలిపించిన మాజీ కెప్టెన్ రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో అద్భుత బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నాడు. అయితే జోఫ్రా ఆర్చర్ దెబ్బ అతడిని ఆటకు దూరం చేసింది. గాయం నుంచి కోలుకోకపోవడంతో మూడో టెస్టు నుంచి కూడా తప్పుకోవాల్సి వచ్చింది. ఇక ఫామ్‌లో లేని మిగిలిన ఆటగాళ్లను చుట్టేసి సిరీస్ సమం చేయాలని ఇంగ్లండ్ ఆశపడుతోంది. ఈ నేపథ్యంలో నేటి నుంచి ఇక్కడి హెడింగ్లీ మైదానంలో మూడో యాషెస్ టెస్టుకు రంగం సిద్ధమైంది.

తొలి రెండు టెస్టుల ఫలితం ఎలా ఉన్నా... ఇరు జట్లను సమస్యలు వేధిస్తున్నాయి. వార్నర్ పేలవ ఫామ్ ఆసీస్‌కు పెద్ద సమస్యగా మారింది. మరో ఓపెనర్ బాన్‌క్రాఫ్ట్ కూడా ఘోరంగా విఫలమయ్యాడు. ఖాజా, హెడ్ ఫర్వాలేదనిపించినా అది సరిపోదు. స్మిత్ దూరం కావడంతో జట్టులోకి వచ్చి ఆత్మవిశ్వాసం ప్రదర్శించిన లబ్‌షేన్ ఈ టెస్టులోనూ నాలుగో స్థానంలో ఆడతాడు. తన సత్తా చూపించేందుకు అతనికి ఇది మరో మంచి అవకాశం. పేస్ బౌలింగ్‌లో ఆసీస్ మెరుగ్గా కనిపిస్తోంది. కమిన్స్ ఫామ్‌లో ఉండగా... స్టార్క్, సిడిల్‌లకు హెడింగ్లీ పిచ్‌లపై రాణించగల సామర్థ్యం ఉంది. లయన్ రూపంలో నాణ్యమైన స్పిన్నర్ ఉండటం వారికి అదనపు బలం. అయితే స్మిత్ లేని లోటును కంగారూల బ్యాటింగ్ లైనప్ ఎంత మేరకు పూడ్చగలదనేది ఆసక్తికరం. ఇంగ్లండ్ కెప్టెన్ రూట్ బ్యాటింగ్ పూర్తిగా గతి తప్పడం జట్టును ఇబ్బందుల్లో పడేస్తోంది. టెస్టుల్లో ఇంగ్లండ్ నంబర్‌వన్ అయిన రూట్ ఈ మ్యాచ్‌లోనైనా రాణించాల్సి ఉంది. టెస్టులు ఆడలేకపోతున్న జేసన్ రాయ్ మరోసారి ఓపెనర్‌గా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. బ్యాటింగ్‌లో స్టోక్స్ ఫామ్‌లోకి రావడం సానుకూలాంశం. ఇక బౌలింగ్‌లో అందరి దృష్టీ ఆర్చర్‌పైనే ఉంది. గత మ్యాచ్‌లో భీకరమైన వేగంతో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు చూపించిన అతను ఈసారి అదే తరహాలో చెలరేగిపోతే ఆసీస్‌కు కష్టాలు తప్పవు.

రెండో రౌండ్‌లో అంకిత ఓటమి

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ అంకిత రైనా పోరాటం ముగిసింది. రెండో రౌండ్‌లో అంకిత 7-6 (7/4), 4-6, 2-6తో డెనిసా అలెర్టోవా (చెక్ రిపబ్లిక్) చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత్‌కే చెందిన సుమీత్ నాగల్ 7-6 (8/6), 6-2తో తత్సుమ్ ఇటో (జపాన్)ను ఓడించాడు. ఓ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టోర్నీలో సుమీత్‌కిదే తొలి విజయం. **ప్రజ్నేశ్ పరాజయం:** మరోవైపు విన్‌స్టన్ సాలెమ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ ఓడిపోయాడు. రెండో రౌండ్ మ్యాచ్‌లో 89వ ర్యాంకర్ ప్రజ్నేశ్ 3-6, 5-7తో టాప్ సీడ్ బెనోయిట్ పెయిర్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం చవిచూశాడు. ఈ ఓటమితో ప్రజ్నేశ్‌కు 6,500 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 4 లక్షల 64 వేలు) లభించింది.

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
APMSIDC, ప్లాట్ నం.9, సర్వే నం.49, IT పార్క్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం (ఆన్‌లైన్) ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.
టెండరు ప్రకటన నం. 41 (19-20)/APMSIDC/Medicine Wing/2019-21 (సంక్షిప్త టెండరు) తేది: 20.08.2019.
తయారీదార్లు మరియు డైరెక్ట్ ఇంపోర్టర్స్ నుండి జనరల్ మెడిసిన్స్ (అల్బెండాజోల్ ట్యాబ్లెట్స్ 400 mg చప్పరించేవి) సేకరణ. పూర్తి వివరాల కోసం **22.08.2019** నుండి దర్శించండి వెబ్‌సైట్ https://tender.apeprocurement.gov.in ఎట్టి కారణాలు తెలియచేయకుండా ఏ సమయంలోనైనా టెండరును రద్దు చేయుటకు APMSIDC కి హక్కు కలదు.
DIPR RO No. 95 PP/CL/Advt/1/2019-20, Dt:21-08-19 **సం/- మేనేజింగ్ డైరెక్టర్ తరఫున**

కుంబ్లే చీఫ్ సెలక్టర్ కావాలి!

- వీరేంద్ర సెహ్వాగ్ వ్యాఖ్య
- బోర్డు ఎక్కువ డబ్బులివ్వాలన్న మాజీ ఓపెనర్

న్యూఢిల్లీ: భారత దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే చీఫ్ సెలక్టర్‌గా ఉంటే బాగుంటుందని మరో మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. ఆటగాళ్ల గురించి కుంబ్లేకు బాగా తెలుసని, వారిలో ఆత్మవిశ్వాసం నింపగలడని అతను అన్నాడు. 'నా దృష్టిలో సెలక్షన్ కమిటీ చైర్మన్ పదవికి అనిల్ కుంబ్లే సరైన వ్యక్తి. ఆటగాడిగా ఉన్న సమయంలో సచిన్, గంగూలీ, ద్రవిడ్‌లాంటి వారితో సాన్నిహిత్యం ఉన్న కుంబ్లేకు కోచ్‌గా ఈతరం కుర్రాళ్ల గురించి కూడా బాగా తెలుసు. 2007-08 ఆస్ట్రేలియా సిరీస్‌లో నేను పునరాగమనం చేసిన సమయంలో కెప్టెన్‌గా ఉన్న కుంబ్లే నా గదికి వచ్చి తర్వాతి రెండు సిరీస్‌ల వరకు నిన్ను తప్పించం అని చెప్పాడు. ఆటగాళ్లకు ఆ రకంగా నమ్మకం పెంచాలి' అని వీరూ అన్నాడు. అయితే కుంబ్లే స్థాయి వ్యక్తులు పని చేయాలంటే వారి పారితోషికం పెంచాల్సిందేనని కూడా అతను చెప్పాడు. ప్రస్తుతం చీఫ్ సెలక్టర్‌కు ఏటా రూ. 1 కోటి ఇస్తున్నారు. బీసీసీఐ ఈ మొత్తాన్ని పెంచితే ఎక్కువ మంది ముందుకొస్తారని మాజీ ఓపెనర్ విశ్లేషించాడు. టీవీలో వ్యాఖ్యాతగా, పత్రికలకు వ్యాసకర్తగా ఉన్న తాను సెలక్టర్‌గా వస్తే ఎన్నో షరతులు విధిస్తారని... తనకు అలాంటివి నచ్చవు కాబట్టి సెలక్టర్‌ను కాలేనని సెహ్వాగ్ వివరించాడు. శ్రీశాంత్‌కు విధించిన శిక్షను తగ్గించడం పట్ల వీరూ సంతోషం వ్యక్తం చేశాడు. డోప్ టెస్టులకు తాను కూడా చాలా సార్లు హాజరయ్యానని, అయితే ఎప్పుడు ఎక్కడ ఉంటారో సరిగ్గా చెప్పడంలోనే సమస్య వచ్చిందంటూ 'నాడా' నిబంధనపై అతను అభిప్రాయం వ్యక్తం చేశాడు.

'నెక్' చూపించడం ఎందుకు?

లార్డ్స్ టెస్టులో ఆర్చర్ బౌలింగ్‌లో స్టీవ్ స్మిత్ మెడకు తీవ్ర గాయమైన నేపథ్యంలో 'నెక్ గార్డ్' వాడకంపై చర్చ జరుగుతోంది. దీనిపై స్పందిస్తూ సెహ్వాగ్ ఆసక్తికర వ్యాఖ్య చేశాడు. 'బ్యాటింగ్ చేసేటప్పుడు బౌలర్‌కు అసలు మీ మెడ కనిపించేలా ఎందుకు ఆడాలి. చేతిలో బ్యాట్ ఉంది. తలకు హెల్మెట్ కూడా ఉంది కదా. నా కెరీర్‌లో ఎప్పుడూ కనీసం చెస్ట్ ప్యాడ్ కూడా వాడలేదు' అని సెహ్వాగ్ చెప్పడం విశేషం.

పింక్ పాంథర్స్‌కు ఏడో విజయం

చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఏడో సీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ జోరు మీదుంది. బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో పింక్ పాంథర్స్ 28-26తో తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించింది. లీగ్‌లో జైపూర్‌కిది ఏడో విజయం. 9 మ్యాచ్‌లాడిన ఈ జట్టు రెండే పోటీల్లో ఓడి అత్యధిక విజయాలతో అగ్రస్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో రాహుల్ చౌదరి (తమిళ్) ఆటలు సాగలేదు. 16 సార్లు రైడింగ్‌కు వెళ్లిన అతను ఆరు పాయింట్లకే పరిమితమయ్యాడు. జైపూర్ తరపున నీలేశ్ (7) రాణించాడు. మిగతావారిలో విశాల్ 4, దీపక్ హుడా 3 పాయింట్లు చేశారు. తలైవాస్ జట్టులో అజయ్ ఠాకూర్ (6), వినీత్ శర్మ (5) ఆకట్టుకున్నారు. అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 31-23తో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. పుణేరి తరపున మన్‌జీత్ 7, సుర్జిత్ 6, జాదవ్ శాహజి 5 పాయింట్లు చేశారు. గురువారం జరిగే మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్‌తో పట్నా పైరేట్స్ తలపడుతుంది.

సైనా, సింధులకు ట్రయల్స్ ఉన్నాయా: మేరీకోమ్



న్యూఢిల్లీ: మెగా టోర్నీలకు ముందు చేపట్టే సెలక్షన్ ట్రయల్స్ అంశాన్ని భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) పునఃసమీక్షించాలని చాంపియన్ బాక్సర్ మేరీ కోమ్ తెలిపింది. జాతీయ సెలక్షన్స్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్‌తో జరగాల్సిన 51 కేజీ విభాగం పోటీని ఉన్నపళంగా రద్దు చేసి మేరీని ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు బీఎఫ్ఐ ఎంపిక చేసింది. ఇది వివాదాస్పదమైంది. బీఎఫ్ఐ నిర్ణయాన్ని నిఖత్ తీవ్రంగా నిరసించింది. దీనిపై ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ అయిన మేరీకోమ్ మాట్లాడుతూ 'చాలా క్రీడల్లో సెలక్షన్ ట్రయల్స్ ఉండవు. భారత స్టార్ షట్లర్లు సైనా, సింధులు ఎప్పుడైనా ఈ ట్రయల్స్‌లో పాల్గొన్నట్లు చూశామా? ఒక్కోసారి నాకే విచిత్రంగా అనిపిస్తుంది ఈ ట్రయల్స్ గోడవేంటని? నేను బీఎఫ్ఐకు స్పష్టంగా చెప్పాను. మీకు ఏది మంచైతే అదే నిర్ణయం తీసుకోవాలన్నాను' అని మేరీకోమ్ వివరించింది.

icmr NIN
ICMR-NATIONAL INSTITUTE OF NUTRITION
Department of Health Research, Ministry of Health and Family Welfare, Government of India
No.Advt.No.2/Admn-EMP/2019-20 Date: 14-08-2019
EMPLOYMENT NOTIFICATION
Application are invited from the eligible candidate in the prescribed format for filling up of the following Posts under Direct Recruitment at ICMR-National Institute of Nutrition, Hyderabad, Telangana, on or before 25-09-2019 upto 5-00 P.M., as detailed below:

POST NO - 1	**PERSONAL ASSISTANT**
Pay Matrix	Level: 6 of 7th CPC (Rs.35400-112400)
No. of Vacancies & Reservation Category	**5 Posts (OBC-1,UR-4)**
Educational and other qualifications required for direct recruit:	1) Minimum 3 years Bachelor's degree in any discipline from a recognized university/Institute with computer literacy. 2) 120 w.p.m. speed in shorthand (English or Hindi)
POST NO - 2	**STENOGRAPHER**
Pay Matrix	Level: 4 of 7th CPC (Rs.25500-81100)
No. of Vacancies & Reservation Category	**3 Posts (UR)**
Educational and other qualifications required for direct recruits:	1) 12th class pass or equivalent qualification from a recognized Board or University with computer literacy. 2) 80 w.p.m. speed in shorthand in English or Hindi
POST NO - 3	**UPPER DIVISION CLERK**
Pay Matrix	Level: 4 of 7th CPC (Rs.25500-81100)
No. of Vacancies & Reservation Category	**7 Posts (OBC-1, SC-1 & UR-5)-*1 post identified for PWD/Divyang)** * Person(s) with benchmark disability under category "C" of DoPT OM No.36035/02/2017-Estt.(Res), dated 15-01-2018.
Educational and other qualifications required for direct recruits:	1) Degree of a recognized University or equivalent. 2) Typing speed of 35 w.p.m. in English or 30 w.p.m. in Hindi on Computer (35 w.p.m. and 30 w.p.m. correspond to 10500 KDPH/9000 KDPH on an average of 5 key depressions for each word.)
POST NO - 4	**LOWER DIVISION CLERK**
Pay Matrix	Level: 2 of 7th CPC (Rs.19900-63200)
No. of Vacancies & Reservation Category	**5 Posts (OBC-1, UR-4)- *1 post identified for PWD/Divyang)** * Person(s) with benchmark disability under category "C" of DoPT OM No.36035/

సాక్షి బిజినెస్
గురువారం
22-8-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
268 ▼	98 ▼
37,060	10,919

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	8,020	▲ 72
డోజోన్స్	26,235	▲ 272
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,204	▲ 79
డాక్స్	11,803	▲ 152
షాంఘై	2,880	▲ 1
నికాయ్	20,618	▼ 59

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	70.75	72.39
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	85.54	88.61
€	యూరో	ఎస్‌బీఐ	77.97	80.90
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	65.97	68.49
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.51	49.70
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.84	52.59
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	18.30	20.07
AED	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	18.74	20.30
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.51	10.86

అమెజాన్ అతిపెద్ద క్యాంపస్

హైదరాబాద్‌లో ప్రారంభం

- గచ్చిబౌలిలో 30 లక్షల చదరపు అడుగుల్లో నిర్మాణం
- రూ.1,500 కోట్లకుపైగా వ్యయం
- 15,000 మంది ఉద్యోగులు కూర్చునేలా ఏర్పాటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ అతిపెద్ద క్యాంపస్‌ను హైదరాబాద్‌లో బుధవారం ప్రారంభించింది. గచ్చిబౌలిలో 30 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కేంద్రాన్ని నిర్మించారు. ఆఫీస్ స్పేస్ 18 లక్షల చదరపు అడుగులు కై వసం చేసుకుంది. మొత్తం 15,000 మంది ఉద్యోగులు కూర్చునేలా ఏర్పాట్లున్నాయి. 39 నెలల్లోనే నిర్మాణం పూర్తి అయింది. ప్రతిరోజు సగటున 2,000 మంది కార్మికులు నిర్మాణంలో పాలుపంచుకున్నారు. ఈఫిల్ టవర్‌కు వినియోగించిన ఇనుము కంటే రెండున్నరెట్లు ఈ భవనానికి వాడారు. ఒకే సమయంలో 972 మంది వెళ్లగలిగేలా 49 లిఫ్టులున్నాయి. ఇవి సెకనుకు ఒక్కో అంతస్తును దాటతాయి. 86 మీటర్ల ఎత్తున్న ఈ భవనంలో విభిన్న రెస్టారెంట్లతో 24 గంటలూ నడిచే భారీ కెఫెటేరియా, హెలిప్యాడ్, 290 కాన్ఫరెన్స్ రూమ్స్ ఏర్పాటు చేశారు. నిర్మాణానికి రూ. 1,500 కోట్లకుపైగా వెచ్చించినట్టు సమాచారం.

తొలుత హైదరాబాద్ నుంచే..

అమెజాన్‌కు యూఎస్ వెలుపల ఇది ఏకైక సొంత భవనం కావడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల్లో సంస్థకు 300 క్యాంపస్‌లు ఉన్నాయి. అన్ని కేంద్రాల విస్తీర్ణం 4 కోట్ల చదరపు అడుగులు ఉంది. భారత్‌లో 13 రాష్ట్రాల్లో 50 గిడ్డంగులున్నాయి. ఇక హైదరాబాద్‌లో కంపెనీకి ఎనిమిది ఆఫీసులున్నాయి. 40 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇవి నెలకొన్నాయి. 2004లో భారత్‌లో అడుగుపెట్టిన అమెజాన్ తొలుత భాగ్యనగరి కేంద్రంగా కార్యకలాపాలను ప్రారంభించింది. టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆపరేషన్స్ టీమ్స్‌తో పాటు పెద్ద ఎత్తున కస్టమర్ సర్వీస్ ఆపరేషన్స్ హైదరాబాద్ నుంచి జరుగుతున్నాయి. కాగా, నూతన క్యాంపస్‌ను తెలంగాణ హోం శాఖ మంత్రి మహమూద్ అలీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ ప్రారంభించారు.

క్యాంపస్‌లో భారీ కెఫెటేరియా

విశాలమైన కార్యాలయం

ఉద్యోగులకు ఆటవిడుపు. ఇండోర్ క్రికెట్

భారత్ నుంచి ఎగుమతులకు ఊతం..

భారత్‌లో అమెజాన్‌కు 30 ఆఫీసులున్నాయి. 62,000 పైచిలుకు ఉద్యోగులున్నారు. వీరిలో 20,000కుపైగా హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. అలాగే దేశవ్యాప్తంగా 1.55 లక్షల మంది కాంట్రాక్టు సిబ్బంది ఉన్నారు. ఇప్పటి వరకు భారత్‌లో రూ.35,000 కోట్ల పెట్టుబడి పెట్టామని అమెజాన్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్ వెల్లడించారు. మరో రూ.3,500 కోట్లు ఫుడ్, రిటైల్‌లో ఖర్చు చేశామన్నారు. గ్లోబల్ రియల్ ఎస్టేట్ వైస్ ప్రెసిడెంట్ జాన్ షోట్లర్‌తో కలిసి ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.

'గ్లోబల్ సెల్లింగ్ వేదిక ద్వారా ఇక్కడి చిన్న వర్తకులు విదేశాల్లో తమ ఉత్పత్తులు విక్రయించుకునే సౌలభ్యం కల్పించాం. 50,000 మంది విక్రేతలు 14 కోట్ల ఉత్పత్తులు అమ్మకానికి ఉంచారు. ఇప్పటి వరకు రూ.7,000 కోట్ల విలువైన ప్రొడక్టులు ఎగుమతి అయ్యాయి. వచ్చే మూడేళ్లలో ఇది రూ.35,000 కోట్లకు చేరుతుందని ఆశిస్తున్నాం. ఈ-కామర్స్ రంగంలో మందగమనం లేదు' అని వివరించారు.

క్యాంపస్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న అమిత్ అగర్వాల్. చిత్రంలో మహమూద్ అలీ, జయేశ్ రంజన్, జాన్ షోట్లర్ • ఆఫీసులో లోపలి ప్రదేశం

వన్‌ప్లస్ టీవీలూ వస్తున్నాయ్..

- సెప్టెంబర్‌లో మార్కెట్లోకి
- తొలిసారిగా భారత్‌లోనే ఆవిష్కరణ

న్యూఢిల్లీ: చైనాకు చెందిన ప్రీమియం స్మార్ట్‌ఫోన్స్ తయారీ దిగ్గజం వన్‌ప్లస్ తాజాగా స్మార్ట్ టీవీలను అందుబాటులోకి తెస్తోంది. సెప్టెంబర్‌లో వీటిని భారత మార్కెట్లో ప్రవేశపెట్టబోతోంది. చైనా కన్నా ముందుగా భారత మార్కెట్లోనే స్మార్ట్ టీవీలను ప్రవేశపెడుతుండటం గమనార్హం. 'వన్‌ప్లస్ టీవీలను సెప్టెంబర్‌లో ఆవిష్కరించబోతున్నాం. వీటిని ముందుగా భారత్‌లోనే అందుబాటులోకి తెస్తున్నాం' అని వన్‌ప్లస్ ఫోరంలో సంస్థ సీఈవో పీట్ లౌ వెల్లడించారు. అయితే, టీవీ ధర, ఇతర రత్రా ఫీచర్స్ మొదలైన వాటి గురించి మాత్రం ప్రస్తావించలేదు. చైనాకు చెందిన స్మార్ట్‌ఫోన్స్ తయారీ సంస్థ షావోమీ కూడా గతేడాది నుంచే భారత్‌లో టీవీలను కూడా విక్రయించడం మొదలుపెట్టింది. ఇక శాంసంగ్, ఎల్‌జీ, మైక్రోమ్యాక్స్ వంటి ఇతరత్రా ఫోన్స్ తయారీ సంస్థలకు కూడా సొంతంగా టీవీ బ్రాండ్స్ ఉన్నాయి. ప్రస్తుతం వాటి బాటలోనే వన్‌ప్లస్ సంస్థ సైతం స్మార్ట్‌టీవీల విభాగంలోకి అడుగుపెడుతోంది. గత రెండేళ్లుగా ఈ ప్రాజెక్టుపై కృషి చేస్తున్నామని, క్రమంగా ఒక్కో మార్కెట్‌లో ఈ టీవీలను ప్రవేశపెడతామని పీట్ వివరించారు. భారత్‌లో వివిధ కంటెంట్ ప్రొవైడర్స్‌తో సత్సంబంధాలు ఉండటంతో యూజర్లకు మరింత మెరుగైన కంటెంట్‌ను అందించగలమన్నారు. ఉత్తర అమెరికా, యూరప్, చైనా తదితర మార్కెట్లలో కూడా వన్‌ప్లస్ టీవీని ఆవిష్కరించేందుకు స్థానిక, ప్రాంతీయ కంటెంట్ ప్రొవైడర్స్‌తో ఒప్పందాలు కుదుర్చుకోవడంపై కసరత్తు చేస్తున్నామని పీట్ చెప్పారు. 'ప్రతీ చిన్న విషయంపైనా దృష్టి పెడతాం. భవిష్యత్ స్మార్ట్ టీవీలకు ప్రమాణాలు నిర్దేశించేలా మా ఉత్పత్తి ఉండాలన్నది మా లక్ష్యం' అని ఆయన చెప్పారు. 2019 జూన్ క్వార్టర్‌లో భారత ప్రీమియం స్మార్ట్‌ఫోన్ విభాగంలో (రూ.30,000 పైగా ధర ఉండే ఫోన్స్) వన్‌ప్లస్ 43 శాతం వాటాతో అగ్రస్థానంలో నిల్చింది.

పవర్‌గ్రిడ్ సీఎండీగా కె. శ్రీకాంత్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా కె. శ్రీకాంత్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఈయన కంపెనీ ఫైనాన్స్ విభాగ డైరెక్టర్ హోదాలో ఉన్నారు. విద్యుత్ రంగంలో ఈయనకు 33 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉందని.. క్యాపిటల్ బడ్జెటింగ్ రూపకల్పన, దీర్ఘకాలిక ఫైనాన్స్ ప్లానింగ్, వనరుల సమీకరణ వంటి అంశాల్లో మంచి పట్టు ఉందని కంపెనీ బుధవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది.

పార్లేలో 10 వేల ఉద్యోగాలకు ఎసరు

- ఏడాది కాలంలో తీసేసే అవకాశం
- జీఎస్‌టీ ప్రభావం, డిమాండ్ క్షీణతే కారణం

ముంబై: అమ్మకాలు పడిపోతుండటంతో వివిధ రంగాల సంస్థలు ఉత్పత్తిని తగ్గించుకునే క్రమంలో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. తాజాగా బిస్కెట్ల తయారీ సంస్థ పార్లే కూడా ఈ జాబితాలో చేరనుంది. స్థూల ఆర్థిక పరిస్థితులు ఆశావహంగా లేకపోవడంతో వచ్చే ఏడాది కాలంలో సుమారు 10,000 మంది దాకా ఉద్యోగులను తొలగించాల్సి రావొచ్చని పార్లే ప్రోడక్ట్స్ విభాగం హెడ్ మయాంక్ షా తెలిపారు. సామాన్యుల కోసం ఉద్దేశించిన చౌక ఉత్పత్తులపై కూడా అధిక స్థాయిలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధింపు, డిమాండ్ మందగమనం వంటి అంశాలు ఇందుకు కారణమని ఆయన పేర్కొన్నారు. పార్లేకు సొంతంగా 10 తయారీ యూనిట్లు ఉండగా, థర్డ్ పార్టీ తయారీ సంస్థలు 125 దాకా ఉన్నాయి. బిస్కెట్ తయారీతో పాటు ఇతర వ్యాపార విభాగాల్లో పార్లేలో ప్రస్తుతం లక్ష మంది పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. 'ఇప్పటికైతే ఉద్యోగులెవరినీ తొలగించలేదు. కానీ పరిస్థితులు మెరుగుపడకపోతే ఈ చర్యలు తీసుకోవాల్సి రావొచ్చు' అని మయాంక్ షా చెప్పారు.

ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారీ విక్రయ పరిమాణం ఉండే చౌక ఉత్పత్తుల అమ్మకాలు 7-8 శాతం పడిపోగా, తక్కువ విక్రయ పరిమాణం.. అధిక ధర ఉండే ఉత్పత్తుల అమ్మకాలు 8-9 శాతం పెరిగాయని ఆయన తెలిపారు. మొత్తం మీద బిస్కెట్ల విభాగం అమ్మకాల వృద్ధి గతంలో రెండంకెల స్థాయిలో ఉండేదని.. ప్రస్తుతం 2.5 శాతానికి పడిపోయిందని షా పేర్కొన్నారు. చౌక ఉత్పత్తుల విభాగం మొత్తం బిస్కెట్ల వ్యాపారంలో నాలుగో వంతే ఉన్నప్పటికీ.. అధిక పరిమాణంలో ఉత్పత్తి చేయాల్సినందున ఇందులో ఎక్కువ మంది సిబ్బంది ఉంటారని షా చెప్పారు. గతంలో కేజీకి రూ. 100 లోపు ధర ఉండే బిస్కెట్లకు ఎక్సైజ్ సుంకం నుంచి మినహాయింపు ఉండేదని ఆయన తెలిపారు. అయితే, 2017లో బిస్కెట్లను కూడా 18 శాతం జీఎస్‌టీ శ్లాబులో చేర్చినప్పట్నుంచీ పరిశ్రమకు సమస్యలు ప్రారంభమయ్యాయని షా చెప్పారు. అధిక జీఎస్‌టీ కారణంగా చౌక ఉత్పత్తుల రేట్లను కూడా తాము పెంచాల్సి వచ్చిందని, దీంతో డిమాండ్ పడిపోయిందని ఆయన తెలిపారు. జీఎస్‌టీపరమైన సమస్యలు సరిదిద్దాలంటూ పరిశ్రమ కోరుతున్నప్పటికీ .. ఇప్పటి వరకూ కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు. అయితే, ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రాఫిట్ ప్లస్ డైలీ

ఆర్‌టీజీఎస్ వేళలు మార్పు

ఉదయం 7 గం.ల నుంచే ప్రారంభం

ముంబై: భారీ పరిమాణంలో నగదు బదిలీకి ఉపయోగించే ఆర్‌టీజీఎస్ సిస్టమ్ వేళలను రిజర్వ్ బ్యాంక్ సవరించింది. ప్రస్తుతం ఆర్‌టీజీఎస్ ఉదయం 8 గం.ల నుంచి అందుబాటులో ఉంటుండగా.. ఇకపై ఉదయం 7 గం.ల నుంచి అందుబాటులో ఉంటుంది. ఆగస్టు 26 నుంచి ఈ మార్పు అమల్లోకి వస్తుంది. రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ (ఆర్‌టీజీఎస్) విధానంలో రూ. 2 లక్షల పైబడిన మొత్తాన్ని ఆన్‌లైన్‌లో బదిలీ చేయొచ్చు. దీని వేళలు ఇప్పుడు కస్టమర్ల లావాదేవీలకు సంబంధించి ఉదయం 8 నుంచి సాయంత్రం 6 దాకా, ఇంటర్‌బ్యాంక్ లావాదేవీల కోసం రాత్రి 7.45 దాకా ఉంటున్నాయి. ప్రస్తుతం రూ. 2 లక్షల లోపు నిధుల బదిలీ కోసం నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) ఉపయోగిస్తున్నారు. దీని వేళలు ఉదయం 8 నుంచి రాత్రి 7 దాకా ఉంటున్నాయి.

కార్డు చెల్లింపులకూ ఈ-మాండేట్...

వర్తకులు, వ్యాపార సంస్థలకు క్రెడిట్, డెబిట్ కార్డులు, వాలెట్స్ వంటివాటిద్వారా తరచూ చేసే చెల్లింపులకు కూడా ఈ-మాన్‌డేట్ విధానాన్ని వర్తింపచేసేందుకు ఆర్‌బీఐ అనుమతి నిచ్చింది. దీనికి రూ. 2,000 దాకా లావాదేవీ పరిమితి ఉంటుంది. ప్రస్తుత విధానం ప్రకారం కార్డుల ద్వారా చిన్న మొత్తాలు చెల్లించినా కూడా ప్రత్యేకంగా వన్ టైమ్ పాస్‌వర్డ్ వంటివి ఉపయోగించాల్సి వస్తున్నందువల్ల లావాదేవీకి ఎక్కువ సమయం పడుతోంది. తాజా వెసులుబాటుతో చిన్న మొత్తాల చెల్లింపు సులభతరమవుతుంది. ఈ-మాన్‌డేట్‌కు నమోదు చేసుకున్నందుకు కార్డ్‌హోల్డరు నుంచి ఎటువంటి రుసుము వసూలు చేయరాదని బ్యాంకులు/ఆర్థిక సంస్థలను ఆర్‌బీఐ ఆదేశించింది.

మారుతీ 'ఎక్స్‌ఎల్ 6' ఎంపీవీ

ప్రారంభ ధర రూ. 9.79 లక్షలు

న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా(ఎంఎస్ఐ).. తన అధునాతన మల్టీ పర్పస్ వెహికిల్ (ఎంపీవీ)ని బుధవారం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 'ఎక్స్‌ఎల్ 6' పేరిట విడుదలైన ఈ కారు ధరల శ్రేణి రూ. 9.79 లక్షలు-11.46 లక్షలు (ఎక్స్‌షోరూం)గా ప్రకటించింది. ప్రోగ్రెసివ్ స్మార్ట్ హైబ్రిడ్ సిస్టమ్, లిథియం-అయాన్ బ్యాటరీ కలిగి.. 1.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో అందుబాటులోకి వచ్చింది. ఫైవ్ స్పీడ్ మాన్యువల్, 4-స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లు ఈ కొత్త ఎంపీవీలో ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఉన్న నెక్సా ప్రీమియం రిటైల్ చైన్ల ద్వారా ఈ వాహనాన్ని కొనుగోలుచేయవచ్చని కంపెనీ వివరించింది. ఈ నూతన కారు విడుదలతో.. బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా మారుతీ నుంచి విడుదలైన మొత్తం కార్ల సంఖ్య ఏడుకు చేరింది.

షావోమి 'ఎంఐ ఏ3' @ 12,999

న్యూఢిల్లీ: చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ హ్యాండ్‌సెట్స్ తయారీ కంపెనీ 'షావోమి' తాజాగా ఆండ్రాయిడ్ వన్ ఆధారంగా పనిచేసే 'ఎంఐ ఏ3' స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్లోకి విడుదలచేసింది. దీని ప్రారంభ ధర రూ. 12,999 వద్ద నిర్ణయించినట్లు కంపెనీ బుధవారం ప్రకటించింది. 6.08 అంగుళాల డిస్‌ప్లే, వెనుకవైపు ట్రిపుల్ కెమెరా (48మెగా పిక్సెల్, 8ఎంపీ, 2ఎంపీ), ముందువైపు 32 ఎంపీ కెమెరా, 4,030 ఎంఏహెచ్ బ్యాటరీ ఈఫోన్ స్పెసిఫికేషన్లుగా వెల్లడించింది.

సెబీ 'స్మార్ట్' నిర్ణయాలు

మునిసిపల్ బాండ్ల ద్వారా స్మార్ట్ సిటీలకు నిధులు

- సూచీల్లోకి స్టార్టప్‌లు
- మ్యూచువల్ ఫండ్స్‌కు ఇన్వెస్ట్‌మెంట్ సూచనలు
- మరికొన్ని ప్రతిపాదనలకు సెబీ పచ్చజెండా

ముంబై: స్టార్టప్‌లకు జోష్‌నిచ్చే నిర్ణయాలను సెబీ తీసుకుంది. మునిసిపల్ బాండ్ల జారీ ద్వారా నిధులు సమీకరించుకునే వెసులుబాటును స్మార్ట్ సిటీస్‌కు కల్పించింది. వీటితో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు ఊరట నిచ్చే నిర్ణయాలను కూడా ప్రకటించింది. మరోవైపు ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసులకు సంబంధించి సమాచారమందించే వ్యక్తులకు రూ. కోటి నజరానా ఇస్తామని ప్రకటించింది. హౌసింగ్ ఫైనాన్స్, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ విభాగాలు కలిగిన కంపెనీలకు షేర్ల బైబ్యాక్‌కు సంబంధించిన నిబంధనలను సెబీ సరళీకరించింది. రుణ చెల్లింపుల విఫలానికి సంబంధించిన వివరాలను రేటింగ్ ఏజెన్సీలకు లిస్టెడ్ కంపెనీలు వెల్లడించడానికి సంబంధించిన నిబంధనలను కఠినతరం చేసింది. మ్యూచువల్ ఫండ్స్‌కు కూడా కఠిన నిబంధనలను జారీ చేసింది. బుధవారం సమావేశమైన సెబీ డైరెక్టర్ల బోర్డ్ పలు నిర్ణయాలు తీసుకుంది. వివరాలు..

- ఎఫ్‌పీఐల నో యువర్ కస్టమర్(కేవైసీ) నిబంధనలు మరింత సరళతరమయ్యాయి.
- స్మార్ట్ సిటీలు, సిటీ ప్లానింగ్, అర్బన్ డెవలప్‌మెంట్ విభాగాల్లో నమోదైన సంస్థలు మునిసిపల్ బాండ్లతో నిధులు సమీకరించవచ్చు.
- ప్రస్తుతం స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల ఇన్నోవేటర్స్ గ్రోత్ ప్లాట్‌ఫార్మ్‌పై నమోదైన స్టార్టప్‌లు ఇక నుంచి స్టాక్ సూచీలకు మారవచ్చు. అయితే, దీనికి కొన్ని షరతులు వర్తిస్తాయి.
- ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు సంబంధించి సమాచార మందించే వ్యక్తులు, సంస్థలకు (విజిల్ బ్లోయర్స్) రూ.కోటి దాకా నజరానా ఇవ్వనున్నారు. కంపెనీ ఆడిటర్లు దీనికి అనర్హులు.
- కంపెనీ చెల్లించిన మూలధనం, రిజర్వ్‌ల్లో 25%కి మించకుండా బైబ్యాక్ ఆఫర్ ఉండాలి. ఈ ఆఫర్ 10%కి మించినట్లయితే, ప్రత్యేక తీర్మానం ద్వారా ఈ బైబ్యాక్‌కు వాటాదారుల ఆమోదం పొందాల్సి ఉంటుంది.
- లిస్టింగైన లేదా లిస్టింగ్ కాబోతున్న ఈక్విటీ, డెట్ సెక్యూరిటీల్లోనే మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేస్తే మంచిది. అంతేకాకుండా రేటింగ్ లేని డెట్ సాధనాల్లో ప్రస్తుతం 25 శాతంగా ఉండే పెట్టుబడులను 5 శాతానికే పరిమితం చేయాలని కూడా సూచించింది.
- డెట్ పోర్ట్‌ఫోలియో స్కీమ్‌లు లిస్టింగ్ కాని ఎన్‌సీడీల్లో గరిష్టంగా 10 శాతం వరకూ ఇన్వెస్ట్ చేయవచ్చు. ఈ ప్రతిపాదిత పరిమితులపై కాలానుగుణంగా సమీక్షించి, అప్పటి పరిస్థితులకు తగ్గట్లుగా నిర్ణయాలు.
- రేటింగ్ లేని డెట్ సాధనాల్లో డిబెంచర్లు, ప్రభుత్వ సెక్యూరిటీలు, ఇంట్రెస్ట్ రేట్ స్వాప్స్, ఇంట్రెస్ట్ రేట్ ఫ్యూచర్స్, రెపో ఆన్ జీ-సెక్, ట్రెజరీ బిల్లులను మినహాయిస్తే, కొన్ని మాత్రమే ఇన్వెస్ట్ చేయడానికి మ్యూచువల్ ఫండ్స్‌కు మిగులుతాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బిల్స్ రీ-డిస్కౌంటింగ్(బీఆర్‌డీఎస్), మ్యూచువల్ ఫండ్ యూనిట్లు, రెపో ఆన్ కార్పొరేట్ బాండ్స్, రీట్స్/ఇన్విట్స్ యూనిట్లు ఈ జాబితాలో ఉన్నాయి.
- లిస్టైన కంపెనీల్లో ప్రజలకు ఉండాల్సిన కనీస వాటాను 25% నుంచి 35%కి పెంచాలన్న ప్రతిపాదనకు సంబంధించి వివిధ అంశాలను పరిశీలించాల్సి ఉందని సెబీ పేర్కొంది. అయితే లిస్టైన ప్రభుత్వ రంగ సంస్థల్లో 45 శాతం వరకూ ఇప్పటికీ, 25 శాతం నిబంధనను అందుకోలేకపోయాయి. అందుకని 35 శాతం పబ్లిక్ హోల్డింగ్‌కు సంబంధించిన వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని మరింతగా మదింపు చేయాల్సి ఉందని సెబీ పేర్కొంది.

మందగమన నష్టాలు

11,000 పాయింట్ల దిగువకు నిఫ్టీ

- మిశ్రమంగా అంతర్జాతీయ సంకేతాలు
- ప్యాకేజీపై రాని ప్రకటన
- రెండో రోజూ పతన బాట
- 268 పాయింట్లు పతనమై 37,060కు సెన్సెక్స్
- 98 పాయింట్లు నష్టంతో 10,919కు నిఫ్టీ

ఆర్థిక వ్యవస్థ మందగమన భయాలతో బుధవారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా రెండో రోజూ నష్టపోయాయి. ఇంట్రాడేలో 305 పాయింట్ల వరకూ నష్టపోయిన సెన్సెక్స్ చివరకు 268 పాయింట్లు పతనమై 37,060 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 98 పాయింట్లు నష్టపోయి 10,919 పాయింట్ల వద్దకు చేరింది. ముడి చమురు ధరలు 1 శాతం మేర పెరగడం ప్రతికూల ప్రభావం చూపించింది. ఇక డాలర్‌తో రూపాయి మారకం విలువ 22 పైసలు పెరిగి 71.49కు పెరగడం ఎలాంటి సానుకూల ప్రభావం చూపించలేకపోయింది. కన్సూమర్ గూడ్స్, బ్యాంక్, లోహ, ఆర్థిక రంగ షేర్లు క్షీణించాయి. ఒక్క ఐటీ రంగ షేర్లు మాత్రమే లాభపడ్డాయి.

384 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్

పలు కంపెనీలు అమ్మకాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఉద్యోగాల్లో కోత విధిస్తున్నాయి. వృద్ధి జోష్‌ను పెంచడానికి, వినియోగదారుల సెంటిమెంట్‌ను బలపరచడానికి ప్రభుత్వం చర్యలు ప్రకటించాలని మార్కెట్ వర్గాలు కోరుతున్నాయి. ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వం ఊరించిందే కానీ, ఇంతవరకూ ఎలాంటి నిర్దిష్టమైన ప్రకటన చేయకపోవడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతిన్నది. సెన్సెక్స్ లాభాల్లో ఆరంభమైనా, ఆ తర్వాత నష్టాల్లోకి జారిపోయింది. ఒక దశలో 79 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ మరో దశలో 305 పాయింట్లు పతనమైంది. మొత్తం మీద రోజంతా 384 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. నికాయ్ మినహా మిగిలిన అన్ని ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ప్యాకేజీ ఆశల కారణంగా యూరప్ మార్కెట్లు లాభాల్లో ఆరంభమై, లాభాల్లోనే ముగిశాయి.

పదేళ్ల కనిష్టానికి టాటా మోటార్స్..

టాటా మోటార్స్ కంపెనీ షేరు ఇంట్రాడేలో 11 శాతం పతనమై పదేళ్ల కనిష్ట స్థాయి, రూ.109.55ను తాకింది. చివరకు 9.2 శాతం నష్టంతో రూ.112 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో అత్యధికంగా నష్టపోయిన షేర్ ఇదే. గత నాలుగు నెలల్లో ఈ షేర్ 53 శాతం క్షీణించింది. మనకు మారుతీ సుజుకీ ఎలాగో చైనాకు జీలీ ఆటోమొబైల్ హోల్డింగ్స్ అలాగ. ఈ ఏడాది తొలి ఆరు నెలల కాలంలో తమ నికర లాభం 40 శాతం తగ్గిందని ఈ కంపెనీ ప్రకటించింది. రానున్న ఆరు నెలల్లో కూడా పెద్దగా పురోగతి ఉండదని పేర్కొంది. జీలీ కంపెనీ పరిస్థితే ఇలా ఉంటే టాటా మోటార్స్ పరిస్థితి ఇంకెలాగ ఉంటుందోనన్న ఆందోళనతో అమ్మకాలు వెల్లువెత్తాయి. మరోవైపు టాటా మోటార్స్ రేటింగ్‌ను రేటింగ్ సంస్థ, క్రిసిల్ తగ్గించడం కూడా ప్రతికూల ప్రభావం చూపించింది. ఈ షేర్‌తో పాటు ఓఎన్‌జీసీ, యస్‌బ్యాంక్, కోల్ ఇండియా, భెల్, టాటా పవర్, సెయిల్, రిలయన్స్ క్యాపిటల్, ఓకార్డ్, అలహాబాద్ బ్యాంక్ తదితర బీఎస్ఈ 500 సూచీలోని 31 షేర్లు కూడా ఐదేళ్ల కనిష్టానికి పడిపోయాయి. ఐటీసీ, టాటా స్టీల్ షేర్లు రెండేళ్ల కనిష్టానికి తగ్గాయి. దాదాపు 300కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి.

- యస్ బ్యాంక్ షేర్ 8.2 శాతం నష్టంతో రూ.65.40 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 9.4 శాతం పతనమై ఐదేళ్ల కనిష్ట స్థాయి, రూ.64.50ను తాకింది. సెన్సెక్స్‌లో అత్యధికంగా నష్టపోయిన రెండో షేర్ ఇది. ఆర్థికంగా అవకతవకలు జరిగాయన్న వార్తలు వచ్చిన సీజీ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ కంపెనీలో ఈ బ్యాంక్‌కు 12.79 శాతం మేర వాటా ఉంది.
- మార్కెట్ బలహీనంగా ఉన్నప్పటికీ, నెస్లే ఇండియా, గ్లాక్సోస్మిత్‌లైన్ కన్సూమర్ హెల్త్‌కేర్, ట్రెంట్ షేర్లు జీవిత కాల గరిష్ట స్థాయిలకు ఎగిశాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	1,969
ఎన్ఎస్ఈ	28,128
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	13,16,964
ఎఫ్ఐఐ	-774
డీఐఐ	354

నిఫ్టి 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
HEROMOTOCO	2,713.00	1.64
MARUTI	6,250.90	0.97
INFY	799.25	0.82
TECHM	673.7	0.72
EICHERMOT	15,980.00	0.53
HINDUNILVR	1,853.00	0.52
BAJAJ-AUTO	2,754.20	0.41
BRITANNIA	2,402.00	0.36
HDFCBANK	2,225.70	0.23
KOTAKBANK	1,507.00	0.13

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	112	-9.57
IBULHSGFIN	474.8	-8.94
YESBANK	65.05	-8.64
GRASIM	695.05	-4.69
TATASTEEL	342	-4.54
GAIL	122.3	-3.97
COALINDIA	188.65	-3.41
ULTRACEMCO	3,907.95	-3.1
INDUSINDBK	1,364.50	-2.87
ONGC	121.7	-2.68

ఐడియాలపై బ్యాంకుల రెండో విడత సమావేశాలు..

బ్యాంకింగ్ రంగం కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకునే దిశగా మేథోమథనం చేసేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) నేటి నుంచి మరో విడత సమావేశం కానున్నాయి. గురువారం నుంచి రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయిలో ఈ సమావేశాలు జరుగుతాయి. తొలి విడతలో జిల్లా స్థాయి సమావేశాల్లో వచ్చిన ఐడియాలు, సూచనలను ఇందులో చర్చించనున్నారు. ప్రధానంగా రాష్ట్రాల రాజధానుల్లో.. 30 ప్రాంతాల్లో జరిగే ఈ సమావేశాల్లో మధ్యస్థాయి మేనేజ్‌మెంట్ అధికారులు పాల్గొనున్నారు.

ఈపీఎఫ్‌ఓ ఫండ్ మేనేజర్ల ఎంపిక

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఫండ్ మేనేజర్లుగా యూటీఐ ఏఎంసీ, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఎంపికయ్యాయి. మూడేళ్ల కాలానికి వీటిని నియమిస్తూ ట్రస్టీల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే, సంక్షోభంలో చిక్కుకున్న దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (డీహెచ్ఎఫ్ఎల్) బాండ్లలో ఇన్వెస్ట్ చేసిన రూ. 700 కోట్ల మొత్తాన్ని కాలావధికి ముందుగానే ఉపసంహరించుకునే ప్రతిపాదనకు కూడా ఈపీఎఫ్‌వో ఆమోదం తెలిపింది.

వృద్ధి 5.7 శాతమే: నోమురా

ఏప్రిల్-జూన్‌పై అంచనా

భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కేవలం 5.7 శాతమే నమోదవుతుందని జపాన్ బ్రోకరేజ్ సంస్థ- నోమురా అంచనావేసింది. వినియోగం పడిపోవడం, పెట్టుబడుల బలహీనత, సేవల రంగం పేలవంగా ఉండడం దీనికి కారణంగా పేర్కొంది. అయితే జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో వృద్ధి రేటు కొంత మెరుగుపడే అవకాశం ఉంటుందని సంస్థ అంచనావేసింది. మందగమన పరిస్థితులకు ఇక తొలగిపోతున్నట్లు సంకేతాలు అందుతున్నట్లు సంబంధిత ఇండికేటర్స్ సూచిస్తున్నట్లు తెలిపింది. 2018-19లో 6.8 శాతం వృద్ధి నమోదయిన సంగతి తెలిసిందే. ఆగస్టు 30వ తేదీన ఏప్రిల్-జూన్ త్రైమాసిక గణాంకాలు వెలువడనున్న సంగతి తెలిసిందే.

వృద్ధి బలహీనతే... రేటు కోతకు కారణం

ఆగస్టు 7 విధాన ప్రకటనపై ఆర్‌బీఐ మినిట్స్ విడుదల

ముంబై: భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు బలహీనత వల్లే ఆగస్టు 7 విధాన సమీక్ష సందర్భంగా 0.35 శాతం రేటు కోత నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పేర్కొంది. ఆగస్టు 7 పాలసీ ప్రకటన సందర్భంగా ఆర్‌బీఐ 35 బేసిస్ పాయింట్లు తగ్గించిన సంగతి తెలిసిందే. దీనితో వరుసగా నాలుగు ద్వైమాసిక సమీక్షల్లో ఆర్‌బీఐ 1.1 శాతం రెపోరేటు తగ్గించినట్లయ్యింది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు- రెపో 5.4 శాతానికి దిగివచ్చింది. ఇది తొమ్మిదేళ్ల కనిష్టస్థాయి. ఆగస్టు 7 పాలసీ ప్రకటనకు సంబంధించి ఆర్‌బీఐ బుధవారం మినిట్స్‌ను విడుదల చేసింది.

మినిట్స్‌లో కొన్ని ముఖ్యాంశాలు చూస్తే..

- సాధారణంగా పావుశాతం రెపోరేటు నిర్ణయమే జరుగుతుంటుంది. అయితే అసాధారణ రీతిలో 7వ తేదీన 0.35 శాతం కోత నిర్ణయం వచ్చింది. ఆర్‌బీఐ గవర్నర్‌సహా నలుగురు ఇందుకు ఓటుచేశారు. ఇరువురు మాత్రం 25 బేసిస్ పాయింట్ల కోతకే మొగ్గు చూపారు.
- దేశీయ, అంతర్జాతీయ కారణాల వల్ల వృద్ధి రేటు మందగించింది. ఈ నేపథ్యంలో దేశీయ డిమాండ్ పెరగాలని, పెట్టుబడుల క్రియాశీలతకు మద్దతునివ్వాలని పరపతి ద్రవ్య విధాన కమిటీ నిర్ణయించింది.
- అంతక్రితం మూడు ద్వైమాసిక సమావేశాల్లో జరిగిన 0.75 శాతం రేటు అమలు వాస్తవ రూపంలోకి క్రమంగా వస్తోందని కూడా ఆర్‌బీఐ భావించింది.
- వచ్చే ఏడాది కాలంలో కూడా ద్రవ్యోల్బణం రేటు ప్రభుత్వ నిర్దేశిత ప్లస్ లేదా మైనస్ 2 శాతం వద్దే నిలకడగా ఉంటుందని గవర్నర్ సమావేశంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రేటు కోత, వృద్ధికి ప్రోత్సాహం ఆర్‌బీఐకి కీలకంగా ఉందని అన్నారు.

క్యాబ్‌లు, అద్దె కార్లకే మొగ్గు!

ఎస్‌బీఐ చైర్మన్ విశ్లేషణ

జెప్పూర్: డిజిటల్ లావాదేవీలను గణనీయంగా పెంచే దిశగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ నిర్ణయాలను తీసుకుంటోంది. ఇందులో భాగంగా 'యోనో' క్యాష్ పాయింట్ల సంఖ్యను పెంచనున్నట్లు బ్యాంక్ చైర్మన్ రజనీష్ కుమార్ బుధవారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ప్రస్తుతం 70,000 క్యాష్ పాయింట్లు ఉండగా.. వీటి సంఖ్యను వచ్చే 18 నెలల్లో 10 లక్షలకు చేర్చనున్నామని వెల్లడించారు. డిజిటల్ చెల్లింపుల వినియోగం పెరిగే చర్యలు తీసుకోవడం వల్ల డెబిట్ కార్డు వాడకం తగ్గిపోతుందని, కార్డుల జారీని నిలిపివేసే యోచన తమకు లేదని స్పష్టంచేశారు. ఆటోరంగ మందగమనంపై మాట్లాడిన ఆయన.. 'ఉద్యోగాల్లో అనిశ్చితి కారణంగా వినియోగదారులు సొంత కార్లను కొనుగోలు చేయడం కంటే.. క్యాబ్‌లు, అద్దెకార్లకే మొగ్గుచూపుతున్నారు. ఈ ప్రభావం ఎంత మేర ఉందనే విషయాన్ని పరిశీలించాలి' అని విశ్లేషించారు.

నోట్‌బుక్స్‌లో 25 శాతం వాటా: ఐటీసీ



కొత్త నోట్‌బుక్స్‌తో శైలేంద్ర, రవినారాయణన్ (కుడి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నోట్‌బుక్స్ మార్కెట్ దేశంలో రూ.6,000 కోట్లుంది. ఈ రంగంలో ఐటీసీ క్లాస్‌మేట్‌కు 25 శాతం వాటా ఉందని కంపెనీ ఎడ్యుకేషన్, స్టేషనరీ ప్రొడక్ట్స్ బిజినెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ శైలేంద్ర త్యాగి తెలిపారు. పల్స్ 3డీ నోట్‌బుక్స్‌ను విడుదల చేసిన సందర్భంగా సేల్స్ హెడ్ రవినారాయణన్‌తో కలిసి బుధవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. 'పరిశ్రమ వృద్ధి రేటు ఏటా 4-5 శాతముంది. క్లాస్‌మేట్ రెండంకెల వృద్ధి నమోదు చేస్తోంది. ఏటా 38 కోట్ల నోట్‌బుక్స్ అమ్ముతున్నాం. కంపెనీ మొత్తం ఉత్పత్తిలో భద్రాచలం యూనిట్ 60 శాతం సమకూరుస్తోంది' అని వివరించారు.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	38,430	0
బంగారం (22 క్యారెట్లు)	36,600	0
వెండి (కిలో)	48,200	0
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	37,740	▲ 100
బంగారం (22 క్యారెట్లు)	35,940	▲ 100
వెండి (కిలో)	48,200	0
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	37,740	▲ 100
బంగారం (22 క్యారెట్లు)	35,940	▲ 100
వెండి (కిలో)	48,200	0
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	37,250	0
బంగారం (22 క్యారెట్లు)	34,500	▲ 80
వెండి (కిలో)	43,800	▲ 300
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	38,680	▲ 150
బంగారం (22 క్యారెట్లు)	35,980	▲ 140
వెండి (కిలో)	45,500	0
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	38,850	▼ 110
బంగారం (22 క్యారెట్లు)	35,940	▼ 0
వెండి (కిలో)	48,200	0

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	56.12 (రాత్రి 11.30కు)	$ 56.13 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	60.61 (రాత్రి 11.30కు)	$ 60.03 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 22-08-2019

విశాఖ	361-00
చిత్తూరు	358-00
వరంగల్	323-00
చెన్నై	365-00
ముంబై	375-00
విజయవాడ	335-00
నమక్కల్	368-00
గోదావరి	330-00
21-08-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	320-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.80
బెంగళూరు	355-00
కోల్‌కత్త	365-00
ఢిల్లీ	342-00

కంపెనీల మైండ్‌సెట్ మారాలి

ప్రధాన ఆర్థిక సలహాదారు సుబ్రమణియన్

ముంబై: లాభాలు వచ్చినప్పుడు జేబులో వేసుకునే ప్రైవేటు సంస్థలు ..నష్టాలు వచ్చినప్పుడు సమాజంలో అందరికీ పులిమే ప్రయత్నాలు మానుకోవాలని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ హితవు పలికారు. అలాగే కష్ట కాలంలో ప్యాకేజీలు ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని కోరడం సరికాదని ఆయన చెప్పారు. ఈ విషయంలో ప్రైవేట్ సంస్థల 'మైండ్‌సెట్' మారాలని చెప్పారు. ఎకానమీ వృద్ధి చెందడానికి వినియోగం కన్నా పెట్టుబడులే ఎక్కువగా దోహదపడతాయన్నారు.

పెరిగిన టెల్కోల ఆదాయాలు

అయిదేళ్ల వ్యవధిపై ట్రాయ్ నివేదిక

న్యూఢిల్లీ: గడిచిన అయిదేళ్లలో మొబైల్ డేటా చార్జీలు ఏకంగా 95 శాతం తగ్గాయి. జీబీకి రూ.11.78 స్థాయికి దిగివచ్చాయి. అయితే టెలికం ఆపరేటర్ల సంచిత ఆదాయం మాత్రం 2.5 రెట్లు పెరిగి రూ. 54,671 కోట్లకు చేరింది. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 2014లో దేశీయంగా డేటా వినియోగం 828 మిలియన్ జీబీగా ఉండగా, 2018లో ఇది 56 రెట్లు పెరిగి 46,404 మిలియన్ జీబీకి పెరిగింది. అలాగే యూజర్లపరంగా సగటు డేటా వినియోగం 0.27 జీబీ నుంచి 7.6 జీబీ దాకా పెరిగింది. ఇక ప్రతి యూజరుపై సగటు ఆదాయం 2014లో రూ. 71.25గా ఉండగా 2018లో ఇది రూ. 90.02కి చేరింది. 2014లో వైర్‌లెస్ డేటా యూసేజి విభాగం ద్వారా మొత్తం ఆదాయం రూ. 22,265 కోట్లు రాగా.. గతేడాది రూ. 54,671 కోట్లకు చేరినట్లు ట్రాయ్ నివేదిక పేర్కొంది. మరోవైపు, యూజరుకు వైర్‌లెస్ డేటా ఖరీదు సగటున రూ. 269 (జీబీకి) నుంచి రూ. 11.78కి పడిపోయిందని వివరించింది.

కాఫీ డే రేసులో లేము: ఐటీసీ

న్యూఢిల్లీ: రుణభారంలో ఉన్న కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్‌ను (సీడీఈ) కొనుగోలు చేయబోతోందన్న వార్తలను వ్యాపార దిగ్గజం ఐటీసీ ఖండించింది. సీడీఈ కొనుగోలు రేసులో తాము లేమని స్పష్టం చేసింది. 'ఐటీసీకి ఇలాంటి ప్రతిపాదనలు తరచూ వస్తుంటాయి. వాటిని పరిస్థితులను బట్టి మదింపు చేయడం జరుగుతుంటుంది. కేఫ్ కాఫీ డేకి సంబంధించి ఒక మధ్యవర్తిత్వ సంస్థ నుంచి ఇలాంటి ప్రతిపాదనే వచ్చింది. అయితే, ఈ విషయంలో ఎలాంటి పురోగతి మాత్రం లేదు' అని ఐటీసీ ప్రతినిధి తెలిపారు. రూ. 4,970 కోట్ల రుణభారం ఉన్న కాఫీ డే గ్రూప్ ప్రమోటరు వీజీ సిద్ధార్థ జూలైలో ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీనికి ఆర్థిక సమస్యలే కారణమనే అభిప్రాయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రుణభారాన్ని తగ్గించుకోవడానికి సీడీఈ అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ అసెట్స్‌ను విక్రయించడంపై దృష్టి సారిస్తోంది.

రూపీ.. రికవరీ.. 16 పైసలు అప్

71.55 వద్ద క్లోజింగ్

న్యూఢిల్లీ: డాలర్‌తో పోలిస్తే వర్ధమాన దేశాల కరెన్సీలు బలపడటంతో బుధవారం రూపాయి కూడా కొంత కోలుకుంది. దేశీ కరెన్సీ మారకం విలువ 16 పైసలు పెరిగి 71.55 వద్ద ముగిసింది. ఫారెక్స్ మార్కెట్లో క్రితం ముగింపుతో పోలిస్తే బుధవారం బులిష్‌గానే ప్రారంభమైన రూపాయి ట్రేడింగ్.. ఒక దశలో 71.36 గరిష్ట స్థాయిని కూడా తాకింది. చివర్లో 16 పైసలు లాభంతో ముగిసింది. దేశీ కరెన్సీ మంగళవారం ఆరు నెలల కనిష్ట స్థాయి 71.71కి పతనమైన సంగతి తెలిసిందే. ఆర్థిక అనిశ్చితి, విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటం, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరుగుతుండటం, అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధ భయాలు తదితర ప్రతికూల పరిస్థితులు నెలకొన్నప్పటికీ రూపాయి కోలుకోవడం గమనార్హమని ఫారెక్స్ ట్రేడర్లు పేర్కొన్నారు. 'వరుసగా నాలుగు సెషన్లుగా బ్రెంట్ క్రూడ్ ధర పెరుగుతూనే ఉన్నప్పటికీ, డాలర్ ఇండెక్స్ అధిక స్థాయుల్లో కొనసాగుతున్నప్పటికీ రూపాయి మాత్రం గడిచిన రెండు సెషన్లలో వాటిల్లిన నష్టాలను కొంత మేర భర్తీ చేసుకోగలిగింది' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ హెడ్ (పీసీజీ, క్యాపిటల్ మార్కెట్స్ స్ట్రాటెజీ విభాగం) వీకే శర్మ చెప్పారు. అమెరికా, చైనా మధ్య వాణిజ్య చర్చల ప్రభావాలపై ఇన్వెస్టర్లు ఒక అంచనాకు వస్తుండటంతో వర్ధమాన మార్కెట్ కరెన్సీలు కాస్త బలపడ్డాయని ఆయన వివరించారు.

మార్కెట్లోకి 'బీఎండబ్ల్యూ కొత్త 3 సిరీస్ సెడాన్'

ధరల శ్రేణి రూ. 41.4లక్షలు - 47.9లక్షలు

గురుగ్రామ్: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ 'బీఎండబ్ల్యూ' తాజాగా తన '3 సిరీస్ సెడాన్'లో సరికొత్త వేరియంట్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఎయిట్ స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్, 2-లీటర్ల ఇంజిన్ కలిగిన ఈ నూతన మోడల్ మొత్తం మూడు వేరియంట్లలో అందుబాటులోకి వచ్చింది. రెండు డీజిల్ ఇంజిన్ కార్లు విడుదల కాగా, వీటి ధరల శ్రేణి రూ. 41.4లక్షలు - రూ.46.9 లక్షలుగా కంపెనీ ప్రకటించింది. డీజిల్ ఇంజిన్ కారు ప్రారంభ ధర రూ.47.9 లక్షలుగా నిర్ణయించామని, నూతన మోడల్.. మునుపటి సిరీస్‌ల కంటే 55 కేజీల బరువు తక్కువగా ఉందని వివరించింది. కారు ఫీచర్ల విషయానికి వస్తే.. వైర్‌లెస్ చార్జింగ్, ఆపిల్ కార్‌ప్లే ఇన్ఫోటైన్‌మెంట్, 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్, భద్రత కోసం 6 ఎయిర్ బ్యాగులు ఉన్నాయి.

కంపెనీలకు మందగమనం కష్టాలు

- భారీగా తగ్గిన ఆదాయాలు, లాభాలు
- కేర్ రేటింగ్స్ నివేదిక వెల్లడి

ముంబై: ఆర్థిక వ్యవస్థ మందగమన ప్రభావం కంపెనీలపై తీవ్రమైన ప్రభావమే చూపుతోంది. ఈ మందగమనం కారణంగా ఈ జూన్ క్వార్టర్‌లో పలు కంపెనీల ఆదాయాలు, లాభాల వృద్ధి భారీగా తగ్గాయని కేర్ రేటింగ్స్ తాజా నివేదిక పేర్కొంది. మొత్తం 2,976 కంపెనీల ఆర్థిక ఫలితాలను విశ్లేషించి కేర్ రేటింగ్స్ సంస్థ ఈ నివేదికను రూపొందించింది.

ఈ నివేదిక ఏం చెప్పిందంటే..

- భారత కంపెనీల నికర అమ్మకాల వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో 4.6 శాతానికి తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో ఇది 13.5 శాతంగా ఉంది.
- గత క్యూ1లో 24.6 శాతంగా ఉన్న నికర లాభ వృద్ధి క్యూ1లో 6.6 శాతానికి తగ్గింది.
- బలహీనంగా, అంతంతమాత్రంగానే ఉన్న ఈ క్యూ1 ఫలితాలు.. ఆర్థిక వ్యవస్థ, వివిధ రంగాల పరిశ్రమలు మందగమనంలోకి జారిపోయాయని సూచిస్తున్నాయి.
- ఇంత తీవ్ర స్థాయి ఇబ్బందుల్లోనూ ఊరట నిచ్చే విషయం ఒకటుంది. సంఘటిత రంగంలోని ఉద్యోగాలపై మందగమన ప్రభావం పెద్దగా లేదు. ఈ రంగ ఉద్యోగుల వ్యయాల వృద్ధి నిలకడగానే కొనసాగుతోంది. కొన్ని రంగాల్లో ఉద్యోగాల వేతనాలు 11 శాతం మేర పెరిగాయి కూడా.
- మార్చి క్వార్టర్‌లో వృద్ధి ఐదేళ్ల కనిష్టానికి, 5.8 శాతానికి పడిపోయింది.జూన్ క్వార్టర్‌లో మరింతగా దిగజారే ప్రమాదం ఉంది.
- గత క్యూ1లో రెండంకెల వృద్ధి సాధించిన నిర్వహణ లాభ వృద్ధి ఈ క్యూ1లో 4.1 శాతానికి పడిపోయింది. నిర్వహణ లాభ మార్జిన్ మాత్రం నిలకడగా 20 శాతం స్థాయిలో ఉంది.
- గత క్యూ1లో 53% వృద్ధి సాధించిన నికర లాభం ఈ క్యూ1లో 12 శాతానికి తగ్గింది.
- బ్యాంక్‌లు, ఆర్థిక కంపెనీలు మినహా ఇతర కంపెనీల పన్ను చెల్లింపులు 19% తగ్గింది. గత క్యూ1లో ఇది 52% వృద్ధి చెందింది.

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	350.7	354.95
ASIAN PAINT	1589.15	1595.15
AXIS BANK	664.7	672.35
BAJAJ AUTO	2764.8	2742.95
BAJAJ FINSE	7145.85	7236.15
BAJAJ FINAN	3261.45	3294.1
BHARTI AIRTEL	354.9	358.05
BPCL	327.8	342.25
BRITANNIA	2384.5	2393.5
CIPLA LTD	468.05	478.7
COAL INDIA	188.8	195.3
EICHER MOTO	16000.5	15895.75
GAIL (INDIA)	122.5	127.35
GRASIM INDU	698.8	729.25
HCL TECHNOL	1070.15	1084
HDFC LTD	2066.9	2090.1
HDFC BANK L	2225.85	2220.6
HERO MOTOCO	2714.25	2669.25
HINDALCO I	177.05	179.4
HUL	1850	1843.4
INDIABULLS	483.55	521.4
ICICI BANK	412.05	416.9
INDUSIND BA	1367.2	1404.85
BHARTI INFR	248.25	255.55
INFOSYS LIM	799.45	792.75
INDIAN OIL	121.05	124.2
ITC LTD	241.45	246.5
JSW STEEL L	219	224.85
KOTAK MAHIN	1505.75	1505.1
LARSEN & T	1310.65	1342.5
MAHINDRA &M	520.9	527.8
MARUTI SUZU	6228.9	6190.95
NTPC LTD	117.9	117.95
ONGC	121.2	125.05
POWER GRID	204.9	206.05
RIL	1270.95	1275.95
SBI	277.4	283.7
SUN PHARMA	417	420.9
TATA MOTORS	112.4	123.85
TATA STEEL	343	358.25
TCS	2186.2	2186.75
TECH MAHIND	672.8	668.9
TITAN COMPA	1065.3	1092.35
ULTRATECH C	3921.4	4033.05
UPL LIMITED	535.9	539.9
VEDANTA LIM	139.95	142.4
WIPRO LTD	252.4	253.3
YES BANK LI	65.4	71.2
ZEE ENTERTA	344.2	350.85

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

ABB INDIA L	1359.35	1364.95
ACC LIMITED	1485.65	1540.85
AMBUJA CEME	201.1	205.85
ASHOK LEYLA	61.9	63.85
BAJAJ HOLDI	3351.5	3351

ప్రాణం పోకడ చెప్పేస్తాం..!

వాన రాకడ.. ప్రాణం పోకడ తెలియదనే సామెత ఉంది.. కానీ సాంకేతికత పుణ్యమా అని వాన రాక గురించి కొంచెం అటు ఇటుగా నైనా తెలుస్తోంది. ఇక ప్రాణం పోకడ గురించి తాము చెబుతామని మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బయాలజీ అండ్ ఏజింగ్ శాస్త్రవేత్తలు అంటున్నారు. అది కూడా ఒక్క రక్త పరీక్ష ద్వారా చెప్పేస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. రానున్న 5 నుంచి పదేళ్లలో ఓ వ్యక్తి మరణిస్తారా లేదా అనే విషయానికి సంబంధించిన గుర్తులను (బయోమార్కర్స్)ను తాము గుర్తించామని చెబుతున్నారు. 14 గుర్తులు నిర్దిష్టమైన వ్యాధికి సూచికలు కాకపోగా.. జీవక్రియలు, కొవ్వులు జీర్ణమయ్యే ప్రక్రియ, మంట/వాపు, రక్తంలో చక్కెరల మోతాదు వంటి అంశాల ఆధారంగా పనిచేస్తాయి. సుమారు 44 వేల మందిపై ఈ పద్ధతిని పరీక్షించి చూశామని.. అన్ని వయసుల వారు, ఆడ, మగ తేడా లేకుండా ఈ పరీక్ష సరైన ఫలితాలిచ్చిందని శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న వాళ్లందరూ యూరోపియన్ సంతతికి చెందిన వారే. అయితే ఇతర ప్రాంతాల ప్రజలతోనూ ఈ పద్ధతి కచ్చితమైన ఫలితాలను ఇస్తుందా లేదా అన్నది విశ్లేషించాల్సి ఉందని అమండా హాస్లేగ్రేవ్ అనే శాస్త్రవేత్త తెలిపారు. అయితే ఈ పరిశోధనను వ్యాధుల చికిత్సకు ప్రస్తుతం ఉపయోగించే మందుల సమర్థతను అంచనా వేసేందుకు ఉపయోగించుకోవచ్చని అమండా చెప్పారు.

'వన్ కీ'తో మీ కారు స్మార్ట్..

మొబైల్‌ఫోన్ల ద్వారా కార్ ఇంజన్లను ఆన్/ఆఫ్ చేయడం మీరు చూసే ఉంటారు. ఈ టెక్నాలజీ ఉన్న కార్లను కొనడం కొంచెం ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని. కానీ ఫొటోలో కనిపిస్తోందే.. ఆ గాడ్జెట్ మీ కారులో ఉంటే చాలు.. సాధారణమైన వాహనం కూడా స్మార్ట్‌గా మారిపోతుంది. కొరియాకు చెందిన 'వన్ కీ'కంపెనీ ఈ సరికొత్త గాడ్జెట్‌ను ఆవిష్కరించింది. ఈ పరికరం ఉన్న కారు దగ్గరకు వెళ్లినప్పుడు స్మార్ట్‌ఫోన్‌లో అమర్చిన అప్లికేషన్ ద్వారా బ్లూటూత్, అల్ట్రా సౌండ్ సంకేతాలు వెళ్తాయి. గాడ్జెట్‌కు, స్మార్ట్‌ఫోన్‌కు ఉన్న దూరాన్ని బట్టి ముందు తలుపు లేదంటే వెనుక వైపు ఉన్న తలుపు తెరుచుకుంటుంది.

ఆ తర్వాత కారు లోపలకు ప్రవేశించగానే ఇంజన్ స్టార్ట్ అవుతుంది. అవసరమైనప్పుడు ఈ నియంత్రణను ఇతరులకు అందించేందుకూ ఏర్పాట్లు ఉన్నాయి.

పేపర్.. ఇది సూపర్!

ఫొటోలో కనిపిస్తున్నది కాగితమేగానీ.. కొంచెం ప్రత్యేకమైంది. నీళ్లలో పెరిగే నాచుమొక్కలతో తయారైంది. స్వీడన్‌లోని ఉప్సల, బంగ్లాదేశ్‌కు చెందిన ఢాకా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సంయుక్తంగా దీన్ని తయారు చేశారు. దీని ప్రత్యేకత ఏంటంటే.. శుద్ధమైన నీటిని పొందేందుకు ఈ కాగితాన్ని వాడుకోవచ్చు. పిథోఫోరా అనే నాచు మొక్కలతో తయారు చేసిన ఈ కాగితంలో అతిసూక్ష్మమైన రంధ్రాలు ఉంటాయి. నీటి అణువులు వెళ్లేందుకు అవకాశమిస్తూనే బ్యాక్టీరియా, వైరస్‌లను అడ్డుకుంటాయి. అతి సులువుగా ఎక్కడికక్కడ తయారు చేసుకోగల ఈ కాగితం 99.9999 శాతం వరకు వ్యాధికారక బ్యాక్టీరియా, వైరస్‌లను అడ్డుకోగలదని పరీక్షల ద్వారా తెలిసింది. ఏసీఎస్ సస్టెయినబుల్ కెమిస్ట్రీ అండ్ ఇంజనీరింగ్ తాజా సంచికలో పరిశోధన వివరాలు ప్రచురితమయ్యాయి.

శాస్త్రీయంగానే ఎన్నికల ప్రక్రియ

మున్సిపల్ ఎన్నికల కేసులో ప్రభుత్వం కౌంటర్

సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల ముందస్తు ప్రక్రియను శాస్త్రీయంగానే పూర్తి చేశామని, రాత్రికి రాత్రే పూర్తి చేశామనే ఆరోపణ అవాస్తవమని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. అభ్యంతరాల పరిష్కారానికి ఐదు రోజుల సమయం తీసుకున్నామని వివరించింది. మొత్తం ఎన్నికల ప్రక్రియను 109 రోజుల నుంచి 8 రోజులకు తగ్గించామనేది అసత్యమని, వార్డుల విభజన ప్రక్రియ మాత్రమే 8 రోజుల్లో పూర్తి చేశామని వివరించింది. ఒకే ఒక్క రోజులోనే ఎలా చేశారని, ఇది నమ్మశక్యంగా లేదంటూ గత విచారణ సమయంలో హైకోర్టు వ్యాఖ్యానించింది. కౌంటర్ దాఖలు చేసిన తీరును కూడా తప్పుపట్టింది. దీంతో ధర్మాసనం ఆదేశాలకు అనుగుణంగా మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ సమగ్రంగా 21 పేజీల కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. ఇదే విషయాన్ని బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం దృష్టికి ప్రభుత్వ అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు తీసుకెళ్లారు. రిజర్వేషన్ల ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని పేర్కొంటూ జిల్లా కేంద్రమైన నిర్మల్‌కు చెందిన కె.అంజుకుమార్‌రెడ్డి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. గురువారం ఈ పిల్‌పై విచారణ జరపాలని అదనపు ఏజీ కోరారు. అయితే పిటిషనర్ న్యాయవాది వాదనలు కూడా తెలియజేసే నిమిత్తం విచారణను 28వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

ఓబీసీలకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలి

ఎన్ఓబీసీఎఫ్ అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర మంత్రివర్గంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని జాతీయ ఓబీసీ ఫెడరేషన్ (ఎన్ఓబీసీఎఫ్) అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కలను సమగ్రంగా బయటపెట్టడంతో పాటు ఓబీసీల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు మరో కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. 2021లో జనగణన చేసిన తర్వాత బీసీల వర్గీకరణ చేసి సంచార జాతులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. దేశంలో 56 శాతం ఉన్న ఓబీసీలకు విద్య, ఉద్యోగాల్లో 27 రిజర్వేషన్లు అమలు చేయాలని మాజీ ఎంపీ దేవేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఓబీసీల సమస్యలపై త్వరలో రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి నివేదిస్తామని తెలిపారు.

TVS Racing
TVS

*TVS Apache RTR 160 4V starts at Low Down Payment of Rs 10,999. *Finance at the sole discretion of the financier. **Savings on retail finance scheme. T & C apply

FOR ALL INSTITUTIONAL/BULK REQUIREMENTS PLEASE MAIL corporate.customersupport@tvsmotor.com AUTHORISED MAIN DEALERS: TELENGANA: ADARSHA TVS, KARIMNAGAR: 9870261378, ADARSHA TVS, JAGITYAL ROAD: 8106505757 ,TIRUMALA TVS, GODAVARIKANI: 9870261768, VINAY TVS, NIRMAL: 9870261738, VINAY TVS, MANCHERIAL: 9870262747, VIJAY TVS, ADILABAD: 9870260647, RAJA TVS, WARANGAL: 9870262717, RANGARAYA TVS, WARANGAL: 9870262499 , ADARSHA TVS, HANAMKONDA: 9870262575, LAKSHMI TVS, NIZAMABAD: 9870260660, LAKSHMI TVS, ARMOOR ROAD, NIZAMABAD: 9870261880, LAKSHMI TVS, BHODAN: 9821592327, SRI SAI SRINIVASA TVS, KAMAREDDY: 9870260524, SRI SAI SRINIVASA TVS, ARMOOR: 9870261351, RANGA RAYA TVS, KHAMMAM: 9870262375, RANGA RAYA TVS, KOTHAGUDAM: 9870262731, INDUBAALA TVS, KODADA: 9870263043, LCGC TVS, MIRYALAGUDA: 9870263051, SREE LV TVS, NALGONDA: 9870262988, SREE LV TVS, DVK ROAD: 9870262307, SREE LV TVS, BHONGIR: 9069139151, SRI RAMA TVS, MEHBOOBNAGAR: 9069138235, SRI RAMA TVS, BOOTHPUR ROAD: 9821597045, SRI RAMA TVS JEDCHERLA: 9069138250, VENKATESH TVS, GADWAL: 9069138240, ANJALI TVS, WANARPATHY: 9870259780.

McCann/Blr/Tvs/745/08/19

Mahindra Rise.

with you hamesha 1800-209-6006
UDAY
10 లక్షల రూపాయల దుర్ఘటన ఇన్స్యూరెన్స్ మరియు ఇతర ఆకర్షణీయమైన సదుపాయాలు కేవలం ఉదయ్ సభ్యులకై.
చూపించిన ఆక్సెసరీలు ప్రమాణిత వాహనంలో భాగం కావు. అధిక సమాచారానికై దయచేసి మీకు దగ్గర్లోగల డీలర్‌ని సంప్రదించండి.
*ఏది ముందైతే అది. నియమ నిబంధనలు వర్తిస్తాయి.

SANSAI AUTO SERVICES PVT LTD.: NALGONDA , MIRYALGUDA , SURYAPET PH: 8448005423

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

epaper.sakshi.com